Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

గురువారం, మార్చి 27, 2025 | సంపుటి - 20 | సంచిక 175 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## పంబన్ బ్రిడ్జికి త్వరలో మోడీ ప్రారంభోత్సవం



చెన్నై : తమిళనాడులోని సముద్ర తీరంలో ఉన్న చారిత్రక పంబన్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో అదే పేరుతో కొత్త పంబన్ బ్రిడ్జిని నిర్మించారు. ఆధునిక ఇంజనీరింగ్‌తో ప్రజలను, ప్రదేశాలను అనుసంధానిస్తూ వర్టికల్ లిఫ్ట్ విధానంలో భారత్‌తో నిర్మించి తొలి రైల్వే బ్రిడ్జి ఇదే కావడం విశేషం. వేగం, భద్రత, ఆవిష్కరణల కోసం రూపొందించిన బ్రిడ్జి ఇదంటూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల ఆ ఫోటోలను విడుదల చేశారు. దేశంలోని ప్రధాన భూభాగాన్ని తమిళనాడులోని రామేశ్వరం ద్వీపానికి ఈ బ్రిడ్జి కలుపుతుందని ఆయన తెలిపారు.

మిగతా 2లో

## తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్

- శాంతిభద్రతల విషయంలో రాజీలేదు
- గత బిఆర్ఎస్ భుత్వం లాగా వ్యవహరించడం లేదు
- శాంతిభద్రతలపై చర్చలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



హైదరాబాద్ : శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శాంతి భద్రతలు కాపాడేందుకు చాలా మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మతపరమైన ఉద్రిక్త పరిస్థితులకు తెలంగాణలో అవకాశం లేదని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం శాంతి భద్రతలపై చర్చ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ పోలీసులు రూ.185 కోట్లు బాధితులకు వాపస్ ఇచ్చారు.. ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ రికవరీ చేయలేదని తెలిపారు.

2లో

## రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం

- 30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- త్వరలోనే కార్డుదారులకు మరిన్ని నిత్యావసర సరుకులు
- మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక ఆధారంగా చర్యలు
- తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మించి తీరుతాం
- అసెంబ్లీలో స్పష్టం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ : రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం ఇస్తామన్న హామీని అమలు చేయబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుదారులతో కలసి అందరికీ దీనిని వర్తింప చేస్తామని అన్నారు. త్వరలోనే ఇతర నిత్యావసర వస్తువులను కూడా కార్డుదారులకు అందిస్తామని ప్రకటించారు.

మిగతా 2లో



## అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు నొక్కేస్తున్నారు

- సభా నిబంధనలకు విరుద్దంగా సిఎం ప్రకటన
- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై జడ్జిమెంట్ ఎలా ఇస్తారు
- అందుకే సభనుంచి వాకౌట్ చేశామన్న హరీష్ రావు

హైదరాబాద్ : పార్టీ మారిన ఎమ్మెల్యేలు వాపస్ పోతారనీ డౌట్ వచ్చిందేమో.. అందుకే ఉప ఎన్నికలు రావని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడాడని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు.

2లో



## లోక్‌సభలో ప్రతిపక్ష గొంతు నొక్కే కుట్ర

- స్పీకర్ సభ నడిపే తీరు ఇది కాదు
- మీడియాతో విపక్షనేత రాహుల్

న్యూఢిల్లీ : లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ స్పీకర్ ఓం బిర్లా తీరుపై మండిపడ్డారు. స్పీకర్ సభ నడుపుతున్న తీరు సరిగ్గా లేదని, ఇది అప్రజాస్వామికమని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నిసార్లు అభ్యర్థించినా స్పీకర్ తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని రాహుల్ ఆరోపించారు. రాహుల్ గాంధీ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. 'సభలో ఏం జరుగుతుందో నాకు తెలియదు. నాకు మాట్లాడే అవకాశం ఇవ్వమని స్పీకర్‌ని ఎన్నిసార్లు అభ్యర్థించినా..

మిగతా 2లో

# బెట్టింగ్ యాప్స్ నిషేధానికి సిట్

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టసవరణకు బిల్లు
- ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం
- శాంతిభద్రతలపై కొందరు అడ్డగోలు వ్యాఖ్యలు
- అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన



**బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల నిషేధానికి సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల యాప్స్ వల్ల జరుగుతున్న అనర్థాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు తాము అధికా ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. అందుకే తమ ఏడాదికి పైగా పాలనలో ఎలాంటి ఘటనలు లేవని చెప్పారు. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వీటిని నిరోధించడానికి స్పెషల్ ఇన్వేస్టిగేషన్ టీం సిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.**

హైదరాబాద్ :

బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. మన పరిధిలో విచారణ జరిపిస్తే సమస్యకు సరైన పరిష్కారం దొరకదన్నారు. ఈ కేసులో శిక్షపడేలా ప్రత్యేక చట్టం చేస్తామని కూడా అన్నారు. బెట్టింగ్ యాప్ ల వల్ల ఎంతోమంది బలైపోతున్నారని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నేరం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతోం దన్నారు. గుట్కా నిషేదం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ చేసిన వాళ్లను విచారిస్తే సరిపోదు.. బెట్టింగ్ యాప్ నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు ఉండాలన్నారు. మమ్మల్ని చంపుతారని కోర్టులో పిటిషన్ వేసినా వామనర్ రావు దంపతుల ప్రాణాలు దక్కలేదన్నారు. వామన్ రావు హత్య ఆరోపణలు ఎదుర్కొన్న వాళ్లను తప్పించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గంజాయి మత్తులో సింగరేణి కాలనీలో ఆరేళ్ళ చిన్నారిని దారుణంగా హత్య చేశారని చెప్పారు. శాంతి భద్రతలపై కొందరు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని సిఎం మండిపడ్డారు. పెట్టుబడు దారులకు రక్షణ కల్పించినప్పుడే పెట్టుబడులొస్తాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై యాసిడ్ దాడులు జరుగుతున్నా యన్నారు. రాష్ట్రం దివాళా తీస్తేనే మంచిదనేటట్లు కొంతమంది వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తాము వచ్చిన తర్వాత ఏక్కడైన గొడవలు జరిగాయా? అని రేవంత్ ప్రశ్నించారు. ఈ క్రమంలో జూదాల పట్ల కఠినంగా ఉండాలని అనుకుంటు న్నామని అన్నారు. ఆన్ లైన్ బెట్టింగ్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. విమర్శల జోలికి పోను.. ఆన్‌లైన్ రమ్మి.. బెట్టింగులపై కఠినంగా ఉంటామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. వచ్చే సమావేశాల్లో బెట్టింగులుపై చట్ట సవరణ చేస్తామన్నారు. గుట్కా నిషేధిత పదార్థాలు మార్కెట్లోకి వచ్చాయి.

మిగతా 2లో

# అసెంబ్లీలో మాటల యుద్ధం

## కేటీఆర్ వర్సెస్ భట్టి

- కమీషన్ లేనిదే పనులు కావడం లేదంటూ కేటీఆర్ ఆరోపణలు
- నిరూపించకపోతే.. క్షమాపణలు చెప్పాలని భట్టి డిమాండ్




**తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు పదోరోజు వాడీవేడిగా కొనసాగింది. పలు అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం నడిచింది. ప్రభుత్వ పెద్దలు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ.. స్వయంగా కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారంటూ అసెంబ్లీ వేదికగా కేటీఆర్ కామెంట్ చేశారు.**

హైదరాబాద్ : కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యల పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30శాతం కమీషన్లు తీసుకుంటున్నట్టు నిరూపించాలంటూ కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ చేశారు. నిరూపించ లేకపోతే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ భట్టి హెచ్చరించారు. దోచుకుంది మీరు.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది మీరే అంటూ బీఆర్ఎస్ నేతలపై భట్టి మండిపడ్డారు. కాగా.. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యుల ఆందోళన నేపథ్యంలో.. కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు. ధరణి, భూ భారతిపై కూడా తెలంగాణ అసెంబ్లీలో రచ్చ జరిగింది. ధరణిపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇంకా అదే చట్టాన్ని అమలుచేస్తున్నారు. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ ప్రభుత్వ పథకాల అమలు

2లో

## టూరిజం అభివృద్ధి ఎప్పటికీ అవసరమే

- ఆనాడు చెప్పిన మాటలను అపార్థం చేసుకున్నారు
- రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు సూచన

2




## భూభారతిపై వాడీవేడి చర్చ

- భూభారతి కాదు..భూహారతి అన్న పల్లా
- ధరణి పేరుతో బిఆర్ఎస్ దగా చేసింది
- అందుకే ధరణిని బంగాళాఖాతంలోకి విసిరాం
- పల్లా వ్యాఖ్యలకు భట్టి ఘాటు సమాధానం
- వచ్చే ఎన్నికల్లో ధరణితో వెళ్లాలని పొంగులేటి సవాల్

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో 'భూ భారతి'పై వాడీవేడి చర్చ జరిగింది. భూభారతిపై అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది.. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ పథకాలు అమలు చేస్తున్నారని.. ఇది భూభారతి కాదు భూహారతి అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విపక్ష బిఆర్ఎస్ ఆరోపణలను అధికార పక్షం ఘాటుగా తిప్పికొట్టింది. ధరణి పేరుతో ప్రజల భూములను లాక్కున్న దుర్మార్గాలను అడ్డుకున్నామని తెలిపింది.

2లో



# పంబన్ బ్రిడ్జికి త్వరలో మోడీ ప్రారంభోత్సవం

ఈ వంతన మధ్యలో భారీ ఓడలు వచ్చినప్పుడు తెరుచుకునేలా ప్రత్యేక గేట్లు కూడా ఏర్పాటు చేశారు. కాగా, కొత్త పంబన్ బ్రిడ్జి ప్రారంభం కాగానే పాత వంతెనపై రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019 నవంబర్‌లో శంకుస్థాపన చేశారు. 2020 ఫిబ్రవరిలో నిర్మాణం ప్రారంభమైంది. కోవిడ్ కారణంగా జాప్యం చోటచేసుని ఏప్రిల్‌లో ప్రారంభానికి ముస్తాబవుతోంది.

# లోక్‌సభలో ప్రతిపక్ష గొంతు నొక్కే కుట్ర

నాకు మాట్లాడేందుకు మైక్ ఇవ్వడం లేదు. సభను నడిపే పద్ధతి ఇది కాదు. ఎలాంటి ఆధారాలు లేకుండా స్పీకర్ నా గురించి అసత్యాలు మాట్లాడుతున్నారు. సభను పదేపదే వాయిదా వేస్తున్నారు. ఇదంతా ఎందుకు? నేను మాట్లాడేందుకు లేచి నిలబడడానికి ప్రయత్నించినప్పుడల్లా ఆయన లేచి వెళ్లిపోతున్నారు. సభలో మాట్లాడేందుకు ప్రతిపక్షసభ్యులకు మైక్ ఇవ్వాలి కదా. ఇవ్వడం లేదు. మేం ఏం చెప్పాలో అది చెప్పనివ్వడం లేదు. నేను ఏం చేయలేదు. నిశ్శబ్దంగా కూర్చున్నాను. ఒక్కమాట మాట్లాడలేదు. 7-8 రోజులుగా నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ప్రధాని కుంభమేళా గురించి మాట్లాడారు. ఆ సమయంలో నేను నిరుద్యోగం గురించి మోడీని ప్రశ్నించాలని అనుకున్నాను. కానీ స్పీకర్ నాకు ఆ అనుమతి ఇవ్వలేదు. స్పీకర్ విధానం ఏంటో నాకు తెలియదు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో తాను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేస్తున్న స్పీకర్ ఓం బిర్లా తనకు మైక్ ఇవ్వడం లేదని రాహుల్ గాంధీ స్పీకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు మైక్ ఇవ్వమంటే స్పీకర్ పారిపోతున్నారని అన్నారు. ఇది సభ నడిపే పద్ధతి కాదని, ఎలాంటి ఆధారాలు లేకుండా స్పీకర్ తనపై అసత్యాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'మేము ఏం చెప్పాలి అని అనుకుంటున్నామో అది చెప్పాలి కదా.. అందుకు మైక్ ఇవ్వాలి. కానీ ఇవ్వడం లేదు. లోక్‌సభలో ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకుండా కుట్ర జరుగుతోందని.. ప్రధాని కుంభమేళ గురించి మాట్లాడిన రోజు తాను నిరుద్యోగం గురించి మాట్లాడుదాం అనుకుంటే.. అవకాశం ఇవ్వలేదని తెలిపారు. ఈ స్పీకర్ విధానం అర్థం కావడం లేదని.. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ధ్వజమెత్తారు.

# ఉప్పల్ స్టేడియానికి ప్రత్యేక బస్సులు

## క్రికెట్ లవర్స్‌కు ఆర్టీసి శుభవార్త

హైదరాబాద్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ ప్రారంభమై.. మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగుతున్న క్రమంలో ఉప్పల్ స్టేడియంలో కూడా పలు మ్యాచ్‌లు నడుస్తున్నాయి. ఇప్పటికే ఓ మ్యాచ్ పూర్తయ్యింది. మరిన్ని మ్యాచ్‌లు నడవబోతున్నాయి. ఈ క్రమంలో తమ అభిమాన జట్లకు సపోర్ట్ చేస్తూ.. ఫ్యాన్స్ స్టేడియంలో సందడి చేస్తున్నారు. అలా స్టేడియంకు వెళ్లే ఫ్యాన్స్ కోసం ఆర్టిసి శుభవార్త అందించింది. ఐపిఎల్‌కి వచ్చే ఫ్యాన్స్‌కి ఇబ్బందులు కలుగకుండా గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్‌కు ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేస్తున్నట్లు- ప్రకటించింది. గ్రేటర్ పరిధిలోని 24 డిపోల నుంచి 60 ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేయనున్నారు. ఉప్పల్‌లో ఐపిఎల్ మ్యాచులు జరిగే తేదీల్లో అంటే మార్చి 27, ఏప్రిల్ 6, ఏప్రిల్ 12, ఏప్రిల్ 23, మే 5, మే10, మే 20, మే 21 తేదీల్లో ఈ బస్సులు అందుబాటు-లో ఉండనున్నాయి.

# అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు నొక్కేస్తున్నారు

బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ చేశారు. సుప్రీంకోర్టులో పెండింగులో ఉన్న పార్టీ ఫిరాయింపుల విషయమై నిబంధనలకు విరుద్ధంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. ముఖ్యమంత్రి సభలో మాట్లాడింది పూర్తిగా అసెంబ్లీ పార్లమెంట్ వ్యవస్థకు విరుద్ధం. కోర్టులో పెండింగులో ఉన్న విషయాలను చట్టసభల్లో మాట్లాడకూడదని పార్లమెంటరీ ప్రొసీజర్ బుక్‌లో స్పష్టంగా ఉంది. కోర్టు పరిధిని అధిగమించి ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉన్నా కూడా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఈ విషయంపై జడ్జిమెంట్ ఇచ్చాడు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు డిస్ క్వాలిఫై కారు, ఉప ఎన్నికలు రానే రావు అని జడ్జిమెంట్ ఇచ్చారు. ముఖ్యమంత్రి తన పరిధిని దాటి సుప్రీంకోర్టులో ఉన్న విషయం మీద మాట్లాడడం అసెంబ్లీ ప్రివిలేజ్ కిందకే వస్తుంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అందుకే తాము సభలో అభ్యంతరం చెప్పామని, నిరసనగా వాకౌట్ చేశామని అన్నారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ కింద నేను చెప్పే ప్రయత్నం చేస్తే మధ్యలో నా మైక్ కట్ చేశారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశాం. సలహాలు ఇవ్వాలంటే ఇవ్వచ్చని ముఖ్యమంత్రి చెప్పారు, కానీ సలహాలు ఇవ్వడానికి మైక్ ఇవ్వాలని కోరితే ఇవ్వలేదు. ప్రతిపక్షం గొంతు నొక్క ప్రయత్నం చేస్తున్నారు. తక్కువ సభ్యులు ఉన్నవారికి మైక్ ఇస్తున్నారు, మాకు ఇవ్వడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బెట్టింగ్ యాప్స్ బ్యాన్ చేస్తూ వచ్చింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల పాలనలో బెట్టింగ్ యాప్స్‌ని కంట్రోల్ చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రతి మూడు గంటలకు ఒక అత్యాచారం, ఆరు గంటలకు ఒక హత్య జరగుతున్నది. లా అండ్ ఆర్డర్ మెయిన్టైన్ చేయడంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఫెయిలయ్యారు. ఒకరోజే హైదరాబాద్‌లో రెండు అత్యాచార ఘటనలు, రెండు హత్యలు జరిగాయి. హైదరాబాద్‌లో 50 శాతం సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పెట్టిన సీసీ కెమెరాలును మెయింటైన్ చేయడంలో ఫెయిల్ అయ్యారు. పోలీసులకు ఆత్యాధునిక వాహనాలు మేం కొనిస్తే మీరు డీజిల్ పోయించే పరిస్థితిలో కూడా లేరు. పోలీస్ చరిత్రలో పోలీసు కుటుంబాలను పోలీసుల చేత అరెస్టు చేయించిన ఘనుడు సీఎం రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు విమర్శించారు. అమనగల్‌లో ముఖ్యమంత్రి భూముల కోసం నాలుగు లైన్ల రోడ్లు రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్ ఉండగా మరో రోడ్డు ఎందుకని ప్రశ్నించారు. రూ. 5000 కోట్లు- ఖర్చుపెట్టి 10 లైన్ల రోడ్డు ఎందుకు వేస్తున్నావ్. ఉద్యోగులకు పెన్షనర్లకు ఇవ్వడానికి డబ్బులు లేవని చెబుతూనే రూ. 5000 కోట్లతో అత్తగారి ఊరికి రోడ్లు వేస్తారా? అని ప్రశ్నించారు. జానారెడ్డి గారిని ఆదర్శంగా తీసుకోండి అన్నారు సీఎం. ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏసీడీపీ నిధులు ఇవ్వాలని కోరితే వెంటనే కేసీఆర్ వచ్చారు. మీరు కూడా ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏసీడీపీ నిధులు ఇవ్వండని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భూములమ్మితే బొంద పెట్టడానికి కూడా స్థలం మిగలదు అని చెప్పి.. ఈరోజు అసెంబ్లీ సాక్షిగా భూముల అమ్మకాన్ని సమర్థిస్తున్నారు. గచ్చిబౌలిలోని 400 ఎకరాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాడి కాపాడింది.. మీరు అధికారంలోకి వచ్చాక కోర్టు తీర్పు వచ్చిందని, వాటిని కాపాడకుండా అమ్మితే ఎలా అన్నారు.

# బెట్టింగ్ యాప్స్ నిషేధానికి సిట్

వీటిపై కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసే వారిని పిలిచి విచారిస్తున్నాము. దానితో పరిష్కారం కాదు. బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తున్న వారు.. బాధ్యులను కూడా విచారించాలన్నారు. దీనికోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీ-ం వేస్తున్నాం. ప్రకటనలు చేసినా.. నిర్వహణలో భాగస్వామ్యం ఉన్న.. కఠినంగా వ్యవహారం ఉంటుందని సభలో సిఎం రేవంత్ ప్రకటించారు. నేరాలు చెప్పి జరగవు. నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటుంది ప్రభుత్వం. న్యాయవాదుల హత్య.. వెటర్నరీ డాక్టర్ హత్యలు గతంలో చూశాం. నడి బజారులో న్యాయవాదులను చంపిన వారిపై సీబీఐ విచారణకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సుప్రీం కోర్టుకు చెప్పినట్లు వెల్లడించారు. ఆరేళ్ల అమ్మాయిని సైదాబాద్ లో చంపితే అనాడు సర్కార్ పట్టించుకోలేదు. జూబ్లీహిల్స్ లో మైనర్ బాలిక రేప్ కేసు.. దాంట్లో బీఆర్ఎస్ నాయకుడు ముద్దాయి. మాజీమంత్రి కొడుకుపై ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఘటనల్లోని బాధితుల పట్ల సానుభూతితో ఉండాలి. కానీ ప్రతిపక్షం.. ప్రభుత్వమే చేయిస్తుంది అన్నట్టు మాట్లాడు తున్నారు అని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఇకపోతే ధరల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. 85 శాతం సొంత పన్నుల వసూళ్లతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. కడుపునిండా విషం పెట్టుకొని ఎందుకు మాట్లాడుతారని ఘాటుగా స్పందించారు. గతంలో జానారెడ్డి.. విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారు. జానారెడ్డి నెలకొల్పిన సంప్రదాయాన్ని ఎందుకని కొనసాగించరని అన్నారు. ఎన్నికలు ఎప్పుడో 2029లో వస్తాయి.. మీరు కోరుకున్నంత మాత్రాన ఇప్పుడే రావు. భారాస ముఖ్యనేతలు ఇద్దరు పోటీపడి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది. నేను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటాను. గజ్వేల్ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చినా మనస్ఫూర్తిగా సహకరిస్తాను. పద్మారావు వచ్చారు.. అక్కడికక్కడే ఇచ్చేశా. విపక్ష ఎమ్మెల్యేలు వచ్చినా పనులు చేసి పెడుతున్నాను అని సీఎం పేర్కొన్నారు.మాకు తరతమ భేదాలు లేవని, పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు.

# తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్

ఆనాడు కేసులను నమోదు చేయకుండా బాధితులను భయపెట్టించారు.. కానీ ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఏంటో మేం చేతల్లో చూపించామని అన్నారు. పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మిస్తున్నామని.. రంగారెడ్డి జిల్లా మంచిరేవులో ఈ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలీసుల పిల్లలకు విద్యను అందిస్తామని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ పోలీసులు స్వేచ్ఛగా కేసులు నమోదు చేస్తున్నారని.. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నేతల చెప్తేనే కేసులు నమోదయ్యాయని ఆరోపించారు. మంథనిలో అడ్వకేట్ దంపతుల మర్డర్ జరిగితే.. ఈ ఘటనలో పోలీసులు ఎలా వ్యవహరించిన తీరు అందరి చూశారని విమర్శించారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ఇప్పుడు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశామని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన టీజీ న్యాబ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కొత్త పోస్టులు మంజూరు చేశామని తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించుకుని పోలీసులు కేసులు వేగంగా పరిష్కరిస్తున్నారని కొనియాడారు. సైబర్ నేరాలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నామని.. సైబర్ సెక్యూరిటీ యావత్ దేశం సమస్య అని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని.. ఏఐ బేస్డ్ ట్రాఫిక్ మానిటరింగ్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ట్రాఫిక్‌కు సంబంధించి అదనపు సిబ్బందిని నియమించామని గూగుల్ మ్యాప్ ఉపయోగించుకుని ట్రాఫిక్ నియంత్రణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇతర మెట్రో సిటీలతో పోల్చితే.. మన ట్రాఫిక్ నియంత్రణ బాగుందని అన్నారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలను మరింత పటిష్టం చేస్తున్నామని అన్నారు.


# భూభారతిపై వాడీవేడి చర్చ

బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి అని భట్టి విక్రమార్క అన్నారు. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని.. అలానే చేశామని చెప్పారు. ధరణిపై ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతకుముందు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది భూ భారతి కాదని.. భూ హారతి అని ఆరోపించారు. జమాబందీ పేరుతో ప్రభుత్వం మరో దుకాణం తెరిచిందని విమర్శించారు. ఇప్పుడు జమాబందీ ఎందుకో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. దున్నేవాడిదే భూమి అనేది సాయుధ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం భూములపై హక్కులు కల్పించిదన్నారు. కానీ బిఆర్ఎస్ ధరణిపేరుతో సామాన్యుల భూములను కాజేసిందని అన్నారు. వారికి భూమిపై హక్కులు లేకుండా చేసేందుకు ధరణిని తీసుకుని వచ్చారని, ఎందరో భూములు మాయమయ్యాయని అన్నారు. అందుకే ధరణిని బంగాళాఖాతం లో వేస్తామని చెప్పాం.. వేసి చూపామని అన్నారు. అందుకు ప్రత్యమ్నాయంగా 'భూ భారతి' పేరిట కొత్త చట్టం తీసుకొచ్చి ప్రజలకు రక్షణ కల్పించామని అన్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేయాలనే ప్రజలకు మాకు అధికారం కట్టబెట్టారని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో పల్లా వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ధరణి వద్దని ఓటుతో ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు. అన్ని వర్గాలతో చర్చించాకే భూభారతి తెచ్చామని అన్నారు. భూభారతి కాన్సెప్ట్ తో ఈసారి ఎన్నికలకు వెళ్తామని.. ధరణి కాన్సెప్ట్ తో బీఆర్ఎస్ నేతలు ఎన్నికలకు రాగలరా అంటూ మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. ప్రజలు ఎవరికి మద్దతు ఇస్తారో చూద్దామని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. వీఆర్ఏ వ్యవస్థను మళ్ళీ తీసుకొస్తామని.. వీఆర్ఏలు కావాలని ప్రజలు అడుగుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కట్టుకథలు చెబుతున్నారని మండిపడ్డారు పొంగులేటి. అసత్యాన్ని సత్యం చేసేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భారాస ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే ఆ పార్టీని ఓడించారు. వీఆర్ఏ, వీఆర్వోలపై గత ప్రభుత్వం ఏవిధంగా ప్రేమ చూపించిందో అందరికీ తెలుసు. వాళ్లకు ప్రత్యేకమైన గౌరవం ఇస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం అని పొంగులేటి చెప్పారు. ధరణి పోర్టల్ పై ప్రజలు తీర్పు ఇచ్చారు.. మా సభ్యులే కాదు.. మీ వైపు ఉన్న సభ్యులు కూడా ఇబ్బంది పడ్డారు.. ధరణిలో ఏర్పడిన సమస్యలతో తమ భూముల సమస్యలు పరిష్కారం కోసం నా దగ్గరికి పలువురు ఎమ్మెల్యేలు వస్తున్నారు వెల్లడించారు. మేము వచ్చే ఎన్నికల్లో భూ భారతి గురించి చెప్పి ఎన్నికలకు పోతాం.. బీఆర్ఎస్ ధరణి పేరుతో ఎన్నికలకు వెళ్తారా? అని ప్రశ్నించారు. మీకు మాట్లాడే నైతిక హక్కు లేదు.. ధరణి తెచ్చి రూల్స్ అసలు ఫ్రేమ్ చేయలేదు.. మేము చట్టం తెచ్చి రూల్స్ సిద్ధం చేస్తున్నాం.. మీరు మాకు చెప్పడం ఎందుకు అని ప్రశ్నించారు. పేదలకు మేము ఇందిరమ్మ ఇండ్ల ఇస్తున్నాం.. వాళ్ళ మాదిరిగా మేము పార్టీల కార్యకర్తలు ఇవ్వం అని తెలిపారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఇక, ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్ సర్పంచ్.. మీలాగా బీఆర్ఎస్ నాయకులను పెట్టలేదు.. సభను పదే పదే తప్పుదోవ పట్టిస్తున్నారు అని మంత్రి పొంగులేటి తీవ్రంగా మండిపడ్డారు.

# రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం

దేశంలోనే తొలిసారిగా ఈ నెల 30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరాకు శ్రీకారం చుడుతున్నట్లు- ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీ అంశంలో విజిలెన్స్ నివేదిక వచ్చిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్డీఎస్ఏ తుది నివేదిక వచ్చిన తర్వాత మరమ్మతుల విషయంపై దృష్టిసారిస్తామన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు లేవలెత్తిన అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ ఉంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. ఎస్-ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమని.. ప్రపంచస్థాయి నిపుణులను భాగస్వామ్యం చేసి సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. ప్రమాదం జరిగిన 3 గంటల్లోపే తాను అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. సీఎం రేవంత్ కూడా రెండు రోజుల క్రితం దీనిపై సమీక్షించి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారన్నారు. సొరంగ ప్రమాదం తాత్కాలికంగా వచ్చిన ఎదురుదెబ్బ మాత్రమేనని.. ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శాసనసభ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం 8వ ప్రపంచ వింత అని పెయిడ్ ప్రచారం చేయించారని దుయ్యబట్టారు. ఆ ప్రాజెక్టుకు కేసీఆరే ఇంజినీర్ కావడం దౌర్భాగ్యమని అన్నారు. లూజ్ సాయిల్, లూజ్ ఫౌండేషన్ మీద కాళేశ్వరాన్ని నిర్మించడం పెద్ద తప్పు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్, హరీశ్‌రావును క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి శీల పరీక్షను నిరూపించుకోవాలని పాల్వాయి హరీశ్ వ్యాఖ్యానించారు.కమిషన్ కె అంటే కాళేశ్వరం, కరెంటు కొనుగోళ్లు, కాకతీయ అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చురకలంటించారు. శాసన సభలో నిరసన తెలిపే అవకాశం ఉన్నప్పటికి లాబీలోకి వెళ్లి నిరసన తెలపడం సరికాదని ధ్వజమెత్తారు. సభ జరుగుతున్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీయడం నిషేధమని, లాబీల్లో ఫొటోలు తీసిన బిఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్షల్స్‌పై బిఆర్ఎస్ సభ్యులు దౌర్జన్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలతోనే బిఆర్ఎస్‌ను ప్రజలు అక్కడ కూర్చోబెట్టారని, బిఆర్ఎస్ నేత కవిత లిక్కర్ స్కామ్ చేయడంతోనే ఢిల్లీలో ప్రభుత్వం పోయిందని ఎద్దేవా చేశారు. సభలో బిఆర్ఎస్ కావాలని హంగామా చేసిందని, కావాలని లాబీల్లోకి వెళ్లి షో చేశారని దుయ్యబట్టారు.

# ఏప్రిల్ నెలాఖరులో ఇంటర్ పరీక్షా ఫలితాలు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల పరీక్షలు మంగళవారం (మార్చి 25)తో ముగిశాయి. ప్రధాన సబ్జెక్టు పరీక్షలు మార్చి 20వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే జవాబుపత్రాల మూల్యాంకనం కూడా ప్రారంభమైంది. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 5 నుంచి ప్రారంభమవగా మార్చి 25తో అన్ని పరీక్షలు ముగిశాయి. తొలుత కొన్ని ప్రశ్నపత్రాల్లో తప్పులు దొర్లడంతో హల్‌చల్ చేసినా ఆ తర్వాత సజావుగానే పరీక్షలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 9,96,971 విద్యార్థులు పరీక్షలు ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలు రాశారు. వీరిలో ఫస్టియర్‌లో విద్యార్థులు 4,88,448 మంది, సెకండియర్ విద్యార్థులు 5,08,523 మంది ఉన్నారు. ఇక గతంలో ఫెయిలైన విద్యార్థులు 67,735 మంది కూడా ఈసారి పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 1,532 పరీక్ష కేంద్రాల్లో అక్కడక్కడా కొందరు విద్యార్థులు కాపీ కొడుతూ డీబార్ అయినప్పటికీ సింహభాగం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఇక ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 19 సెంటర్లల్లో నిర్వహిస్తున్నారు. మార్చి 19 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగనుంది. మూల్యాంకనం అనంతరం ఇంటర్ పరీక్షల ఫలితాలను ఏప్రిల్ నెలాఖరులోపు విడుదల చేసే లక్ష్యంతో అధికారులున్నారు. ఏప్రిల్ 29వ తేదీ నుంచి ఈఏపీసెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందువల్ల ఆ పరీక్ష ప్రారంభానికి కనీసం రెండు మూడు రోజుల ముందుగానే ఫలితాలు వెల్లడించాలని ఇంటర్ బోర్డు భావిస్తుంది. అంటే ఏప్రిల్ నాలుగో వారంలో ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉంది. గతేడాది మార్చి 19వ తేదీకి పరీక్షలన్నీ పూర్తికాగా, ఏప్రిల్ 24న ఫలితాలు విడుదల చేశారు. ఈసారి కూడా ఏప్రిల్ చివరి వారంలో ఫలితాలు వెల్లడించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# అసెంబ్లీలో మాటల యుద్ధం

జరుగుతుందని.. పైగా ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతిలో అనేక లోపాలు ఉన్నాయన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి. ఈ వ్యాఖ్యల పట్ల అధికార పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ధరణి ఓ దుర్మార్గమైన చట్టమంటూ డిప్యూటీ సీఎం భట్టి మండిపడ్డారు. పార్ట్-బీ పేరుతో భూములు దోచుకున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఉద్యమాలతో వచ్చిన చట్టాలను ఒక్క కలంపోటుతో వెనక్కు తీసుకెళ్లారు. ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఎన్నికల్లో చెప్పాం .. చెప్పినట్టు గానే భూ భారతిని తీసుకొచ్చామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# టూరిజం అభివృద్ధి ఎప్పటికీ అవసరమే

అమరావతి : టూరిజం అభివృద్ధి గురించి తాను ఆనాడు చెబితే ఎద్దేవా చేశారని, కానీ ఇప్పుడు అంతా గుర్తుకు చేసుకుని, తనవాదనకు బలం చేకూర్చారని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. తాను చెప్పిన మాటలను 30 ఏళ్ల తర్వాత తెలంగాణ అసెంబ్లీలో గుర్తు చెయ్యడం సంతోషం అన్నారు. గతంలో ఏ ఇజం లేదు టూరిజం ఒక్కటే అని తాను మాట్లాడితే తీవ్ర విమర్శలు చేశారన్నారు.. కలెక్టర్ల సమావేశంలో ఈ అంశాన్నే ప్రస్తావించారు సీఎం.. టూరిజంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు..తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలపై ఏపీ కలెక్టర్ల సదస్సులో రెండో రోజు చర్చ జరిగింది.. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో టూరిజంపై చేసిన వ్యాఖ్యలను తెలంగాణ సభలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రస్తావించారు.. ఇప్పుడు సమాజంలో ఏ ఇజం లేదు.. ఉన్నదంతా టూరిజమే అని నాడు చంద్రబాబు అనేవారు అంటూ చెప్పుకొచ్చారు కూనంనేని.. చంద్రబాబు నాడు ఇజంపై చెప్పిన మాటే నిజం అంటూ తెలంగాణ సభలో అభిప్రాయపడ్డారు ఎమ్మెల్యే కూనంనేని.. అయితే, పత్రికలో వచ్చిన ఆ వార్తను కలెక్టర్ల సదస్సుల్లో టూరిజం అంశంపై మాట్లాడుతూ ప్రస్తావించారు సీఎం చంద్రబాబు.. ఏ ఇజం లేదు అని నేను నాడు అంటే కమ్యునిస్టులు నాపై విరుచుకుపడ్డారు.. నాపై విమర్శలు చేశారు.. ఇప్పుడు తెలంగాణలో శాసన సభ్యుడు మాట్లాడుతూ ఖర్చు లేని ఇజం టూరిజమే అంటూ నేడు స్టేట్‌మెంట్ ఇచ్చారు అని గుర్తుచేశారు.. తాను చెప్పిన మాటలను, తన ఆలోచనలను అర్థం చేసుకోవడానికి 30 ఏళ్లు పట్టింది అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు.. అయితే, ఇప్పుడు అంత సమయం లేదని.. త్వరగా ప్రాజెక్టులు తెచ్చి.. ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలని సీఎం చంద్రబాబు న్నారు.. రాష్ట్రంలో ఇటు రాయలసీమ నుంచి అటు- ఉత్తరాంధ్ర వరకు టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయన్న చంద్రబాబు.. కలెక్టర్లు జిల్లాల వారీగా టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాలని సూచించారు.. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని.. ఎకనమీ పెరిగి.. ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందన్నారు.. ఎక్కువ ఖర్చు లేకుండా ఉపాధి కల్పించే రంగం టూరిజం అని వ్యాఖ్యానించారు.. ప్రతి జిల్లాలో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయని వాటికి అనుగుణంగా పనిచేస్తే టూరిజం పెద్ద ఉపాధి మార్గం అవుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు..

# పోలీసులు నిర్లక్ష్యం

## 500 బదులు పదిలక్షల 500 ఫైన్

## కోర్టు సమన్లతో ఖంగుతిన్న విద్యార్థి

గాంధీనగర్ : సాధారణంగా హెల్మెట్ పెట్టుకోకుండా పోలీసులకు దొరికితే 500 నుంచి 1000 రూపాయల వరకు ఫైన్ ఉంటుంది. కానీ, ఓ విద్యార్థికి మాత్రం పోలీసులు ఏకంగా 10 లక్షల రూపాయల ఫైన్ వేశారు. అంత పెద్ద మొత్తంలో ఫైన్ పడటం చూసి అతడు షాక్ అయ్యాడు.ఈ సంఘటన అహ్మదాబాద్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. ఆ వివరాల్లోకి వెళితే.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన అనిల్ హాదియా. అనే లా విద్యార్థి బైకు మీదే లా కాలేజీకి వెళుతూ ఉంటాడు. గతేడాది ఏప్రిల్ నెలలో కూడా హెల్మెట్ లేకుండా బైకు నడుపుకుంటూ కాలేజీకి వెళుతూ ఉన్నాడు. శాంతిపుర ట్రాఫిక్ సర్కిల్ దగ్గర ట్రాఫిక్ పోలీసులకు దొరికాడు. దీంతో పోలీసులు అతడికి ఫైన్ వేశారు. కొద్దిరోజుల తర్వాత అతడి ఇంటికి కోర్టు సమన్లు వచ్చాయి. సమన్లు చదివి షాక్ అయ్యాడు. హెల్మెట్ లేకుండా బైకు నడిపినందుకు గాను..అక్షరాలా 10,00,500 రూపాయలు కట్టాలని అందులో ఉంది. అనిల్‌కు ఏం చేయాలో అర్థం కాలేదు. దీంతో అతను అనిల్‌ను మెట్రో పాలిటన్ కోర్టుతో పాటు పోలీస్ కమిషనర్ దగ్గరకు తీసుకెళ్లాడు. అనిల్ అక్కడ తన గోడు వెల్లబోసుకున్నాడు. పోలీస్ కమిషనర్ ఈ ఘటనపై ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. 500 రూపాయలకు బదులుగా 10,00,500 రూపాయలు అని తప్పుగా పడినట్లు తేలింది. దాన్ని సరిచేస్తామని అధికారులు అనిల్‌కు భరోసా ఇచ్చారు. దీంతో అనిల్ ఊపిరి పీల్చుకున్నాడు.

# 14 ఏళ్లలో 81శాతం తగ్గిన నక్సల్స్ హింస

న్యూఢిల్లీ : గడచిన 14 ఏళ్లలో దేశంలో నక్సల్ హింస 81 శాతం తగ్గిందని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ బుధవారం రాజ్యసభకు తెలిపింది. 2010 నుండి 1,936 సంఘటనలతో గరిష్టస్థాయిలో ఉందని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రారు నేడు రాజ్యసభలో మాట్లాడుతూ.. 2024లో నక్సల్ వయెలెన్స్ సంఖ్య 374కి తగ్గిందని అన్నారు. పౌరులు, భద్రతా దళాలు మరణాల సంఖ్య 2010లో 1,005గా ఉంటే.. 2024కి 150కి తగ్గింది. అంటే 85 శాతం తగ్గుదల ఉంది అని ఆయన అన్నారు. కాగా, నక్సల్ హింస కేసులు 2023లో 485, 2022 : 413, 2021 : 361, 2020 : 470, 2010 : 501 నమోదయ్యాయి.

# బీఆర్ఎస్ పార్టీపై ఉన్న కోపాన్ని రైతులపై...

### ఎండిపోయిన పంటలను పరిశీలించిన మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

### నీరుఅందక అష్టకష్టాల్లో రైతులు : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



జోగులాంబ గద్వాల : కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై ఉన్న కోపాన్ని రైతులపై చూపిస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో ఎండిన పంట పొలాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. యాసంగిలో రాష్ట్రంతోపాటు జోగులాంబ గద్వాల జిల్లాలోని నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో పంటలు ఎండుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం సమావేశం నిర్వహించకుండా యాసంగి పంటల ప్రణాళిక రూపొందించిందని చెప్పారు. వరంగల్ డిక్లేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసాను మూడు ఎకరాలతోనే బందు చేసిందని అన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి ఒట్లు వేసి అటు దేవుళ్లను, ఇటు రైతులను నిండా మోసం చేశాడని ఆరోపించారు. ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల నుంచి వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రేలంపాడు రిజర్వాయర్‌లో నాలుగు టీఎంసీల నీటిని నిలువ చేసుకోలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ యాసంగిలో రైతులు ప్రభుత్వం, అధికారుల మాటలు విని పంటలు సాగు చేస్తే.. ఆ పంటలకు ప్రస్తుతం నీరులేక ఎండిపోయి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే వారికి నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ పరిధిలో గత 50 ఏళ్ల కాలంలో ఏనాడు కూడా ఇలాంటి పరిస్థితి కనిపించ లేదని మాజీ మంత్రి అన్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ కింద 47,000 ఎకరాలలో రైతులు వివిధ పంటలు సాగుచేశారని, ప్రస్తుతం పది రోజులుగా నీరు నిలిచిపోవడంతో పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఇక్కడి రైతుల పొలాలకు నీరు ఇచ్చి పంటలను కాపాడలేక పోయారని వాపోయారు. ముఖ్యమంత్రి తన సీటును కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటే నీటిపారుదల మంత్రి రైతుల బాగోగులు పట్టించుకోకుండా ఆ సీటుపై కన్నేశాడని అన్నారు. పాలమూరు జిల్లా మంత్రికి కక్షలు కార్పణ్యాలపై ఉన్న శ్రద్ధ రైతుల పంటలను కాపాడడంలో లేదని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీయే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉందని, అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఓవైపు పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే వారిని పరామర్శించడానికి కూడా ఈ నాయకులకు తీరిక లేదని విమర్శించారు. పదేళ్లలో ఎప్పుడు కూడా రైతుల పంటలు ఎండకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాపాడితే.. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంటలు ఎండడానికి కారణమయ్యాడని ఆరోపించారు. ప్రస్తుతం రైతులకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని మాజీ మంత్రి ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతుల పంటలు కాపాడాలని మాజీ మంత్రి కోరారు.

## పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

### ఆనాడు మాకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు

### రేవంత్ మంచోడు కాబట్టే..మీరు మాట్లాడుతున్నారు

### అసెంబ్లీలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఘాటు విమర్శలు

హైదరాబాద్ : అధికారంలో ఉన్న పదేళ్లు బీఆర్ఎస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఆనాడు విపక్ష సభ్యులను కనీసం మాట్లాడడానికి కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. అంతేగాకుండా విపక్షమే లేకుండా చేయాలని కుట్ర చేశారని మండిపడ్డారు. తెలంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టే బీఆర్ఎస్ నేతలు ఇంకా ప్రశాంతంగా ఫామ్ హౌజ్‌లో ఉన్నారని లేదంటే.. నిన్నటి దాకా ఒక లెక్క ఇప్పటి నుంచి ఒక లెక్క అనేలా పరిస్థితి ఉండేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో 8 వేల హత్యలు.. లక్ష దొంగతనాలు జరిగాయని.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన అహంకారంతో సాగిందని.. తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన అధికార దుర్వినియోగానికి ఉదాహరణ అని అన్నారు.పోలీస్ అధికారులు కూడా బీఆర్ఎస్ అధికార దాహానికి బలయ్యారని.. బీఆర్ఎస్ పెద్దలు చెప్పిన అందరి ఫోన్లు ట్యాప్ చేసి ఇప్పుడు ఇబ్బందుల్లో చిక్కుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ చేయించిన పాపాలతో పోలీసులు విదేశాలకు పారిపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పోలీసు వ్యవస్థను దారుణంగా వాడుకుందని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్ పీసీసీ పదవిని రూ. 50 కోట్లకు కొన్నడని కోమటి రెడ్డి అన్నాడని కెటిఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపై కోమటి రెడ్డ రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం లేకుండా చేసిన బీఆర్ఎస్.. ఇప్పుడు మాకు నీతులు చెప్తున్నారని ఎద్దేవ చేశారు. ఎన్నో తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. మీకు నాయకుడే లేడు.. సభకు రావడమే మానేశారని తెలిపారు. ప్రజల సమస్యలు చెప్పడానికి సభకే రావడం లేదు. రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టి మీరు ఇంకా ఫామ్ హౌస్ లో ప్రశాంతంగా ఉన్నారు. లేకుంటే నిన్నటి నుంచి ఒకలెక్కా.. ఇవాల్టి నుంచి ఇంకో లెక్క అన్నట్టు ఉండేది.సైరన్ సప్పుడు లెకుండా తిరుగుతున్నారు కాబట్టి వాళ్ళు అంత పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ లీడర్లు అందరి ఫోన్లు ట్యాప్ చేసి అధికార దాహానికి బలై పోయారు. అహంకారంతో సాగింది బీఆర్ఎస్ పాలన.. మేము ఆరుగురం ఉన్నప్పుడు మా గొంతు నొక్కారు. సభ మీ సొంతమా అని అడిగారు. ఇప్పుడు నేను అడుగుతున్న.. సభ మీ సొంతమా మరి.. వచ్చినప్పటి నుండి ఒకటే గొడవ.. మీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది.. ఆ టైమ్ ప్రజల కోసం కేటాయిస్తే చాలు అని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు.

## మాజీ సర్పంచ్ హత్య కేసులో నిర్లక్ష్యం

సూర్యాపేట : సూర్యపేట డీఎస్పీ రవిపై వేటు పడింది. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాలలో ఇటీవల జరిగిన గ్రామ మాజీ సర్పంచి మెంచు చక్రయ్య గౌడ్ మర్డర్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పోలీస్ ఉన్నతాధికారులు డీఎస్పీపై చర్యలు తీసుకున్నారు. ఆయనను డీజీపీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఐజీ సత్యానారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నిర్లక్ష్యం వహించిన తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ ను బదిలీ చేయగా ఎస్ఐకి మెమో జారీ చేశారు. సూర్యాపేట ఇన్ చార్జ్ డీఎస్పీగా కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. మార్చి 17 న సూర్యాపేట జిల్లాలో మాజీ సర్పంచ్ మెన్చు చక్రయ్యను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మెన్చు చక్రయ్య మార్చి 21న ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి వస్తూ గ్రామ శివారులోని ముత్యాలమ్మ గుడి వద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డలితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ చక్రయ్య కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలానికి చేరుకొని చక్రయ్యను సూర్యాపేట హాస్పిటల్‌కు తరలించగా ట్రీ-ట్‌మెంట్ తీసుకుంటూ చనిపోయాడు.మాజీ సర్పంచ్ చక్రయ్యగౌడ్ హత్య కేసును త్వరలో ఛేదిస్తామని, దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని మల్టీజోన్ -2 ఐజీ సత్యనారాయణ హెచ్చరించారు. నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో హత్యకు గురైన మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య కుటు-ంబ సభ్యులను ఎస్పీ నరసింహాతో కలిసి ఐజీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్ హత్యలో సొంత బంధువుల హస్తం ఉన్నట్లు- గుర్తించామని, సొంత అల్లుళ్లే ప్రాధాన పాత్ర పోషించారని తెలిపారు. ఇంకా విచారణ కొనసాగుతుందని, ఏ ఒక్కరిని వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ఇప్పటికే 9 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని వెల్లడించారు.

## తెలంగాణలో నిరుద్యోగులకు వరంగా యువ వికాసం

### వందశాతం రాయితీతో రూ. 50 వేల యూనిట్లు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో యువ వికాసం పథకం నిరుద్యోగులకు వరంగా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు ప్రత్యేకంగా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం సహాయం చే యడానికి ప్రభుత్వం వివిధ చర్యలను అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ జనాభా ప్రాతిపదికన యూనిట్లు ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను కలెక్టర్లు మండలాలు, సంక్షేమ వర్గాల జనాభా ఆధారంగా యూనిట్లు మంజూరు చేయనున్నారు. రూ.50 వేల విలువైన యూనిట్లకు 100 శాతం రాయితీ కల్పిస్తారు. ఈ పథకం విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా అర్హులైన యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విధివిధానాలు ఇలా ఉన్నాయి. కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు.. దీనిలో వితంతు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు ఉంటాయి. తెలంగాణ ఉద్యమం, ఎస్సీ వర్గీకరణ పోరాటంలో పాల్గొన్నవారికి.. స్వయం ఉపాధిలో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తు ఫారమ్‌ను పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసి.. సంబంధిత పత్రాలను జతచేసి మున్సిపల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేయాలి. ఇటువంటి పథకాల ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించబడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షల రూపాయల కుటుంబ ఆదాయం, పట్టణాల్లో 2 లక్షల రూపాయల ఆదాయం ఉన్న వారు ఈ పథకంలో భాగస్వామి కావచ్చు. దరఖాస్తు చేయడానికి అభ్యర్థులు కొన్ని ముఖ్యమైన పత్రాలు జతచేయాలి. వాటిలో రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలి. ఎంపికైన వారికి 15 రోజుల పాట ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత యూనిట్లను మంజూరు చేసి.. అవసరం అయిన వారికి సహాయం చేస్తారు. ఇక యూనిట్ గ్రౌండ్ చేసిన వారికి ఆరు నెలల నుంచి ఏడాది వరకు నిపుణుల ఆధ్వర్యంలో సాంకేతిక శిక్షణ ఇస్తారు. వ్యవసాయం కాకుండా ఇతర పథకాలకు దరఖాస్తు చేసిన వారి వయస్సు 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి. వ్యవసాయ పథకాలకు అయితే 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వారు అర్హులు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఏప్రిల్ 5 చివరి తేదీగా నిర్ణయించారు. తర్వాత ఏప్రిల్ 6 నుంచి 20 వరకు మండలస్థాయి కమిటీల ద్వారా అర్హులను ఎంపిక చేస్తారు. జూన్ 2 తర్వాత అర్హులకు మంజూరు పత్రాలు జారీ చేస్తారు.

## అప్సర హత్యకేసులో పూజారి సాయికృష్ణకు జీవితఖైదు

హైదరాబాద్ : సరూర్‌నగర్ అప్సర హత్య కేసులో పూజారి సాయికృష్ణకు జీవత ఖైదు విధించింది రంగారెడ్డి కోర్టు. అప్సరను ప్రేమించి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. మోసం చేశాడు పూజారి. అప్సరతో నాలుగేళ్లపాటు ప్రేమయాణం సాగించాడు. పెళ్లి చేసుకోమని వెంటపడటంతో.. శంషాబాద్ ప్రాంతంలో హత్య చేసి.. మ్యాన్‌హోల్‌లో మృతదేహాన్ని పడేశాడు. ఈ కేసులో రంగారెడ్డి కోర్టు నేడు తీర్పు వెల్లడించింది. అతడికి జీవిత ఖైదుతో పాటు.. సాక్ష్యాలను తారుమారు చేసినందుకు అదనంగా మరో ఏడేళ్ల జైలు శిక్షను కూడా విధించింది. వీటితో పాటు.. అప్సర కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. తమిళనాడుకు చెందిన అప్సర డిగ్రీ పూర్తి చేసింది. నటన, మోడలింగ్‌పై ఆసక్తితో ఆమె పలు తమిళ చిత్రాల్లో నటించింది. సినిమా అవకాశాల కోసం ఆమె 2022 ఏప్రిల్‌లో హైదరాబాద్‌కు వచ్చింది. కాశీలోని తన తండ్రి ఒక ఆశ్రమంలో పనిచేస్తున్నారు. తల్లితో కలిసి ఆమె సూరూర్‌నగర్‌లోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆమె తల్లి ఒక ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. అప్సర దేవాలయాలకు తరచూ వెళ్తూ ఉండేది. ఆ సమయంలోనే అక్కడ పూజారి సాయికృష్ణతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. తనను పెళ్లి చేసుకోవాలని సాయిపై అప్సర ఒత్తిడి తెచ్చింది. పెళ్లి చేసుకుంటే సరి.. లేదంటే ఇద్దరి మధ్య సంబంధాన్ని భయటపెడతానంటూ ఆమె బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు. ఈ విషయం భయటపడితే పరువు పోతుందని భావించిన సాయి.. హత్యకు ప్లాన్ చేశాడు. నాలుగు సార్లు హత్యకు ప్లాన్ చేసినా.. వర్కౌట్ కాలేదు. ఐదోసారి 2023 జూన్ 3వ తేదీన .. కోయంబత్తూరు వెళ్తున్నట్లు.. విమాన టికెట్లు కూడా తీసుకున్నానని నమ్మించాడు. దీంతో ఆమె తమ లగేజీతో సహా ప్రయాణానికి సిద్ధం అయింది. ఆమె తల్లికి శంషాబాద్‌లో దించి వస్తానని చెప్పి తన కారులో తీసుకెళ్లాడు. అక్కడ రాత్రి 11 గంటల సమయంలో.. సుల్తాన్‌పల్లిలోని గోశాల వద్దకు వెళ్లారు. అక్కడ కొంతసేపు గడిపారు. అక్కడే అతడు ఆమెకు కంటపడకుండా.. బెల్లం దంచే రాయిని తన కారులో వేశాడు. జూన్ 4 తెల్లవారు జామున.. గోశాల సమీపంలోని నర్కుడలోని ఓ వెంచర్ వద్దకు చేరారు. ఆమె నిద్రలోకి వెళ్లగానే.. కారు సీటు కవర్‌ను ఆమె ముఖంపై వేసి ఊపిరాడకుండా చేశాడు. అప్పటికే తన కారులో ఉంచిన బెల్లం దంచే రాయిని తీసుకొని.. ఆమె తలపై పదిసార్లు బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే ఊపిరి వదిలింది. మృతదేహంపై కారు కవర్ కప్పి.. అక్కడే కారును పార్కు చేసి.. ఏమి తెలియకుండా.. ఇంటికి వచ్చేసి రోజూవారీ కార్యకలాపాల్లో నిమగ్నం అయ్యాడు. రెండు రోజుల తర్వాత ఆమె మృతదేహాన్ని కవర్‌లో చుట్టి.. సరూర్‌నగరలోని మైసమ్మ ఆలయ సమీపంలోని మ్యాన్‌హోల్‌లో పడేశాడు. అక్కడ వాసన వస్తున్నట్లు గమనించిన అతడు రెండు ట్రక్కుల ఎర్రమట్టి తెప్పించి.. మ్యాన్‌హోల్‌లో వేయించాడు. అంతేకాదు.. దానిపై కాంక్రీట్ వేసి పకడ్బందీగా మూసేశాడు.

## భద్రాచలంలో కుప్పకూలిన ఆరంతస్థుల భవనం

### ఇద్దరు మృతి..పలువురికి గాయాలు

### శిథిలాలు తొలగిస్తే.. మృతేల సంఖ్యపై స్పష్టత

### నాసిరకం నిర్మాణం కారణంగానే కూలిందన్న వాదన

భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. భద్రాచలం పంచాయతీ ఆఫీసు దగ్గర నిర్మాణంలో ఉన్న ఓ ఆరంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. భవనంలో పని చేస్తున్న కార్మికుల్లో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది.. ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. జేసీబీలతో శిథిలాలను తొలగిస్తున్నారు. మృతదేహాలను వెలికితీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఇంటి యజమాని శ్రీపతి శ్రీనివాస్ రావు పారిపోయాడు. ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది. ఇంటి యజమాని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్థుల భవనం ఒక్కసారిగా నేలమట్టం అయ్యింది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారని అనుమానిస్తున్నారు. వెంటనే పోలీసులు బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. భవనం కింద చిక్కుకుని పలువురు మృతి చెందినట్లు సమాచారం. భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో ఆరంతస్తుల మేర స్లాబ్ నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఈ భవనం బుధవారం మధ్యాహ్నం హఠాత్తుగా కుప్పకూలింది. భవనం కూలిపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పాత భవనంపైనే మరో నాలుగు అంతస్తులు నిర్మిస్తుండగా ప్రమాదం జరిగింది. నిర్మాణంలో లోపాల వల్లే ఘటన జరిగినట్టు అధికారులు భావిస్తున్నారు. నిర్వాహకులు ట్రస్ట్ పేరుతో విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఐటీసీ నుంచి క్రేన్లు, పొక్లెయిన్లు రప్పిస్తున్నారు. కూలిన భవనం పక్కనే ఓ ఆలయం కూడా నిర్మిస్తున్నారు.నాశిరకం నిర్మాణం చేయడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుందని అంటున్నారు. ఓ పాతభవనంపై మరో నాలుగు అంతస్థులు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. గత ఏడాది పంచాయతీ సిబ్బంది నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించడంతో అప్పటి నుంచి నిర్మాణం నిలిచిపోయింది. ఒకవేళ భవనం ప్రారంభోత్సవమై భక్తులు ఉండి ఉంటే పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేదని ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం పనులు జరుగుతున్న సమయంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే భవన యజమాని భార్య చెబుతున్న ప్రకారం.. ఇద్దరు కూలీలు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే శిథిలిలాల కింద ఎంతమంది ఉన్నారనేది తొలగింపు తరవాత బయటపడనుంది. నిర్మాణంలో నాణ్యత లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు.

## అసెంబ్లీలో ఆసక్తిగా మారిన కూనంనేని వ్యాఖ్యలు

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలలో చర్చకు దారితీశాయి. ఆయన ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురించి చేసిన వ్యాఖ్యలు విపరీతంగా ఆకర్షించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. 'ఏ ఇజం లేదు.. టూరిజమే ముఖ్యం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలు అప్పట్లో కోపాన్ని కలిగించినప్పటికీ.. పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటే.. ఖర్చు లేనిది ఏదైనా ఉంది అంటే అది టూరిజమే అని అన్నారు. తెలంగాణలో పర్యాటక ప్రాంతాలు అనేకం ఉన్నాయని.. వాటిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి కూనంనేని సూచించారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి కూనంనేని మరిన్ని సూచనలు చేశారు. ఆయన ప్రతిపాదించిన వాటిలో నేలకొండపల్లి, పాపికొండలు, నాగార్జునసాగర్ వంటి ప్రాంతాలను ప్రాధాన్యతతో అభివృద్ధి చేయాలని.. ఈ ప్రాంతాలను పర్యాటక హబ్‌లుగా మార్చాలని కోరారు. తెలంగాణలో పర్యా టక రంగం పెరిగితే.. ఆర్థిక వృద్ధి కూడా పెరిగిపోతుందని ఆయన వివరించారు.

## కామారెడ్డి జిల్లాలో విషాదం

కామారెడ్డి : గుండెపోటుతో తండ్రి మరణించగా, ఆపుకోలేని దుఃఖంలోనూ ఆ తనయ పది పరీక్షలు రాసి, అంత్యక్రియలకు హాజరై, తర్వాత వచ్చి తండ్రి మృతదేహం పై పడి కూతుళ్లు గుండెల విసిలా రోదించిన తీరు ప్రతి ఒక్కరి హృదయాలను కలచివేసింది. మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన బీబీపేట సత్యనారాయణ (42) కామా రెడ్డి జిల్లా భిక్కనూరు మండలం వీ6 ఓ పత్రిక విలేకరిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో నిన్న రాత్రి భోజనం చేసి పడుకోగా.. బుధవారం తెల్లవారుజామున నిద్రలోనే గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతునికి భార్య మంజుల, కూతుళ్లు కీర్తన, దీపిక, అనుష ఉన్నారు. జంగంపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇద్దరు కూతుళ్లు చదువుతున్నారు. అయితే కీర్తనకు టెన్త్ క్లాస్‌ఎగ్జామ్ ఉంది. తండ్రి మరణించాడు అన్న విషయం తెలిసి, పుట్టెడు దుఃఖంలో కూడా పరీక్ష రాసేందుకు వెళ్లింది. పరీక్ష రాసిన వెంటనే తాను, తనతో పాటు- చెల్లెలు అనూషను వెంటబెట్టు-కొని, తమ బంధువుల ద్విచక్ర వాహనాలపై ఎక్కి, నస్కల్ గ్రామానికి చేరుకొని, తండ్రి మృతదేహం పై పడి డాడీ అంటూ గుండెల విసెలా రోదించడం చూసి పలువురు కంట తడి పెట్టు-కున్నారు.

## కోర్టు అంశాలను అసెంబ్లీలో ఎలా ప్రస్తావిస్తారు

### సిఎం వ్యాఖ్యలపై కెటిఆర్ అభ్యంతరం

హైదరాబాద్ : పార్టీ ఫిరాయింపులు, ఉప ఎన్నికలపై అసెంబ్లీ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్ కామెంట్స్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. రేవంత్ రెడ్డి ఆయన సీఎం అనే విషయం మర్చిపోతున్నారు.. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ వేదికగా తీర్పు ఇవ్వాలని యత్నం చేస్తున్నారని విమర్శించారు. న్యాయస్థానాల పరిధిలో ఉన్న అంశాలపై వ్యాఖ్యలు చేయవద్దని నిబంధనలు చెబుతున్నాయి.. కానీ సీఎం రేవంత్ రెడ్డి ఆ రూల్స్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. తాను నిబంధనలకు అతీతమని.. సుప్రీంకోర్టు కంటే ఎక్కువని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలీని న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇకనైనా రేవంత్ రెడ్డి పాలనపై వ్యవహరించి పాలనపై దృష్టి సారించాలని.. సూచించారు.

## పాస్టర్ మృతిపై లోతైన విచారణ

### హోంమంత్రి అనిత వెల్లడి

రాజమండ్రి : పాస్టర్ పగడాల.ప్రవీణ్ మృతిపై లోతైన విచారణ చేయిస్తున్నామని హోం మంత్రి అనిత వెల్లడించారు. డీఎస్పీ స్థాయి పోలీసు అధికారుల కమిటీ విచారణ చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం పారదర్శకంగా ఈ ఘటనపై దర్యాప్తు చేస్తోందన్నారు. రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని అన్నారు. దీనిని కేవలం యాక్సిడెంట్‌గా మాత్రమే పరిగణించటం లేదని హోం మంత్రి స్పష్టం చేశారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోందన్నారు. రాజకీయంగా, మతపరంగా విద్వేషాలు రగిల్చేలా వ్యవహరించొద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందన్నారు. ప్రమాదవశాత్తూ ఈ ఘటన జరిగిందా ? ఏమైనా ఇం-టె-న్షన్ ఉందా ? అన్న దానిపైనా విచారణ చేస్తున్నామన్నారు. అనుమానాస్పద మృతిగానే ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. ఘటనా స్థలికి సమీపంలో కాల్ డేటా రికార్డులు కూడా తీసుకుంటు-న్నామన్నారు. దర్యాప్తు విషయంలో ఎవరికీ ఎలాంటి అభద్రతా భావన అవసరం లేదని హోం మంత్రి తెలిపారు.

## భట్టి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన

హైదరాబాద్ : కమీషన్లతోనే కాంగ్రెస్ పాలన సాగుతుందని బీఆర్ఎస్ సభ్యులు అన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బుధవారం కేటీఆర్ మాట్లాడిన తరువాత భట్టి కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటుగా స్పందించారు. దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు వద్దురా నాయనా 20 పర్సంట్ పాలన అంటూ.. అసెంబ్లీ ఎమ్మెల్యేల ప్రవేశ ద్వారం వద్ద నిరసన తెలిపారు. ఇది పర్సంటేజ్‌ల పాలన అంటూ బీఆర్ఎస్ నినాదాలు నినాదాలు చేశారు. ఇదేమి ప్రభుత్వం.. 20 శాతం, 30 శాతం పర్సంటేజీల ప్రభుత్వం అని కాంగ్రెస్ సర్కారుపై ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఉదయం శాసనసభలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా సచివాలయంలో కమీషన్లపై, కాంట్రాక్టర్ల ధర్నా గురించి కేటీఆర్ ప్రస్తావించారు. కేటీఆర్ వ్యాఖ్యలపై భట్టి విక్రమార్క స్పందిస్తూ.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని అన్నారు. భట్టి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలపై భట్టి విక్రమార్క క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు.

## నీటి, కరెంట్ కష్టాల్లో అల్లాడుతున్న తెలంగాణ : కేటీఆర్


హైదరాబాద్ : ఒకవైపు నీటి కష్టాలు.. మరోవైపు కరెంట్ కోతలతో రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజాపాలనలో ప్రగతి అధోగతిగా మారిందని తెలిపారు. సాగునీళ్లు ఆగిపోయాయని.. వ్యవసాయం ఆగమైందని పేర్కొన్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో పచ్చని పొలాలు మాయమైపోయాయని కేటీఆర్ అన్నారు. పంట చేలు పశువులకు మేతగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో మాయమైన బోరు బం డ్లు.. 15 నెలల కాంగ్రెస్ నిర్లక్ష్య పాలన మూలంగా గ్రామాల్లో సాగునీటి కోసం మళ్లీ బోరు బండ్లు ప్రత్యక్షమయ్యాయని అన్నారు. కేసీఆర్ పాలనలో మిషన్ భగీరథతో ఇంటింటికి అందిన తాగునీళ్లు.. నేడు మళ్లీ తాగునీటి కోసం బోర్లు, బావులు, ట్యాంకర్లను ఆడబిడ్డలు ఆశ్రయిస్తున్నారని చెప్పారు.

## సంపాదకీయం

# పర్యావరణ విధ్వంసం!

దేశంలో ఎండలు ముదరుతున్నాయి. పట్టణాల్లో ఎండల తీవ్రత తీవ్రంగా ఉంటోంది. గ్రామాల్లోనూ ఎండలు మంటపుట్టిస్తున్నాయి. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో ఇంటిముందున్న చెట్లను నరికి వేస్తున్నారు. కోతుల బెడ నుంచి ఇప్పటికి రక్షణకు కార్యాచరణ కానరావడం లేదు. అడవులను వదిలి అవి గ్రామాల్లో తిష్టవేశాయి. ఇక ప్రజలు మొక్కల పెంపకాన్ని వదిలి చల్లదనం కోసం కూలర్లు, ఎసిలు వాడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఇదే సందర్భంలో కాలుష్యాన్ని కొని తెచ్చుకుంటున్నాం. మొక్కలు నాటడం,పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న విషయాలను పక్కన పెట్టారు. ఇదంతా ప్రభుత్వాల పని అన్నట్లుగా ప్రజల భావన ఉంది. అందమైన ఇల్లు కట్టుకుంటున్న వారు సైతం నాలుగు మొక్కలు నాటాలన్న స్పృహ లేకుండా పోతున్నది. మొక్కలు నాటేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఫోటోలకు పోజులిచ్చే కార్యక్రమంగా మారింది. తమ ఇళ్లల్లోనే ఓ మొక్కను నాటి గ్రీన్ ఛాలెంజ్ అంటూ ఇంతకాలం ప్రచారం చేసుకున్నారు. నిజానికి గ్రీన్ ఛాలెంజ్ అంటే గ్రామాల రూపురేఖలు మారాలి. కానీ అలా జరగడం లేదు. హరితహారంలో 200 కోట్లమొక్కలు నాటామిన ఘనంగా చెప్పిఉకున్న బిఆర్ఎస్ పాలకులు వాటి ఆనవాళ్లు ఎక్కడో చూపితే బాగుండేది. అలా జరిగితే కనీస మార్పు వచ్చి ఉండేది. చంద్రబాబు ఉమ్మడి ఎపిలో ఇలాంటి ప్రచారాలే చేసినా ఎక్కడా మొక్కల జాడలేదు. ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పు కోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు పర్యావరణ విధ్వంసానికి కారణ మవుతున్నాయి. వాగులూవంకల జాడలేకుండా పోయింది. కొండలు, గుట్టలను తవ్వేస్తున్నాం. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటిలే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. అంటువ్యాధుల నివారణకు పరిశుభ్రత ముఖ్యమని హెచ్చరి స్తున్నా ప్రజలు చలించడం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకుంటున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికి వేస్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు పలు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవు తుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. అకాల వర్షాలు..తట్టుకోలేని ఎండలు..తట్టుకోలేని చలిగాలులు మనలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పాలకులకు ఇవేవీ పట్టడం లేదు. ఎందుకంటే ఉన్నన్నాళ్లూ పదవి అనుభవించి.. తదుపరి ఏమైతే మాకేంటన్న ధోరణిలో ఉన్నారు. కోట్లాదిమంది చేస్తున్న విధ్వంసం అంటే ప్లాస్టిక్ వాడిపడేం, చెత్తాచెదారం తీసివేయడం వేలల్లో ఉన్న పారిశుద్య సిబ్బందికి సాధ్యం కాదు. కనీసం ఇక్కడైనా ప్రజలను కట్టుబాట్లు పెట్టివుంటే బాగుండేది. ప్రజలు పారిశుధ్య పనులు లాంటివి ఎందుకనో చేయడం లేదు. దీంతో కాలుష్యం మళ్లీ పెరుగుతోంది. ఎక్కడిక్కడ చెత్తకుప్పలు పేరుకు పోతున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో కాలువల్లో అవన్నీ నిండి మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా తయారయ్యింది. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలు కూడా చెత్తను బయటకు విసిరేసి చోద్యం చూస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో కాలం గడిపేస్తున్నారు. చెత్త పేరుకుపోయిందని ..అందుకు ప్రభుత్వానిదే బాధ్యతన్నట్లుగా దీరాలు తీస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం లాంటి విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దగా పట్టింపు లేకుండా ఉన్నాయి. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా..భూగర్బ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటికాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. పర్యావరణ విధ్వంసం పై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగిపోతున్నాడు. ఎండ వేడిమి, వడగాడ్పులతో ప్రజలు అల్లాడి పోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడు చలికాలం వణికిస్తే..ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు మనం చేస్తున్న విధ్వంసం కారణమని గుర్తించడం లేదు. పాలకులతో పాటు.. ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుం డటంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనిని కనీసం కొంతయినా తగ్గించడానికి కొంతమేరకు అయినా పరిసరాల పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలి. ఇందుకోసం నిరంకుశంగా అయినా ప్రభుత్వాలు ప్రజలను హెచ్చరించాలి. ప్రచండ భానుడి ప్రతాపానికి దేశం అల్లాడుతోందని ఊరుకుంటే ఇకముందు కూడా ఇలాగే ఉంటుంది. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకుంటున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తు న్నారు. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నది అలవాటు కావాలి.

# త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ ప్రచారం




## మండుటెండల్లో రాజకీయ నేతలకు పరీక్ష

హైదరాబాద్ : త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ ప్రచారం సాగుతోంది. అలాగే మంత్రివర్గ విస్తరణ కూడా జరుగనుందని ప్రచారం సాగుతోంది. అనేక హామీలను అమలు చేశామని చెప్పుకుంటున్న అధికార కాంగ్రెస్ స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు సమాయత్తం అవుతోంది. మొన్నటి ఫిబ్రవరిలో అని ఊరించారు. బిసి, ఎస్సీ రిజర్వేలషన్లపై హామీలను నెరవేర్చామని అంటున్నారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడే ఎన్నికలకు వెళ్లాలని చూస్తోంది. ఇప్పుడు రాజకీయ వాతావరణం తమకు అనుకూలంగా ఉందని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్న భావనలో బిఆర్ఎస్, బిజెపి నేతలు ఉన్నారు. అందుకే ఏప్రిల్, మేలో స్థానిక ఎన్నికలు వస్తే ఎదుర్కోవడానికి ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్దం చేస్తున్నాయి. మండుటెండలు తెలంగాణతో పాటు ఎపిలోనూ వివిధ పార్టీల కార్యకర్త లకు పరీక్ష పెట్టబోన్నాయి. అన్ని పార్టీలు కూడా ఆందోళనలకు సిద్దం అవుతున్నాయి. స్థానిక ఎన్నికలు రాబోతున్న తరుణంలో అందుకు అనుగుణంగా రాజకీయ పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. ఇందుకోసం వివిధ కార్యక్రమాలను రూపొందించుకుంటున్నాయి. వచ్చే నెలలో బిఆర్ఎస్ వార్షికోత్సవం ఉంది. అలాగే కెటిఆర్ పాదయాత్రను ప్రకటించారు. కాంగ్రెస్ కూడా ప్రజల్లోకి వెళ్లాలని యోచిస్తోంది. ఎపిలో టిడిపి కూడా అసెంబ్లీ సమావేశాలు ముగియడంతో పలు కార్యక్రమాలు చేయనుంది. ఈ క్రమంలో పార్టీల్లో ఉన్న కార్యకర్తలంతా ఎండల్లో పడి పోరాడాల్సి ఉంటుంది. ఎండలు ఆందోళనకరంగా పెరుగుతున్న దశలో పార్టీల కార్యక్రమాలుమరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రజలు ఇంటిపట్టున ఉండి దూరంగా ఉందా మనుకున్నా రాజకీయాల కారణంగా బయటకు రాక తప్పని పరిస్థితులు వస్తున్నాయి. వరుస ఆందోళనతో అధికార పార్టీతో పాటు అనేక పార్టీల కార్యకర్తలు నానాయాతన పడుతున్నారు. మార్చి ఎండలే కదా అని సర్దుకున్నా ఇప్పుడు మండుటెడల్లో ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. ఎక్కడ వెనకబడి పోతామో అన్న భయంతో నేతలు కార్యకర్తలను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. దీనికితోడు రేపటి రాజకీయ పోరాటాలకు ఇప్పటి నుంచే అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు రూపొందిస్తున్నాయి. అన్ని పార్టీలు మళ్లీ పోటీకి సమాయత్త మవుతున్నాయి. స్థానిక గెలుపు గుర్రాలను బరిలో దించి పాగా వేసేందుకు వ్యూహారచన చేస్తున్నాయి. ఇప్పటి నుంచే పట్టుపెంచు కునేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు ఎవరికి వారు అంచనాలు వేస్తున్నారు. ఆయా పార్టీల అధిష్ఠానాలు రాబోయే ఎన్నికలపై ప్రత్యేక దృష్టిపెట్టాయి. మరోవైపు ఎండలతో కార్యకర్తలు వాపోతున్నారు. వేసవిని తలచుకుంటేనే భయం వేస్తోందని అంటున్నారు. మొత్తంగా రాజకీయాపార్టీలు తమాందోళనా కార్యక్రమాలతో ఎండలకు మించి పరీక్ష పెడుతున్నాయి. మళ్లీ పార్టీల హడావిడితో తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే ఎన్నికల వేడి మొదలు కానుంది. సర్పంచ్ ఎన్నికలంటే జిల్లాల్లో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. వామపక్ష నేతలు కూడా మెల్లగా తమ గళాన్ని పెంచారు. ఒకేసారి అన్ని పార్టీలు రోడ్లపైకి వస్తుండడంతో రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి. అధికార పార్టీకి ధీటుగానే మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతిపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బీజేపీలు సిద్ధమవుతు న్నాయి. రాష్ట్ర నేతలు, మంత్రులు కావాలనే కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. పోటీగా జిల్లాల్లో సమావేశాలు నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు పార్టీల నేతలు రైతులను మోసం చేసాయని బిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. మరిన్ని కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. మొత్తంగా అన్ని పార్టీల కార్యకర్తలు రానున్న ఎన్నికలు ఎండలను లెక్క చేయకుండా రోడ్డెక్కాల్సిన ఆగత్యం ఏర్పడింది.

# ఉపాధి కూలీలకు అండ

## పని క్షేత్రాల్లో రక్షణ చర్యలు

నిజామాబాద్ : జిల్లాలో వేసవి నిబంధనలతో ఉపాధిహామీ పనులను చేపడుతున్నారు. పూర్తి రక్షణ చర్యలతో పనులకు హాజరయ్యేలా డీఆర్‌డీవో అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. మరోవైపు ఎండల ప్రభావం అధికంగా ఉండడంతో కూలీలు పనిచేసే ప్రాంతాల్లో వసతులు కల్పిస్తున్నారు. నీడతో పాటు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామసభల్లో గుర్తించిన పనులను చేపడుతూ స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా నీటిగుంటలు, ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం, కందకాలు, చెక్‌డ్యాం కాలువల్లో పూడికతీత పనులు ఊటకుంటలు, టేకు నర్సరీలు, కిచెన్ షెడ్‌లు, గడ్డి పెంపకం, పశువుల నీటి తొట్టెలు, పండ్లతోటల పెంపకం, డంపిగ్‌యార్డులు, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి నిల్వలకు సంబంధించిన పనులు, ప్రభుత్వ పాఠశాలలో వంటశాలల నిర్మాణాలను చేపడుతారు.కూలీల సంఖ్యను మరింత పెంచేందుకు ఎంపీడీవోలు, ఉపాధిహామీ ఏపీవోలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కూలీలకు పనిరోజులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం అధికారులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తాయి. జూన్‌నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. వేసవిలో గ్రామాల్లోని పేదలు వ్యవసాయ కూలీలు పనులు లేకపోవడంతో ఎక్కువ మంది ఉపాధిహామీ పనులపై ఆధారపడుతున్నారు.

# అడవిపందుల దాడితో పంటలకు నష్టం

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో అడవి పందుల బెడద రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చేతికొచ్చే పంటలను పందుల మంద ధ్వంసం చేస్తోంది. ప్రధానంగా మక్కపంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పంటల రక్షణతో పాటు ప్రమాదాలను నివారించడానికి అటవీశాఖ అధికారులు పంటలపై దాడి చేస్తున్న అడవి పందులను కాల్చివేతకు చర్యలు చేపట్టారు. పందుల బారి నుంచి పంటలను కాపాడు కునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో రైతులు వేరుశనగ, శనగ, జొన్న పంటలను సాగు చేస్తున్నారు. చేతికి వచ్చిన పంటలపై అడవి పందులు దాడి చేసి నాశనం చేస్తున్నాయి. ఫలితంగా రైతులు పంటలను నష్టపోతున్నారు. దీంతో రైతులు పంటలకు విద్యుత్తీగలను అమర్చుకుంటుండగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

# పెరుగుతున్న ఎండలతో ప్రజలు అప్రమత్తం కావాలి

కొత్తగూడెం : జిల్లా అధికారులంతా వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా అధికారులు హెచ్చరించారు. జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై దృష్టి పెట్టాలని, ఇప్పటికే 40 డిగ్రీల ఉష్ణోగ్రతలకు చేరువయ్యారని తెలిపారు. ప్రధానంగా కొత్తగూడెంలో ఎండలు ఎక్కువ కాబట్టి వడదెబ్బ మృతులను నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక, వైద్య శాఖ అధికారులు ప్రజలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. వేసవిలో అధక ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు ప్రజలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలనికోరారు. వేసవి ఉష్ణోగ్రతలపై అధికారులకు సూచనలను చేశారు. ప్రయాణం చేసేటప్పుడు గొడుగులు లేదా, తలకు వస్త్రాన్ని చుట్టుకొని వెళ్లాలని, ధరించే దుస్తులలో తెలుపురంగు దుస్తులను వాడాలన్నారు. వీలైనంత వరకు అందుబాటులో ఉన్న నిమ్మరసం, లేదా మజ్జిగను తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రాథమిక అరోగ్య కేంద్రాలలో, వైద్య శిబిరాలలో తప్పక ఉంచాలని స్పష్టం చేశారు. పిల్లలు గర్భిణులు, వృద్ధులు వేసవిలో ఎక్కువగా తిరగకుండా చూడాలన్నారు. కార్‌పార్కింగ్‌లు చేసేటప్పుడు కారులో ఎవ్వరినీ ఉంచరాదని, చెట్ల నీడలోనే పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

# కొడాలి నానికి అస్వస్థత..ఆస్పత్రిలో చేరిక


హైదరాబాద్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొడాలి నాని తీవ్ర అస్వస్థతకు గురయ్యారట.. హైదరాబాద్‌లో ఉన్న కొడాలి నాని అస్వస్థతకు గురయ్యారు.. ఛాతిలో నొప్పిరావడంతో.. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఏఐజీ ఆస్పత్రికి తరలించారు.. ప్రస్తుతం ఏఐజీ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. కొడాలి నాని గ్యాస్ట్రిక్ సమస్యతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారని చెబుతున్నారు ఏఐజీ వైద్యులు.. కాగా, గతంలో గుండె సంబంధిత సమస్యలతో కొడాలి నాని ఇబ్బంది పడ్డారు.. దీంతో, ఇప్పుడు గ్యాస్ట్రిక్ సమస్యయేనా..? లేక మళ్లీ గుండెకు సంబంధించిన ఏదైనా ఇబ్బంది జరిగిందా? అనేది తేల్చేందుకు సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న కొడాలి నాని.. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధించారు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో.. వైఎస్ జగన్ తొలి కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.. జగన్ కేబినెట్ 2.0లో ఆయనకు మంత్రి పదవి దక్కలేదు.. ఇక, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కొడాలి నాని మరోసారి గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగినా ఓటమి పాలైన విషయం విదితమే..

# కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

హైదరాబాద్ : పది పరీక్షలో మాస్ కాపీయింగ్ నిందితులతో మున్సిపల్ చైర్మన్‌కు సంబంధాలు ఉన్నాయంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. దీంతో కేటీఆర్ ట్వీట్‌పై నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత, శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదు అయ్యాయి. కాంగ్రెస్ నాయకుడు ఉగ్గడి శ్రీనివాస్ కూడా సోషల్ మీడియాపై ఫిర్యాదు చేశారు. కాగా.. ఈనెల 21న నకిరేకల్‌లో టెన్త్ ఎగ్జామ్ పేపర్ లీకేజ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే తెలుగు ప్రశ్నాపత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. నల్గొండ జిల్లా నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలోని 8వ నెంబర్ గది నుంచి తెలుగు ప్రశ్నాపత్రం లీకైనట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై వేగంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పేపర్ లీకేజీకి బాధ్యులైన చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించగా.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇన్విజిలేటర్‌ను కూడా సస్పెండ్ చేశారు. అంతే కాకుండా ప్రశ్నపత్రం లీకేజ్ అవడానికి ఓ విద్యార్థిని కారణం అంటూ ఆమెను డిబార్ చేశారు.

# బతుకు నావను ఈదే ధైర్యం ఉండాలి !

తిరుమల : కష్టాలను ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలి. జీవితం అంటే వడ్డించిన విస్తరి కాదు. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం వస్తుందో ఊహించడం కష్టం అందువల్ల కష్టాలను తట్టుకుని నిలబడే ఆత్మసథయిర్యం కలిగి ఉండాలి. కుంగిపోతే మనలను ఎవరూ కాపాడలేరు. పదమూడేళ్లు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాత వాసం..బతుకంతా అడవుల పాలు. అయినా సరే పాండవులు బతికారు. అరణ్యవాసంతం తరవాత శ్రీరాముడు చక్కగా రాజ్యం పాలించాడు. అడవుల్లో ఉన్నా, రాజ్యాధికారంలో ఉన్నా ఒకేలా ఉండాలని ఈ రెండు పురాణాలు మనలను గుర్తు చేస్తుంటాయి. ఎవరు ఈ బతుకును వద్దన్నారు? చాకచక్యంగా జీవిత నావను నెట్టుకుపోతే ప్రయాణ దూరం తగ్గిపోతుంది. లక్ష్యం చేరువవు తుంది. అన్నీ ఉన్న వాళ్లు బతుకుతారు. ఏమీ లేనివాళ్లు సైతం బతుకుతారు. కళ్లులేనివారు, కాళు లేనివారు కూడా అద్భుతాలు చేస్తున్నారు. సర్వాంగాలతో చక్కటి శరీరం ఇచ్చిన సర్వేశ్వరుడికి మనం ఎంతో రుణపడి ఉండాలి. మరణం గురించి పదేపదే ఆలోచించనక్కర్లేదు. మరణం బతుకు రహస్యం ముడి విప్పుతుంది. బతుకు జీవనసారం అనుభవంలోకి తెస్తుంది. అపరిష్కృతంగా ఉన్న సమస్యను నల్ల బల్ల మీద నుంచి తుడిచి వేస్తే సమస్య పరిష్కారం కాదు. శోధించి, సాధించాలి. జీవించి చూపించి, సత్యాన్ని సాధించాలి.చెట్లు పైకి ఎదుగుతాయి. నిన్నటి వరకు పాకే పిల్లాడు ఈ రోజు నడుస్తాడు. సన్నటి పాయలుగా పారే నది, ప్రవహించి ప్రవహించి సముద్ర రూపం పొందుతుంది. గొప్పగా బతకడంలోనే బతుకు రహస్యం బోధ పడుతుంది. దివ్యంగా బతకడంలో జీవన పరమార్థం నెరవేరుతుంది. బతకడం ఎవరూ నేర్పనక్కర్లేదు. శరీరంలో, మనసులో, ఆత్మలో బతుకు విత్తనం ఎప్పుడో వేశాడు ఆ పైవాడు. దాని మీద ఆనందం అనే ఎరువు వేసి, సంతోషం అనే నీళ్లు జల్లుతూ ఉండాలి. అప్పుడు బతుకు వృక్షం పచ్చగా ఎదుగుతుంది. మనం వృక్షాలుగా మారితే చిలుకలు వాటంతట అవే వచ్చి వాలుతాయి. కోకిలలు చెట్లను వేదికలు చేసుకుని కచేరీలు చేస్తాయి. బతుకు ఒక పాట. హాయిగా పాడుకోవాలి. బతుకు ఒక ఉత్సవం. ఆనందానికి అర్థం చెప్పాలి. విషాదంగా ఉండటం ఆధ్యాత్మికత అని ఎవరూ చెప్పలేదు. విషాదాన్ని జీవితం నుంచి తరిమికొట్టడమే దివ్యమైన జీవితం! అజ్ఞానమే బతుకును అవగాహనకు రానివ్వకుండా చేస్తుంది.



ఆధ్యాత్మికం

## నవోదయకు వశిష్ట విద్యార్థి ఎంపిక

**- కొనసాగుతున్న వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాల విజయపరంపర**




**ఓదెల మార్చి 26,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో గల వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షలో తమ ప్రతిభను చాటారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రతి ఏటానవోదయలో సీటు సాధించడం ఈ పాఠశాలకు ఆనవాయితీగా మారింది. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఈ పాఠశాలలో చదువుతున్న సిరిసేటి వశీకర్ చొప్పదండి నవోదయ పాఠశాలకు అర్హత సాధించాడు. 2016 నుండి వరుసగా ప్రతి సంవత్సరం ఈ పాఠశాల నుండి నవోదయకు విద్యార్థులు ఎంపిక కావడం ఉపాధ్యాయుల పనితీరుకు, పట్టుదలకు నిదర్శనం.ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభం నుండి నవోదయలో సీట్లు సాధించే దిశగా తమ విద్యార్థులను తీర్చిదిద్దు తున్నామని, విద్యార్థుల ప్రతిభకు సాన పెడుతున్నామని పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపల్ మ్యాడగోని కిషన్ గౌడ్ ది క్రైమ్ న్యూస్‌కు తెలిపారు. నవోదయలో సీటు సాధించిన సిరిసేటి వశీకర్‌ను ప్రిన్సిపల్ మరియు అధ్యాపక బృందం అభినందించారు. విద్యార్థి తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## పార్లమెంటు ముట్టడిలో పెద్దపల్లి యూత్ నాయకులు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం పార్లమెంటు ముట్టడి కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా నాయకులు పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్ డిల్లీలో ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ బిజెపి పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేసి దేశవ్యాప్తంగా నిరుద్యోగం లేకుండా చేస్తామని హామీ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్యాయం చేశారని ఆరోపించారు. నిరుద్యోగులతో చెలగాటమాడితే సహించేది లేదని, వెంటనే కేంద్రప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే దేశ వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమాల్లో పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గుర్తింపు సంఘానికి యాక్టింగ్ క్లర్క్‌ల వినతి



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ ఏరియాలోని విధులు నిర్వహిస్తున్న యాక్టింగ్ క్లర్క్ లు పదోన్నతులు కల్పించాలని కోరుతూ, బుధవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కి వినతి పత్రం అందించారు. ఉదయం యూనియన్ కార్యాలయానికి వచ్చిన యాక్టింగ్ క్లర్క్ లు (జనరల్ మజ్దూర్లు) ఏరియా నాయకులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో గత ఐదు సంవత్సరాల నుండి యాక్టింగ్ క్లర్క్ లుగా విధులు నిర్వహిస్తున్న 21 మంది యాక్టింగ్ క్లర్క్ లు తమకు జూనియర్ అసిస్టెంట్ (క్లర్కు) లుగా పదోన్నతులు ఇప్పించాలని ఆ వినతి పత్రంలో కోరారు. సానుకూలంగా స్పందించిన యూనియన్ నాయకులు, సమస్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, పెద్ద నాయకుల దృష్టికి తీసుకువెళ్ళి, పదోన్నతులు ఇప్పించేందుకు కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. వినతి పత్రం అందుకున్న వారిలో యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు ఎల్.ప్రకాష్, బ్రాంచ్ కార్యదర్శి జి.రవీందర్, ఉపాధ్యక్షులు బి.అన్నారావు, సహాయ కార్యదర్శి సాంబశివరావు, డిపార్ట్మెంట్ కార్యదర్శి మహేందర్, సహాయ కార్యదర్శి లోకేష్ విక్రమ్, కార్యదర్శి సమత, కావ్య, జయ, దేవేందర్, రాంసాగర్, కె.తిరుపతి, ఈ.తిరుపతి, సంతోష్, సిరాజ్ ఉన్నారు.

## మూడు చింతలపల్లి తహాసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ

**- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి**






**మూడుచింతలపల్లి, మార్చ్ 26 (ది క్రైమ్ న్యూస్) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి బుధవారం మూడు చింతలపల్లి తహాసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసారు. ధరణిలో పెండింగ్ వివరాలపై అదనపు కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ధరణిలో ఎన్ని పెండింగ్ ఉన్నాయని ఎంఆర్ఓ ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ తొందరగా క్లియర్ చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ నర్సింహారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రభుత్వ భూములలో ఆక్రమణల తొలగింపుకు కట్టుదిట్టమైన చర్యలు - పురపాలక భవన పనులు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలి
- మంథని, ముత్తారం, కాల్వ శ్రీరాంపూర్ మండలాలలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి మార్చి 26 ( ది క్రైమ్ న్యూస్ ):** రెవెన్యూ విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని, ముత్తారం,కాల్వ శ్రీరాంపూర్ మండలాలలో విస్తృతంగా పర్యటించారు. మంథని మండలం లోని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం, నిర్మాణం అవుతున్న నూతన పురపాలక భవన పనులను, ముత్తారం మండలం ధర్యాపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలను, వసతి గృహం, అక్కడ ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.మందని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్షిస్తూ,జాతీయ రహదారి 163 జీ క్రింద ముత్తారం మండలం లక్కారం గ్రామంలో సేకరించిన భూములలో ఉన్న నిర్మాణాలకు సంబంధించిన నగదు నిర్వాసితులకు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బోరు బావులు, చెట్లు, ఇతర నిర్మాణాలకు పరిహార నిధులు ప్రతిపాదనలను సంబంధిత అధికారులు వెంటనే జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ కు పంపి త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. డివిజన్ పరిధిలో భూ శుద్దీకరణ సమయంలో జరిగిన తప్పుల సరి చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు సర్వే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చెరువుల ఎఫ్టిఎల్ బఫర్ జోన్ పరిధి నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువు భూములలో ఆక్రమణలు ఎక్కడైనా జరిగితే వెంటనే రికవరీ చేయాలని అన్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములకు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మంథని పట్టణంలో నిర్మాణం అవుతున్న నూతన పురపాలక భవనంపనులు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే రోడ్డు అభివృద్ధి పనులను చేపట్టాలని, రోడ్డుకు ఇరువైపులా గ్రీనరీ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధర్యాపూర్ ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించి పిల్లల డార్మెంటరీ, భోజనశాల, వంటగది పరిశీలించారు పిల్లలకు అందుతున్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.ముత్తారం మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూ సేకరణ పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఆన్లైన్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ కాల్వ శ్రీరాంపూర్ మండల హెడ్ క్వార్టర్ లో ఉన్న ప్రభుత్వ భూములను సందర్శించారు, ప్రభుత్వ భూములు ఎక్కడైనా కబ్జాకు గురైతే వెంటనే విడిపించాలని, కబ్జాదారుల చెర నుంచి భూమి తొలగించి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే దిశగా





చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహసిల్దార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మంథని తహసిల్దార్ గిరి, ముత్తారం ఎంపీడీవో సురేష్, ఎంపీఓ గోవర్ధన్, కాల్వ శ్రీరాంపూర్ తహ సిల్దార్ జగదీశ్వర్ రావు , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్‌లతో యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

- డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షిణితులై ఆర్థికంగా నష్టపోయి యువత వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అన్నారు. బుధవారం రోజు డివైఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా కమిటీ సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ ప్రస్తుత పరిస్థితులలో వాటిని ఆసరాగా చేసుకొని కొంతమంది అడ్డదారులలో అక్రమ సంపాదనే లక్ష్యంగా బెట్టింగ్ యాప్ లను విచ్చలవిడిగా యువత ఆకర్షించే విధంగా ప్రముఖుల సెలబ్రిటీల చేత వారి యొక్క వ్యాపారాన్ని ప్రకటనలు ఇస్తూ యువతను అప్పుల ఊబిళ్ళల్లో నెట్టవేస్తూ వారి ప్రాణాలు పోవటానికి కారణమవుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం యొక్క ప్రతిష్టమైన నియంత్రణ ఆన్లైన్ యాప్ ల మీద లేకపోవడం వల్లనే విచ్చలవిడిగా బెట్టింగ్ యాప్ లు పుట్టుకొస్తున్నాయని దీని మీద కేంద్ర ప్రభుత్వం వెంటనే నియంత్రణ చర్యలు తీసుకోవాలని గతంలో ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు పబ్లిక్ గామిలింగ్ యాక్ట్ క్రింద కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈరోజు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో భవిష్యత్ ఉన్న నిరుద్యోగులు ఈ యాప్ ల ద్వారా ఆర్థిక ఇబ్బందుల ఊబిలో చిక్కుకొని ప్రాణాలు తీసుకున్న సంఘటనలు జరుగుతా ఉన్నాయని వారు గుర్తు చేశారు. ఈ ఆన్లైన్ బెట్టింగ్ యాప్ ల ద్వారా సుమారు 7 వేల కోట్ల బిజినెస్ జరగడం తద్వారా కేంద్ర ప్రభుత్వానికి జిఎస్టి ల ద్వారా పన్నుల రూపంగా ఆదాయం వెళ్తుంది కాబట్టి కేంద్ర ప్రభుత్వం వీటి మీద చర్యలు తీసుకోవటం లేదని అన్నారు. ఇప్పటికైనా వెంటనే కేంద్రం ప్రభుత్వం స్పందించి ఇటువంటి ఆన్లైన్ బెట్టింగ్ యాప్లను వెంటనే నిషేధించాలని అదేవిధంగా భవిష్యత్తులో ఇటువంటి పునరావృతం కాకుండా సాంకేతిక పరంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల్లో సెలబ్రిటీలు ప్రమోట్ చేసిన ఈ యాప్ ద్వారా ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న వారిని ఆదుకోవాలని అదేవిధంగా చట్ట వ్యతిరేక చర్యల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఇద్దరి ఆత్మహత్యలకు కారణమైన వారిని విచారణ పేరుతో సమయం వృధా చేస్తే దీనికి బాధ్యులైన వారు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తారని కాబట్టి వెంటనే సంబంధిత అధికారులు సెలబ్రిటీల పైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం పెద్దపల్లి జిల్లా డివైఎఫ్ఐ నూతన అధ్యక్షులుగా గొర్రెంకల సురేష్ ను జిల్లా కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కొంటు సాగర్, జిల్లా సహాయ కార్యదర్శి అట్ల శివకుమార్ నాయకులు సూర్య తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం కార్పొరేషన్ కార్యాలయం అధికార పార్టీ ఆఫీస్‌గా మారిందా?

**- ఇక్కడి అధికారులు కార్యకర్తలుగా మారిన పరిస్థితి**

**- తాజా మాజీ 25వ డివిజన్ కార్పోరేటర్ నగునూరి సుమలత - రాజు ఆరోపణ**






**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో రామగుండం కార్పొరేషన్ కు ఒక ప్రాముఖ్యత ఉంటుందని, కానీ కొందరు అధికారుల నిర్లక్ష్యంతో పరిపాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని 25వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత– రాజు ఆరోపించారు. ప్రజా సమస్యలు చెప్పుకోవడానికి కార్యాలయానికి వస్తే అధికార పార్టీనా ప్రతిపక్ష పార్టీనా అని అధికారులు అడగడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఎందుకంటే వారికి అధికార పార్టీ కార్యకర్త అయితేనే ఫలానా డివిజన్ లోని ఎలాంటి సమస్యలైన పరిష్కారం చేస్తామని చెప్పడం మరీ దారుణంగా ఉందన్నారు. ప్రజలు తమ సమస్యలు అధికారులకు విన్నవించేందుకు కార్యాలయానికి వస్తే అధికార పార్టీకి చెందిన నాయకులు గంటల తరబడి కమిషనర్ చాంబర్, ఇతర అధికారుల చాంబర్ లో సరదా ముచ్చట్లు చెబుతూ వ్యంగ్యాస్త్రాలతో సామాన్య ప్రజలను మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తాజా మాజీ కార్పొరేటర్లు ఇతర నాయకులు వచ్చిన సమయంలో కూడా కార్యాలయంలో ఉన్న అధికారులు కూడా ఇదే విధంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఈ విషయంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్, రామగుండం నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ అయిన జిల్లా కలెక్టర్ హైదరాబాద్ , రామగుండం కార్పొరేషన్ కార్యాలయం పరిపాలన వ్యవస్థ పై ప్రత్యేక నిఘా పెట్టి, ఇక్కడున్న అధికారులను పూర్తి స్థాయిలో ప్రజలకు మేలు జరిగే విధంగా చేయాలన్నారు. అదే కాకుండా ఇక్కడ అధికార పార్టీ నాయకులకు అధికారులను డివిజన్లలో ఇష్టారాజ్యంగా మార్చుతూ వారికి నచ్చిన ఆఫీసర్ ను ఒక విధంగా నచ్చని ఆఫీసర్లను ఒక విధంగా బద్నాం చేయడం జరుగుతుందని దీనిపై జిల్లా కలెక్టర్ చర్య తీసుకుని రామగుండం కార్పొరేషన్ ను గాడిలో పెట్టాలని కోరుతున్నామని అన్నారు. లేదంటే ప్రజా క్షేత్రంలో తిరుగుబాటు కాక తప్పదు అన్నారు.

## నారాయణ పాఠశాలలో ఘనంగా తల్లిదండ్రుల పాదపూజోత్సవం

**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గోదావరిఖని మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో జిఎం గోపాల్ రెడ్డి ఆదేశాలతో డీజీఎం రమణారెడ్డి ఏజీఎం చైతన్య రావు ఆధ్వర్యంలో ఘనంగా తల్లిదండ్రుల పాదపూజోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ ఏ రజిని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కంటిపాపలైన చిన్నారులు సున్నిత హస్తాలతో తమ పాదాలను అడుగుతుంటే ఆ తల్లిదండ్రులు పొంగిపోయారు. మరికొందరు తన్మయత్వానికి లోనై చిన్నారులను గుండెకు హత్తుకున్నారు. ఇంకొందరు ఉబ్బితబ్బిపై ఆనంద భాష్పాలు రాల్చారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో చిన్నారులు వారి తల్లిదండ్రులకు పాదాలు కడిగే కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులను కుర్చీలపై కూర్చుండబెట్టి చిన్నారులు నేలపై కూర్చొని భక్తిశ్రద్ధలతో పాదాలు కడిగారు. అనంతరం కాళ్లపై పూలు జల్లి పూజలు నిర్వహించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పూలమాలలు వేసి వారి కాళ్లకు పసుపు కుంకుమ రాసి అలంకరించారు. తరువాత పాదాలను వస్త్రంతో తుడిచి పాదాభివందనం చేశారు. తమ తల్లిదండ్రులు ఆయురారోగ్యాలతో జీవించాలని సకల సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. దీంతో తల్లిదండ్రులు ఆనందనుబూతులను వ్యక్తం చేశారు. తమ కన్న పిల్లలు ఎప్పుడూ సుఖంగా సంతోషంగా ఉండాలని భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు. నారాయణ పాఠశాలలో చదువుతున్నందుకు తమ పిల్లలు ఎన్నో విషయాలు నేర్చుకున్నారని తల్లిదండ్రులు తెలిపారు. సంస్కారం, సత్ప్రవర్తన, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం మరింత పెరిగిందని పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం కాకుండా వారిని సంస్కారవంతులుగా తీర్చిదిద్దడమే నారాయణ పాఠశాల లక్ష్యమని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఏ. రజినీతోపాటుగా అకాడమిక్ డీన్ ఆంజనేయులు, ఏవో శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సౌభాగ్య, రమాదేవి, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ ఇమ్రాన్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు
- ఎండల తీవ్రత దృష్ట్యా తి సుకోవాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులు నియంత్రణ

**ప్రణాళికపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ దిశగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎండల తీవ్రత దృష్ట్యా చేసుకోవాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులు నియంత్రణ ప్రణాళికపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా ఉష్ణోగ్రతల నమోదు జిల్లాలలో పెద్దపల్లి మూడవ స్థానంలో ఉందని , ప్రజలు వడ గాల్పుల బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎండ తీవ్రత వల్ల శరీరంలో నీటి శాతం తక్కువైతే ప్రజలకు వడ దెబ్బ తగిలే అవకాశం అధికంగా ఉంటుందని, మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండడం ఉత్తమమని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పనుల పని వేళలు మార్చాలని అన్నారు. ఆశా కార్యకర్తల నుంచి జిల్లా అధికారుల వరకు ప్రతి ఒక్కరి వద్ద అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. జిల్లాలో జరిగే వివిధ పంట కొనుగోలు నేపథ్యంలో రైతులకు, హమాలీ కూలీలకు, అక్కడి సిబ్బందికి వడదెబ్బ తగలకుండా ఏర్పాట్లు ఉండాలని, అవసరమైన టెంట్, త్రాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకేట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. నీటి పారుదల శాఖ, పంచాయతీ, వివిధ శాఖల కింద జరిగే పనులు దగ్గర కార్మికులకు వడదెబ్బ తగలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని అన్నారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో చల్లి వేంద్రం ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. వేసవి కాలంలో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. వడ గాల్పుల వల్ల వచ్చే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వేసవి కాలంలో ప్రతి రోజు నీరు త్రాగడం, గొడుగు తీసుకుని బయటికి రావడం, వేడి గాల్పులు వచ్చే సమయంలో ఇంట్లో ఉండటం వంటి వివిధ అంశాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు.రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో తీసుకోవాలని అదనపు సూచించారు.గతంలో అధికంగా ఫీవర్ కేసులు నమోదైన ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నీరు నిల్వ ఉండకుండా గుంతలు పూడ్చి వేత కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఇంటిలో పాత కూలర్లు టైర్ల లో నీటి నిల్వలను తీసి వేయాలని అన్నారు. గ్రామాలలో రెగ్యులర్ ఫాగ్గింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా ధాన్యం కొనుగోలు జరిగేలా పటిష్ట కార్యాచరణ రూపొందించాలి

- కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన - ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేయాలి
- ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన అదనపు కలెక్టర్ డి.వేణు





**పెద్దపల్లి, మార్చి 26 ( ది క్రైమ్ న్యూస్ ):** యాసంగి మార్కెటింగ్ సీజన్ జిల్లాలో సజావుగా ధాన్యం కొనుగోలు జరిగేలా పటిష్ట కార్యాచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో అదనపు కలెక్టర్ డి.వేణు ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభించేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఉండేటట్లుగా చూసుకోవాలన్నారు.నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోళ్ళు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేయాలని, ఎట్టి పరిస్థితులలో కేటాయించని రైస్ మిల్లులకు ధాన్యం సరఫరా చేయరాదని అలా చేసిన యెడల వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటి కప్పుడు ఆన్ లైన్ ఓపిఎంఎస్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఓపిఎంఎస్ ట్యాబ్ లను సీజన్ ప్రారంభం ముందే చెక్ చేసుకొని ఉంచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వచ్చే ధాన్యం అంచనా ప్రకారం అవసరమైన వెయింగ్ యంత్రాలు,తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్, గన్ని సంచులు మొదలైన మౌలిక వసతులు ఉండేలా చూడాలని అన్నారు.వేయింగ్ యంత్రాలను తేమ యంత్రాల పని తీరు చెక్ చేసి సర్టిపై చేయాలని అన్నారు. త్రాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా త్రాగునీటి సరఫరా ప్రత్యేక దృష్టి సారించాలని, చల్లని త్రాగు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకేట్లు పెట్టుకోవాలని అన్నారు. వడదెబ్బ తగిలితే వారికి ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన టెంట్ల ను ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్, జిల్లా మేనేజర్ పౌరసరఫరాలు శ్రీకాంత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గుండె పోటుతో సింగరేణి అధికారి మృతి



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ డివిజన్ ఓసీపీ.3 ప్రాజెక్టు లో సంక్షేమ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మాథ్యూ పాగోలు రాజు (50) బుధవారం గుండె పోటుతో మృతి చెందారు. స్థానిక ఎన్.సి టైపు క్వార్టర్‌లో నివాసముంటున్న మృతుడు రాజు కు బుధవారం తెల్లవారు జామున గుండె నొప్పి రావడంతో, బంధువులు వెంటనే స్థానిక డిస్పెన్సరికి తరలించారు. అప్పటికి కోలుకోనక పోవడంతో గోదావరిఖని లోని ఏరియా ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. ఇక ఆయన మరణవార్త తెలిసిన, ప్రాజెక్టు మేనేజర్ భరత్ కుమార్, వర్క్ షాప్ ఇంజనీర్ జయంత్ బాబు, ఇతర అధికారులు, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్ కుమార్, నాయకులు ఆసుపత్రికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

## ఆదివరాహస్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

**కమాన్ పూర్, ( ది క్రైమ్ న్యూస్), మార్చి 26:** కమాన్ పూర్ మండల కేంద్రంలోని స్వయం భూ క్షేత్రమైన ఆదివరాహస్వామి హుండీ ఆదాయం బుధవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గత ఏడాది అక్టోబర్ మాసంలో హుండీ ఆదాయం లెక్కించగా ఆరు నెలల అనంతరం హుండీ ఆదాయం లెక్కింపు చేశారు. ఈ హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం పెద్దపల్లి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొసన కాంతారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివరాహస్వామి ఆలయ హుండీ ఆదాయం 5,15,694 వచ్చినట్లు వెల్లడించారు. ఈ హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, సేవకులు, భక్తులు పాల్గొన్నారు.



## ఇటుక బట్టీల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

**- పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఇటుక బట్టీల నిర్వహణలో నిబంధనలను తప్పకుండా పాటించాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య అన్నారు.బుధవారం పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య పెద్దపల్లి పట్టణంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో ఇట్టుక బట్టిల యజమానులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటుక బట్టీల యజమానులతో సంబంధిత శాఖ అధికారులు అవగాహన సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వ నిబంధనలు, ఉత్తర్వులు, ఇటుక బట్టీల నిర్వహణలో పాటించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి డివిజన్ లో ఉన్న ఇటుక బట్టీల ఓనర్లు ప్రభుత్వ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, జిల్లా పరిశ్రమల అధికారి, మైనింగ్ శాఖ ఉప సంచాలకులు, లేబర్ అధికారి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంఘాన్ని విమర్శిస్తే ఊరుకునేది లేదు

**- టీబీజీకేఎస్ హెచ్చరిక**

**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** తమ సంఘాన్ని విమర్శించే అర్హత ఐఎన్టియూసి నాయకులకు లేదని బిఆర్ఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, చంద్రయ్య బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. తమ సంఘం గుర్తింపు సంఘంగా కొనసాగిన క్రమంలో అప్పటి తమ ప్రభుత్వంతో మాట్లాడి అనేక ప్రయోజనాలను కార్మికులకు చేకూర్చామని తెలిపారు. యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కవిత సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి జాతీయ కార్మిక సంఘాల వల్ల పెండింగ్లో ఉన్న, ప్రభుత్వాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలని కారుణ్య నియామకాల పేరిట, 17,400 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎక్స్టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 4,800 ఉద్యోగాలు ఇప్పించడం, ప్రమాదవశాత్తు కార్మికుడు చనిపోతే రూ.20 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్ ఇప్పించడం, విధి నిర్వహణలో మరణించిన కార్మికుని కుటుంబానికి రూ. 15 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ ఇప్పించామని తెలిపారు. వడ్డీ లేని ఇంటి రుణం, ఏసీ లకు ఉచిత విద్యుత్ ఇంకా అనేక హక్కులను ఇప్పించిన చరిత్ర కలిగిన టిబిజికెఎస్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదనినాయకులుఆప్రకటనలో హెచ్చరించారు.

## పెండింగ్‌లో ఉన్న పారిశుద్య కార్మికులకు జీతాలు ఇచ్చేలా చూడాలని..

**- పంచాయతీలలో 3 నెలలుగా జీతాలు రావడం లేదని మంత్రి సీతక్క దృష్టికి**



**శామీర్ పేట, మార్చ్ 26 (ది క్రైమ్ న్యూస్):** పెండింగ్‌లో ఉన్న పారిశుద్య కార్మికులకు జీతాలు ఇచ్చేలా చూడాలని..పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను ఐ ఎఫ్ టియు నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ లో 5 నెలలుగా, గ్రామ పంచాయతీలలో 3 నెలలుగా జీతాలు రావడం లేదని మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. దీనికి మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పెండింగ్ లో పారిశుద్య కార్మికుల జీతాలు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారని ఐఎఫ్ టియు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐ ఎఫ్ టి యు నాయకులు శ్రీనివాస్, శివ బాబు, అనురాధ, యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీకాంత్, మండల నాయకులు నాగరాజు, వెంకటేష్, బాలయ్య, సారధ, శామీర్ పేట, కీసర మండలాల పారిశుద్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 28న ఆర్మీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకై ఎంపిక

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ,మార్చి 26 ( ది క్రైమ్ న్యూస్ ):** మార్చి 28న ఆర్మీ రిక్రూట్మెంట్‌లో రాత పరీక్షకు మరియు ఫిజికల్ టెస్టుకు ఉచిత శిక్షణ అందించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులకు ఫిజికల్ మెడికల్ టెస్ట్ నిర్వహించ పడుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత వరకు ఉద్దేశంలో పెట్టుకొని ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని సంకల్పంతో సెంటినరీ కాలనీలోని రాణి రుద్రమదేవి స్టేడియంలో ఆర్మీ అభ్యర్థులకు ఉచిత దేహదారుఢ్య, మెడికల్, వ్రాత పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఉచిత రాత పరీక్షకు సంబంధించిన మరియు శరీర దారుఢ్యముకి సంబంధించిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మార్చి 28న అర్హత కలిగిన అభ్యర్థులకు ఉచితంగా ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధించాలని, దీనికి 17 1/2 నుంచి 21 సంవత్సరాల మధ్య వయసు ఉన్న అభ్యర్థులు అర్హులని,ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు నేరుగా స్టేడియం కి వచ్చి పరీక్షలో పాల్గొనవచ్చును కలెక్టర్ పేర్కొన్నారు.

# ఆదివాసీ హక్కుల పరిరక్షణకు పోరాట వేదిక ఏర్పాటు




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదికను ఏర్పాటు చేశారు.బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో రైతు సంఘం రాష్ట్ర నాయకులు ముడిమడుగుల మల్లన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ ప్రజా సంఘాలు, అస్థిత్వ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని వేదిక కన్వీనర్లుగా ముడిమడుగుల మల్లన్న, మర్రివెంకటస్వామి, తాళ్లపల్లి లక్ష్మణ్, వెంకటమల్లయ్య, రాజమల్లయ్య, రామిళ్ల బాపు, జిన్నాం ప్రసాద్, లెనిన్, బాలసాని రాజయ్య, దండు అంజన్న, బాపన్న, సతీష్, కొయ్యడ సృజన్, గుమ్మడి కొమురయ్య, శ్రీపతిరాజగోపాల్, టి.రత్నకుమార్, కె.విశ్వనాథ్ లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణ రావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అటవీ సంపదను కట్టబెట్టే ప్రయత్నం చేస్తోంద ని, దీనివల్ల ఆదివాసీలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయని వారు ఆరోపించారు. ఏప్రిల్ 20న కరీంనగర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు జూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న, పొన్నం రాజమల్లన్న, బొడ్డుపల్లి రవి, పులిపాక రవీందర్, వెల్తురు సదానందం, నారా వినోద్, రెడ్డిరాజుల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరాహార దీక్ష సంఘీభావం తెలిపిన తాజా మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్

**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** చంపాపేటలో ఇజ్రాయెల్ అనే న్యాయవాది ని నడిరోడ్డు పై దారుణం గా హత్య చేసిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని ,అడ్వకేట్ రక్షణ చట్టం తీసుకరావాలని ,41 ఏ .సీఆర్పీసీ ని 30(3) ని అమెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష ప్రారంభం అయ్యాయి. బుధవారం ఖని కోర్ట్ ఎదుట ఏర్పాటు చేసిన రిలే దీక్ష శిబిరాన్ని తాజా మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కన్నూరి సతీష్ కుమార్ మాట్లాడుతూ " రోజు రోజుకు న్యాయవాదులపై దాడులు పెరిగి పోతున్నాయని, న్యాయం కోసం పాటు పాటుపడే న్యాయవాదులకు రక్షణ లేకపోవడం అత్యంత విచారకరమని, గతంలో అడ్వకేట్ దంపతుల హత్య, నిన్నటికి నిన్న రంగారెడ్డి జిల్లా సీనియర్ న్యాయవాదిని నడిరోడ్డు పై హత్య చేయడం పాశవిక చర్య అని, వెంటనే బాధ్యుల పై చట్టరీత్యా చర్య తీసుకొవాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఈ అసెంబ్లీ సమావేశం లో బిల్లు ప్రవేశ పెట్టాలని ప్రభుత్వంను డిమాండ్ చేస్తున్నామని, రక్షణ చట్టం బిల్లు ప్రవేశపెట్టేవరకు న్యాయవాదుల పోరాటాలకు పూర్తిగా మద్దతుగా వుంటామని" తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్‌తో పాటు నాయకులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు నడిపల్లి కిషన్ రావు, చందాల శైలజ, అసంపల్లి రవీందర్, దేశెట్టి అంజయ్య ,శ్రీనివాసరావు,పెర్క మనోహర్, జూపాక వెంకట్, మచ్చకుర్తి కుమార్, రాగం శ్రీధర్ ,పెట్టం వెంకటేశ్వర్లు, కిరణ్ జీ, పులిపాక రాజకుమార్, పూదరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



# అసంపూర్తిగా అంబేద్కర్ భవన్

**• దళిత పాలకులు, ఉద్యోగుల నిర్లక్ష్యం • ఎమ్మెల్యే చెప్పిన పనులు ప్రారంభించని సంఘం నాయకులు**





**లక్షెట్టిపేట, మార్చి26, (ది క్రైమ్ న్యూస్):** పట్టణంలోని స్థానిక గర్ల్ హై స్కూల్ సమీపంలో నిర్మిస్తున్న అంబేద్కర్ విజ్ఞాన మందిరం ఆరేళ్లుగా అసంపూర్తి నిర్మాణంతో నిర్లక్ష్యానికి గురవుతుంది. అంబేద్కర్ అందరివాడు అంటూనే ఆయన చూపిన మార్గంలో నడిచే నాయకులు లేకపోవడంతో పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరం అసంపూర్తి నిర్మాణంతో అనాధగా మిగిలిపోతోంది. మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి కానీ ఏ మహానుభావుల మీదనో, దేవుళ్ళ మీదనో ఆధారపడద్దు అనే అంబేద్కర్ మాటలను ఈ సంఘం పెడచెవిన పెడుతోంది. సుమారు ఆరేళ్ళ క్రితం మొదలు పెట్టిన అంబేద్కర్ విజ్ఞాన మందిర నిర్మాణం నేటికీ అసంపూర్తిగా మిగిలిపోయి సంఘం నిర్లక్ష్యపు వైఖరికి సాక్ష్యంగా నిలుస్తోంది. ముఖ్యంగా దళిత పాలకులు, ఉద్యోగులు, మేధావి వర్గపు నిర్లక్ష్యపు నీడలో కాలం వెళ్ళదీస్తోంది. పేరుకే అంబేద్కర్ యువజన సంఘం అయినప్పటికీ సమీకరించు, బోధించు, పోరాడు అనే అంబేద్కర్ సూక్తులు ఆచరణలో లేకపోవడంతో ఎవరికీ వారే యమున తీరే అన్నట్లుగా సంఘం పని చేస్తోంది. ఏవైనా మహనీయుల జయంతి, వర్ధంతి మినహాయించి మరే ఇతర అంబేద్కర్ భావజాలం భావి తరాలకు అందించే సమర్థ నాయకత్వం లేకపోవడంతో మహనీయుల ఆశయాలు నెరవేరడం లేదు. **అందరూ అంబేద్కరిస్ట్ లే కానీ ఆచరణ శూన్యం!** నా పేరు మీద సంఘాలు పెట్టిన వారు, నా భావజాలాన్ని నెమరువేసే వారుగాని నా నిజమైన వారసులు కారని కేవలం నా ఆశయాలను ఆచరణలో పెట్టిన వారు మాత్రమే నా నిజమైన వారసులని భారత రత్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఆనాడే నొక్కి చెప్పారు. వారసత్వాన్ని కొనసాగించే క్రమంలో అందరూ అంబేద్కరిస్ట్ లే అంటూ ప్రచారం చేసుకోవడం మినహాయించి నిజమైన అంబేద్కరిస్ట్ లు కనుచూపుమేరలో కనిపించడం లేదనిపిస్తోంది. అంబేద్కర్ యువజన సంఘం పదవులపై ఉన్నటువంటి వ్యామోహం జాతి ఉన్నతి, ఆశయ సాధనకు లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. జై భీం, జై అంబేద్కర్, భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అనే నినాదాలకు మాత్రమే దళిత నాయకులు, మేధావులు అంకితమవుతున్నారనే విమర్శలున్నాయి. అసలు రాజ్యాంగం గొప్పతనాన్ని గాని అంబేద్కర్ భావజాలాన్ని గాని ప్రచారం చేయడంలో ఇసుమంతైన నాయకులకు చిత్త శుద్ధి లేకపోవడం వారి అజ్ఞానానికి పరాకాష్టగా మిగులుతోంది. యువతకు అంబేద్కర్ భావజాలంపై శిక్షణ తరగతులు గాని భారత రాజ్యాంగం విశిష్టత గురించి గాని అవగాహన కల్పించకపోవడమనేది సీనియర్ నాయకుల అస్థిత్వాన్ని సవాల్ చేస్తోంది. **నలుగురు మాజీ కౌన్సిలర్ల సహకారమేది?** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పని చేయాల్సిన దళిత నాయకులు, ప్రజా ప్రతినిధులు నోరు లేని నాయకులుగా (మూక్ నాయక్) చెలామణి అవుతున్నారనే విమర్శలున్నాయి. నాయకుల్లో స్వార్థం పెరిగిపోయి స్వలాభం పై ఉన్నటువంటి ఆసక్తి అంబేద్కర్ విజ్ఞాన మందిర నిర్మాణంపై లేదని స్పష్టంగా తెలుస్తోంది. రిజర్వేషన్స్ పుణ్యమా అని మొదటి మున్సిపల్ పాలక వర్గంలో దళిత, గిరిజన జాతుల నుంచి ఎన్నికైన నలుగురు కౌన్సిలర్లు చాతరాజు రాజన్న, ఓరగంటి శ్రీకాంత్, గోడిసేల లక్ష్మి, సురేష్ నాయక్ లు తమ పదవీకాలం ఐదేళ్లు పూర్తి అయినప్పటికీ అంబేద్కర్ భవన్ నిర్మాణానికి చేసిందేమి లేదు. ఏదైనా కార్యక్రమానికి హాజరై పూలు వేసి నివాళులు అర్పించడం, మైక్ ల ముందు మాట్లాడటం, చిత్రపటాలకు దండం పెట్టుకోవడం మినహాయించి చేసిందేమి లేదనే విమర్శలున్నాయి. పదవిలో ఉన్నప్పుడు అన్ని విధాలుగా సహకరిస్తామని హామీలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు నేటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదిలా ఉండగా మండలంలో దళిత, గిరిజన ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 50 నుంచి 100 మంది వరకు ఉన్నప్పటికీ అనుకున్న స్థాయిలో భవన్ నిర్మాణానికి సహకారం అందటం లేదనేది సమాచారం. గతంలో ప్రభుత్వ ఉద్యోగులు తమ తమ వంతుగా అందించిన ఆర్థిక సహకారంతోనే నేటి భవనం కార్యాచరణలోకి వచ్చినప్పటికీ ప్రస్తుతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందనేది కళ్ళ ముందు కనిపిస్తున్న సత్యం. ప్రారంభంలో కొందరు నాయకులు, ఉద్యోగులు, మేధావులు ఆర్థికంగా సహకరించినప్పటికీ నేడు పట్టించుకోకపోవడం సంఘం బలహీనతకు దారితీస్తోంది. **పే బ్యాక్ టూ సొసైటీని మరచిన వైనం!** గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో దళిత బంధు ద్వారా మండలంలోని రంగపేట గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులైన లబ్ధిదారులందరికీ కలిపి రూ. కోట్లలో ప్రయోజనం చేకూరింది కానీ వీరిలో ఏ ఒక్క అంబేద్కరిస్ట్ కూడా సంఘం భవన నిర్మాణానికి కనీసం రూ. 5 వేలు కూడా ఆర్థిక సహకారం అందిచకపోవడం జాతి అనైతికతకు అద్దం పడుతోంది. జాతి నిర్మాణానికి పరస్పర సహకార లేమి కొట్టచ్చినట్టు కనిపిస్తోంది. వ్యక్తులుగా దళిత నాయకులు ఎదగాలని తహ తహ లాడటం మినహాయించి సంఘం ప్రయోజనాలను పట్టించుకునే పాపాన పోవడం లేదనే ఆరోపణలున్నాయి. కేవలం రంగపేట గ్రామ లబ్ధిదారులే కాకుండా మండలంలోని అన్ని ప్రాంతాలకు చెందిన రిజర్వేషన్ ల రూపంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లబ్ధి పొందిన అంబేద్కరిస్ట్ లు ముందుకు వస్తే భవన్ నిర్మాణం ఇతరులను యాచించకుండా, ఆత్మగౌరవంతో పూర్తి చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. **పదవుల కోసం ఆరాటం...రూల్స్ లేని సంఘం!** మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవుల కోసం ప్రతి నూతన కార్యవర్గం ఎన్నిక సమయంలో నాయకులు తహతహలాడటం పరిపాటి. పేరుకే అంబేద్కర్ సంఘం అయినప్పటికీ ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే వారి సహకారంతో పదవులు దక్కించుకోవాలని ప్రయత్నాలు చేయడం దళిత నాయకులకు ఆనవాయితీగా వస్తోంది. బూర్జువ పార్టీలలో బానిసలుగా మారిన నాయకులు అంబేద్కర్ ఆశయాలను వల్లెవేయడం మినహా ఆచరణకు దూరంగా ఉంటున్నారు. కమిటీ ఎన్నికకు సభ్యత్వ నమోదు,విద్యార్హత, సామాజిక అవగాహన, అనుభవం, పైరవీలకు లొంగని నైజం కలిగిన నాయకత్వాన్ని ఎన్నుకునే పరిస్థితి ఎందుకు కనిపించడంలేదో సంఘం నాయకులే ఆత్మ విమర్శ చేసుకోవాలి. జిల్లా, మండల నాయకుల మధ్య సమన్వయ లోపం ముఖ్యంగా జిల్లా కమిటీకి ఎప్పటి నుంచో అసలు ఎన్నికలే జరుగకపోవడం పాత నాయకులే ఇంకా పదవుల పేరుతో ఎన్నో ఏండ్లుగా కొనసాగటం సంఘం పట్ల యువతకు విరక్తిని కలిగిస్తోంది. అంబేద్కర్ సంఘంలో నియమ నిబంధనలు లేకపోవడం పలు రకాల పంచాయితీలకు కొందరు నాయకులే మధ్యవర్తిత్వం వహించటం సంఘానికి చెడ్డ పేరును తీసుకువస్తోంది. **అసంపూర్తి భవన్ పై పట్టింపేది?** అసంపూర్తి భవన్ నిర్మాణంపై అంబేద్కరిస్ట్ లకు పట్టింపు లేదనే విమర్శలున్నాయి. కేవలం తమ డాంబికాన్ని ప్రదర్శించడం కోసమే నాయకులు పోటీ పడుతున్నట్లు కొందరు పేరు బయటకు చెప్పని ఆ సంఘం సభ్యులే ఆరోపిస్తున్నారు. జనవరిలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పనులు చేసుకోమన్నారని సమాచారం. కానీ సంఘంలో చైత్యనం లేకపోవడంతో భవన్ అసంపూర్తిగా మిగిలిపోతుంది. అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి మెతక వైఖరితో సంఘం అభాసుపాలు అవుతోందనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంఘం తన ఐక్యతను ప్రదర్శిస్తూ అంబేద్కర్ ఆశయ సాధనకు ముందుకు సాగాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రభుత్వ పథకాలకు ఆర్యవైశ్యులను అర్హులుగా గుర్తించడం పట్ల హర్షం

**• చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన సముద్రాల రమేష్ గుప్తా...**



**ఎండపల్లి, మార్చి 26(ది క్రైమ్ న్యూస్):** రాజీవ్ యువ వికాస పథకానికి పేద ఆర్యవైశ్యులను అర్హులుగా ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఆర్యవైశ్య పేద కుటుంబాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సముద్రాల రమేష్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో నిరుపేద ఆర్యవైశ్యులంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే గడ్డం వివేక్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. అనంతరం సముద్రాల రమేష్ గుప్తా మాట్లాడుతూ... ఆర్యవైశ్య సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడిన పేద ఆర్యవైశ్య యువకులు ఎంతోమంది ఉన్నారని, వారికి రాజీవ్ యువ వికాస పథకంలో అర్హత కల్పించాలని పేద ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులకు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశామని, అంతేకాకుండా ఆర్యవైశ్య రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ కాల్వ సుజాత ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి, పేద ఆర్యవైశ్య యువకులకు అర్హత కల్పించాలని కోరారు. మా విన్నపం మేరకు పేద ఆర్యవైశ్య యువకులకు రాజీవ్ యువ వికాస పథకంలో అర్హత కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్రంలోని పేద ఆర్యవైశ్య కుటుంబాలన్నీ రుణపడి ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రాయించు సదాశివ్, గంప సంతోష్,చౌడారపు సాగర్, చిట్టిమల్ల రమేష్, సంతోష్,మల్యాల శ్రీనివాస్, రవి కిరణ్, ముత్యం శ్రీను, శివకుమార్, వర్షిత, చంద్రశేఖర్, ద్రాక్ష పల్లి వెంకటేశం, రావి కంటి లక్ష్మణ్, ఇరుకుల్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి బ్యాంక్ సేవలు అభినందనీయం..

**• మృతుని కుటుంబానికి లక్ష రూపాయల ప్రమాద బీమా చెక్కు అందచేత • మార్కెట్ చైర్మన్ పుల్లూరి - స్వప్న సదానందం**



**జమ్మికుంట మార్చి 26 (ది క్రైమ్ న్యూస్):** ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు, జమ్మికుంట శాఖ యొక్క ఖాతాదారు అయిన బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన ముడుతనపెల్లి రాజు యొక్క కుటుంబ సభ్యులకు 1 లక్ష రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ముడుతనపెల్లి రాజు ఒక ప్రమాదంలో మరణించారు. మృతుడికి ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు యందు గల గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాదబీమా సౌకర్యం ద్వారా అతని తల్లి అయిన ముడుతనపెల్లి సుశీల కు 1లక్ష రూపాయల చెక్కును జమ్మికుంట అగ్రికల్చర్ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, బ్రాంచి మేనేజర్ ఒద్దుల మహేంధర్ సీనియర్ ఆఫీసర్ పొల్లు ప్రవీణ్ కుమార్ ల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పుల్లూరి స్వప్న- సదానందం మాట్లాడుతూ ఖాతాదారులకు కనీస డిపాజిట్ తోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్యతరగతి వినియోగదారులకు ప్రమాద భీమా కల్పిస్తూ వారికి అండగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. గాయత్రి బ్యాంకు వినియోగదారుల ఆర్థిక ప్రగతికి సహకారం అందిస్తుందని అభినందించారు. 24 గంటలు ఏటీఎం లలో నగదు అందుబాటులో ఉంచడం ద్వారా జమ్మికుంట మరియు పరిసర ప్రాంత ప్రజల నగదు అవసరాలను తీరుస్తుందని అన్నారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ ఒద్దుల మహేంధర్ గారు మాట్లాడుతూ వినియోగదారులకు మైక్రో ఎటిఎం, ఏ ఈ పి ఎస్ సేవల ద్వారా వినియోగదారులకు చెల్లింపులు చేయడం జరుగుతుంది. తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై గ్రాముకు అత్యధికంగా రూ? 5,500/- తో ఋణాలను అందిస్తున్నారని, అలాగే రైతులకు వ్యవసాయ రుణాలను కూడా అందిస్తున్నారని తెలియజేశారు. జమ్మికుంట పరిసర గ్రామాలలో 16 బ్యాంకింగ్ కరెస్పాండెంట్లను నియమించారని, తద్వారా పెన్షనర్లు మరియు ఇతర ఖాతాదారులు ఇట్టి బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల వద్ద బ్యాంకు లావాదేవీలను నిర్వహించుకోవచ్చని తెలియజేశారు. సేవింగ్ ఖాతాలు ప్రారంభించుటకు కావలసిన ఫోటో, జిరాక్స్ ను బ్యాంకు యందే ఉచితంగా అందిస్తున్నామని, వ్యాపారస్తులకు వ్యాపార వృద్ధికై ఋణాలను అందిస్తున్నామని వినియోగదారులు ఇట్టి సౌకర్యాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు.

# ఉచిత కంటి వైద్య శిభిరం



**కమాన్ పూర్, ( ది క్రైమ్ న్యూస్), మార్చి 26:** కమాన్ పూర్ మండల కేంద్రంలోని ఆపఫిల్ కిడ్స్ పాఠశాలలో బుధవారం గోదావరిఖని పట్టణంలో గల ఉమా శంకర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కంటి వైద్య శిభిరంలో దాదాపుగా 100 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. తమ పాఠశాల ఆవరణలో ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినందుకు వైద్య బృందానికి పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

# బీఎస్పీ పార్టీ జమ్మికుంట మండల అధ్యక్షునిగా మహేందర్ ఎన్నిక



**జమ్మికుంట మార్చి 26 (ది క్రైమ్ న్యూస్):** బహుజన్ సమాజ్ పార్టీ జమ్మికుంట మండల అధ్యక్షులు గా తనుగుల గ్రామానికి చెందిన దాసరపు మహేందర్ ఎన్నికయ్యారు. బీఎస్పీ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు మంద సమ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మహేందర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జోనల్ కోఆర్డినేటర్ మారేపల్లి మొగిలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె ప్రశాంత్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈదునూరి రమేష్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు పెరుక శ్రీనివాస్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి మంతెన సంపత్, కార్యదర్శి రేణిగుంట్ల రంజిత్, కోశాధికారి రాచపల్లి రమేష్, నాయకులు గిన్నారపు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గడప కృష్ణమూర్తికి పరామర్శ



**కమాన్ పూర్ (ది క్రైమ్ న్యూస్):** కమాన్పూర్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడప కృష్ణమూర్తి గారి అక్క గడప రాజేశ్వరి ఇటీవల మరణించిన విషయం తెల్సిన సుందరం ఫౌండేషన్ ప్రెసిడెంట్ బోనాల మల్లయ్య తమ ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఈరోజు గడప క్రిష్ణ మూర్తి గారి ఇంటికి వెళ్లి వారిని ఆత్మీయంగా పలకరించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కన్నూరి నగేష్, చిప్పకుర్తి అరవింద్ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మచ్చగిరి రాముకు బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పదవి నియామకం

**- కమాన్పూర్ బిజెపి మండల అధ్యక్షుడు సన్మాన కార్యక్రమం**



**కమాన్ పూర్ (ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మండల కేంద్రంలో బిజెపి మండల శాఖ అధ్యక్షులు కొయ్యడ సతీష్ గారి ఆధ్వర్యంలో పెద్దపల్లి భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన మచ్చ గిరి రాము గారిని శాలువాతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన మచ్చ గిరి రాము గారిని అభినందించి, స్వీట్ తినిపియడం జరిగింది వారి సేవలను కొనియాడం జరిగింది. గతంలో మచ్చ గిరి రాము గారు కమాన్ పూర్ ఉమ్మడి మండల ప్రధాన కార్యదర్శిగా, కమాన్ పూర్ ఉమ్మడి మండల అధ్యక్షులుగా, మంథని నియోజకవర్గ సభ్యత్వ ఇన్చార్జిగా, మొన్నటి ఎమ్మెల్సీ ఎలక్షన్ మంథని నియోజకవర్గం ఇన్చార్జిగా పనిచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మచ్చగిరి రాము మాట్లాడుతూ... పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా నా నియామకానికి సహకరించిన పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి గారికి, మాజీ జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్ రెడ్డి గారికి, మంథని నియోజకవర్గ మరియు కమాన్ పూర్ బిజెపి మండల సీనియర్ నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

# అన్నారంలో అర్ధరాత్రి దొంగలు.....!



**మానకొండూర్(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం అన్నారంలో గుర్తు తెలియని వ్యక్తులు పలు ఇండ్లలో దొంగతనానికి పాల్పడిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన గొట్టెముక్కల విజయ అనే మహిళ ఇంట్లో చొరబడి నిద్రిస్తున్న విజయ మెడలో నుండి బంగారపు పుస్తెలతాడు, తాళం వేసి ఉన్న మధునాల వెంకటమ్మ అనే మరో మహిళ ఇంటి తాళం పాలగొట్టి 55 తులాల వెండి 20 వేల నగదు, తాళం వేసి ఉన్న రుద్రోజు వెంకటాచారి అనే వ్యక్తి ఇంటి తాళం పలగొట్టి ముప్పావు తులం బంగారం 18 తులాల వెండి పట్టీలు, పాకాల రాజిరెడ్డి అనే వ్యక్తి ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనాన్ని దొంగలు దొంగిలించారు. బుదవారం ఉదయం స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహయంతో చోరీలు జరిగిన ఇండ్లను పరిశీలించి భాదితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

# దుండిగల్‌లో టౌన్ ప్లానింగ్ నిబంధనలకు తూట్లు..

- విచ్చల విడిగా వసూళ్ళకు పాల్పడుతూ విధులను గాలికొదిలేసిన అధికారులు
- అంతా తామై అందిన కాడికి దండుకుంటూ అక్రమాలను సక్రమం చేసున్న సిబ్బంది
- పిర్యాదులను అందించి నెలలు గడుస్తున్నా చోద్యం చూస్తున్న కమిషనర్
- ప్రజల సమస్యలనోదిలేసి మున్సిపాలిటీని కరప్షన్‌లో ముందుంచారని స్థానికులు

**కుత్బుల్లాపూర్, (ది క్రైమ్ న్యూస్):** దుండిగల్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ లో నిబంధనలకు తూట్లు పొడుస్తూ చైన్ మెన్ లు రాజ్యమేలుతున్నారు.అక్రమ నిర్మాణదారులతో, కొందరు బిల్డర్లతో బేరాలాడుతూ అందిన కాడికి దండుకొని జేబులు నింపుకుంటూ అక్రమ నిర్మాణలను సక్రమం చేస్తున్నారని పలు విమర్శలున్నాయి.విషయానికొస్తే దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్ శ్రీ సాయి భాలాజీ ఎన్ క్లేవ్ రోడ్ నెం : 6 లో నూతనంగా నిర్మిస్తున్న ఎస్ ప్లస్ 5 ఫంట్ హౌస్ నిర్మాణం, శ్రీ సాయి భాలాజీ ఎన్ క్లేవ్ రోడ్ నెం : 7 లో ఎస్ ప్లస్ 5 ఫంట్ హౌస్ నిర్మాణం, శ్రీ సాయి భాలాజీ ఎన్ క్లేవ్ రోడ్ నెం 8 లో ఎస్ ప్లస్ 5 ఫంట్ హౌస్ నిర్మాణం ఇలా చెప్పుకుంటూ పోతే సదరు బిల్డర్ ప్రభుత్వాన్ని మోసం చేసి ప్రభుత్వ ఆడయానికి గండి కొట్టి సరైన అనుమతులు పొందకుండా తప్పుడు మార్గంలో మల్లంపేట్ లో కట్టిన బిల్డింగ్ ల సంఖ్యలు లెక్కలేనన్ని.ఎస్ ప్లస్" 2 " నిర్మాణ అనుమతులు పొంది,మల్లంపేట్ చైన్ మెన్ గా విధులు నిర్వవర్తిస్తున్న సతీష్ కుమార్ తో ఒప్పందాలు కుదుర్చుకొని,ఆయన ద్వారా టౌన్ ప్లానింగ్ అధికారులను, కమిషనర్ లను సైతం మేనేజ్ చేసి ప్రభుత్వ రాబడిని దర్జాగా దోచేస్తున్నారని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు.సంబంధిత టౌన్ ప్లానింగ్ సిబ్బంది సతీష్ కుమార్ కి పదుల సంఖ్యలో ఇదే విషయమై పిర్యాదు చేయగా పట్టించుకోలేదు, టౌన్ ప్లానింగ్ అధికారులకు,సరాసరి ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ కి పిర్యాదు అందించిన అక్రమార్కులకు కనీసం ఒక నోటిస్ కూడా వెళ్లలేదంటే అర్థం చేసుకోవచ్చు సదరు బిల్డర్ సిబ్బంది సతీష్ కుమార్ ను,టౌన్ ప్లానింగ్ అధికారులను,కమిషనర్ ను ఎంతలా డబ్బులు ఎర వేసి పనులు కానిస్తున్నాడో అని ప్రజలు మండిపడుతున్నారు.

**అంతా తానై పావులు కదుపుతున్న చైన్ మేన్ సతీష్ కుమార్.....** అక్రమ నిర్మాణాలను అరికట్టి టౌన్ ప్లానింగ్,



అధికారులకు కమిషనర్ కు తెలియజేసి అనుమతులు లేని నిర్మాణాలకు సుంకాలు విధించి ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచేలా ప్రభుత్వానికి పనిచేయాల్సిన సిబ్బంది దొరికిందే సందుగా భావించి అక్రమ నిర్మాణ దారులతో, బిల్డర్లతో లోలోపల వారికో రేటు,అధికారులకో రేటు కుదుర్చుకొని లక్షలు,కోట్ల రూపాయలకు పరుగులెడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై ఎవరైనా వచ్చి ఎన్ని పిర్యాదులు అందించినా, కమిషనర్ కి పిర్యాదు అందినా కమిషనర్ ను సైతం




మైమరిపించే పన్నాగాలు పన్నుతూ పిర్యాదులను తాత్సారం చేస్తున్నారని, మల్లంపేట్ లో సదరు బిల్డర్ కు సంబందించిన బిల్డింగ్ లపై కమిషనర్ కు పిర్యాదు చేసి 2 నెలలు గడుస్తున్నా కిమ్మనుకుండా ఉండటం అశ్చర్యానికి గురిచేస్తుంది. ఇకనైనా మల్లంపేట్ లోని శ్రీ సాయి బాలాజీ ఎంక్లేవ్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని, లేదంటే అట్టి నిర్మాణాలపై కలెక్టరేట్లో ఫిర్యాదు చేస్తామని ప్రజలు అంటున్నారు...

# మెరుగైన వైద్య సేవలు లేవు మెడిసిన్ లేవు

- ఈఎస్ఐ (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్) ఆసుపత్రిలో మందులు లేవు
- రామగుండం ఈఎస్ఐ డిస్పెన్సరీలో అసలు ఏం జరుగుతోంది?

- అత్యవసరాలకు హైదరాబాదే గతి
- ఈ పాపం ఎవరిది? నాలుగు నెలలుగా నరకయాతన
- సమయానికి రారు ఓపీలు చూడరు
- బిపి షుగర్ మాత్రలతోనే సరిపెడుతున్నారు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రధానంగా కార్మికుల వైద్యం కోసం సేవలు అందిస్తున్న ఈ ఎస్ ఐ (ఎంప్లాయిమెంట్ స్టేట్ ఇన్సూరెన్స్) ఆసుపత్రి లో వైద్య సేవలు అందక, మందులు లేక ప్రైవేటు ఆసుపత్రిలో డబ్బులు చెల్లించలేక కార్మికులు అష్ట కష్టాలు పడుతున్నారు. పెద్దపల్లి జిల్లాలోని పారిశ్రామిక ప్రాంత రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రిలో అసలు ఏం జరుగుతుందో అంతు పట్టడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా పారిశ్రామిక ప్రాంత కార్మికులకు వైద్య సేవలు అందిస్తున్న ఈఎస్ఐ డిస్పెన్సరీలో నిత్యం వందలాదిమంది ఈఎస్ఐ లబ్ధిదారులు వైద్య సేవల నిమిత్తం క్యూ లైన్ లో వేచి ఉండి వైద్యులతో పరీక్షలు చేయించుకొని అనంతరం డిస్పెన్సరీలో ఉచితంగా మందులు తీసుకొని వెళ్లేవారు కానీ గత నాలుగు నెలలుగా ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే వారికి సరైన వైద్య సదుపాయం లేకపోగా మందులు సైతం ప్రైవేటు మెడికల్ షాపులలో డబ్బులు వెచ్చించి కొనుక్కునే పరిస్థితి ఏర్పడిందని, ఈ పాపం ఎవరిదని, ప్రభుత్వ పాలకులు ఏం చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో వేలకు వేలు జీతాలు తీసుకుంటున్న వైద్యులు సమయపాలన పాటించడం లేదని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓపి చూడాల్సిన వైద్యులు సమయపాలన పాటించకుండా మధ్యాహ్నం రెండు గంటల వరకే వెళ్లిపోతున్నారని దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి నిరాశే ఎదురవుతున్నదని ఈఎస్ఐ కార్మికులు ఆరోపిస్తున్నారు. నేటి విపత్కర పరిస్థితిలో చిన్న జ్వరానికే ప్రైవేటు ఆసుపత్రులలో లక్షలాది రూపాయలు దండుకుంటున్న క్రమంలో కార్మికులు ప్రతి నెల క్రమం తప్పకుండా ఈఎస్ఐ స్కీం ల డబ్బులు చెల్లిస్తూ అనారోగ్య పరిస్థితులలో ఆసుపత్రికి వెళితే మెరుగైన వైద్య సేవలు అందక, మందులు లేక ప్రైవేటు ఆసుపత్రులలో అప్పులు చేసి మరి వైద్యం చేయించుకోవలసి వస్తున్నదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కనీసం మందులు అయినా ఉచితంగా ఇచ్చేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక మందులు కూడా ఇవ్వడం లేదని, ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా ప్రజల ఆరోగ్యాలను పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు





ఆరోపిస్తున్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ లో మందులు లేవనే తతంగంపై మా ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి ఆసుపత్రి సిబ్బందిని వివరణ కోరగా ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ మూడు గంటల వరకే ఓపి చూస్తారని ఇందులో కొత్తేమీ లేదని, మెడిసిన్ ఆన్లైన్ పర్చేస్ విధానం మూలంగా గత నాలుగు నెలలుగా మందులు కొరత ఉన్న విషయం స్థానిక ఎమ్మెల్యే కు, ప్రజా ప్రతినిధులకు ,అధికారులకు, స్థానిక మీడియా మిత్రులకు అందరికీ తెలుసని జ్వరం, బిపి, షుగర్ మాత్రలు తప్ప మిగతా మందులు లేవని సిబ్బంది బాహాటంగా చెప్పడం కోసమెరుపు ఇది ప్రభుత్వ పాలనక అలసత్వానికి నిదర్శనంగా మారింది.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**ముత్తారం.మార్చి.26.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని దర్యాపూర్ ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు.విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అలాగే పాఠశాల వసతి గృహాన్ని,భోజనశాల,వంటగదిని పరిశీలించారు.పిల్లలకు అందుతున్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు.పట్టిక ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సూచించారు.అనంతరం ముత్తారం మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూ సేకరణ పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఆన్లైన్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, లక్కారం గ్రామంలో సేకరించిన భూములలో ఉన్న నిర్మాణాలకు సంబంధించిన నగదు నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బోరు బావులు, చెట్లు,ఇతర నిర్మాణాలకు పరిహార నిధులు ప్రతిపాదనలను సంబంధిత అధికారులు వెంటనే జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ కు పంపి త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. డివిజన్ పరిధిలో భూ శుద్దీకరణ సమయంలో జరిగిన తప్పుల సరి చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ముత్తారం ఎంపీడీవో సురేష్, తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి,ఎంపీఓ గోవర్ధన్, పిఆర్ఏఈ జగదీశ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖని వన్‌టౌన్ సిఐని సస్పెండ్ చేయాలి

**- రామగుండం సిపికి ఎఐఎస్ఎఫ్ నేతల ఫిర్యాదు**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** గోదావరిఖని వన్‌టౌన్ సిఐని సస్పెండ్ చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్‌కు బుధవారం ఎఐఎస్ఎఫ్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం మాట్లాడుతూ బాధితుల పక్షాన సమస్య ఉందని సిఐ దృష్టికి తీసుకెళ్తే సమస్యను పరిష్కరించకుండా అసభ్యకరమైన పదజాలంతో తిడుతూ బెదిరింపులకు పాల్పడుతూ హెచ్చరిస్తున్నారని, ఇటీవల మహిళా కార్పొరేటర్స్‌పై, యువ న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన ఘటన మరువకముందే మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృత్తం చేస్తూ బాధితుల సమస్యలను పరిష్కరిం చకుండా బెదిరింపులే తన లక్ష్యంగా పెట్టుకొని విధులు నిర్వహిస్తారని అన్నారు. దీనిపై విచారణ జరిపి సిఐని సస్పెండ్ చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నగర కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ధనాల ఉదయ్, సాయి చరణ్, శివ, దీపక్, కుమార్ తదితరులున్నారు.

# నిజాలను నిర్భయంగా బరాబర్ రాస్తాం..

**- దాడులు చేస్తే నిజాలు దాగుతాయ**



**ధర్మారం, మార్చి,26 (ది క్రైమ్ న్యూస్):** రిపోర్టర్ పై దాడులు చేస్తే నిజాలు దాగుతాయ జరిగిన వాస్తవాలను నిర్భయంగా రాస్తే రిపోర్టర్ కుటుంబం పై దాడులు చేస్తారా.. బరాబర్ రాస్తాం ప్రశ్నించే గొంతులను నొక్కలని చూస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో గల ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం నిజమే అయినప్పుడు రిపోర్టర్ ల పై దాడులు ఎందుకు.. భూ ఆక్రమణ చేశాడని అధికారులు చర్యలు చేపట్టారు. ఆక్రమణ దారులను హెచ్చరించిన వినకుండా టేకు వనం ధ్వంసం చేసి అక్రమంగా భూ కబ్జా చేసినందుకు చట్టపరంగా అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దొంగలు దొంగలు ఒక్కటై ఊరి మీద పడి దోచుకున్నట్టు ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారి పై అధికారులు చట్టపరంగా చర్యలు చేపట్టారు. నిజాలను నిర్భయంగా రాస్తే రిపోర్టర్ కుటుంబం పై దాడులు చేస్తున్నారు మీరు ఇంకెన్ని దాడులు చేసిన ప్రజలకోసం నిజాలను నిర్భయంగా బరాబార్ రాస్తూనే ఉంటాము..

# నవోదయ ఫలితాల్లో మచ్చుపేట విద్యార్థి ప్రతిభ



**ముత్తారం.మార్చి.26.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామానికి చెందిన ఈర్ల భాగ్యలక్ష్మి - సతీష్‌ల పెద్ద కుమారుడు విక్రమాదిత్య రామగిరి మండలం కల్వచర్లలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాల ఆధ్వర్యంలో నడుపబడుతున్న సాయి ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. మంగళవారం వెలువడిన జాతీయ జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచి అర్హత సాదించిన విక్రమాదిత్యను బుధవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్ల శ్రీనివాస్, రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలింపు... ఇద్దురు వ్యక్తుల రిమాండ్






**ఇల్లంతకుంట(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్, వెంకట్రావుపల్లి గ్రామాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.....మండలంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక ట్రాక్టర్లు నడుస్తున్నాయని మండల తహశీల్దార్ ఇచ్చిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి గస్తీ నిర్వహించగా కందికట్కూరు లోని సబ్ స్టేషన్ ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన దొమ్మటి అజయ్ (22) అనే వ్యక్తి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా విజయ్ ని అరెస్ట్ చేసి ఇసుకతో సహా ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించారు. అలాగే వెంకట్రావుపల్లి కెనాల్ వద్ద సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మాటేండ్లకు చెందిన మల్కి నగేష్ (28) అనే వ్యక్తి టిప్పర్ లారీ ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా నగేష్ ను అరెస్ట్ చేసి ఇసుకతో సహ టిప్పర్ను పోలీస్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసుకుని రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

# ఆన్లైన్ బెట్టింగ్లపై సిట్ ఏర్పాటు

## • ఎమ్మెల్యే కవ్వంపల్లి హర్షం



**తిమ్మాపూర్ ( ది క్రైమ్ న్యూస్):** ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపేందుకు సిట్ ఏర్పాటు చేయడం శుభ పరిణామమని పేర్కొంటూ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనను జారీ చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఆన్లైయిన్ బెట్టింగ్ వల్ల ఎంతోమంది యువకులు బలవన్మరణాలకు పాల్పడుతున్న సంఘటనలు రోజురోజుకు వెలుగు చూస్తుంగా ఆన్లైయిన్ బెట్టింగ్ లు, గేమింగ్, రమ్మీలపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ను ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రకటించడం సంతోషకరమని కవ్వంపల్లి పేర్కొన్నారు. ఆన్లైన్ బెట్టింగ్ లు సరదాగా మొదలై వ్యసనంగా మారి ప్రాణాలను బలిగొంటున్నాయని,ఈ ఉచ్చులో పడి అప్పులు చేస్తూ వాటిని తీర్చలేక యువకులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

యువత, విద్యార్థులు పనులు మానేసి గంటల తరబడి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ ఒక్కోసారి సహనం కోల్పోయి గొడవలకు దిగుతున్న సంఘటనలు కూడా లేకపోలేదని, వీటి నిరోధానికి పోలీసు నిఘా పెంచి బెట్టింగ్ నేరస్తులపైననే కాకుండా ఆన్లయిన్ బెట్టింగ్ యాప్ ను ప్రమోట్ చేసే వారిపైన కూడా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రకటనలో తెలిపారు..

# బంగారు నగలను చోరీ చేసిన మహిళా దొంగ అరెస్ట్

- 100 గ్రాముల బంగారు ఆభరణాలు, 28వేల నగదు స్వాధీనం
- 24 గంటల్లోనే నిందితురాలి అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ కరుణాకర్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లిలోని పైడబజార్‌లో ఒక బంగారు దుకాణంలో జరిగిన భారీ దొంగతనం కేసును పెద్దపల్లి పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. నిందితురాలిని అరెస్టు చేసి, దొంగిలించబడిన బంగారు ఆభరణాలు మరియు నగదును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ పి.కరుణాకర్ వివరాలను వెల్లడించారు. మార్చి 24న రాత్రి పైడబజార్‌లోని దేవరకొండ కరుణాకర్ అనే వ్యక్తికి చెందిన బంగారు దుకాణంలోకి గుర్తుతెలియని దుండగులు చొరబడి రూ.2.5 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదును దొంగిలించారని.దుకాణ యజమాని కరుణాకర్ ఫిర్యాదు మేరకు పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ యాదవ్ నేతృత్వంలో సీసీ టీవీ ఫుటేజీలు,సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితురాలు లోకిని తిరుమల (38) అని గుర్తించామని, ఆమెను అరెస్టు చేసి 100 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.28 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వెల్లడించారు. నిందితురాలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకుందని డీసీపీ తెలిపారు. పెద్దపల్లిలో నేరాలను అరికట్టేందుకు పోలీసులు ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల సహాయంతో నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేయగలిగామని డీసీపీ తెలిపారు. ఈ కేసును



24 గంటల్లో ఛేదించిన పెద్దపల్లి సీఐ కె.ప్రవీణ్ కుమార్, ఎస్సైలు జె.లక్ష్మణ్ రావు, బుద్దె మల్లేశం, ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుళ్లు కె.ప్రభాకర్, ఎం.అనిల్ కుమార్, రాజు, రమేష్‌లను పెద్దపల్లి డీసీపీ పి.కరుణాకర్ అభినందించారు.

# మారని పంచాయతీ కార్యదర్శి తీరు

## • అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడుతుందంటున్న గ్రామ ప్రజలు

**ముత్తారం.మార్చి.26.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం హరిపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల అలసత్వం వహించడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు, నర్సరీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గ్రామంలో పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శి అనుగుణంగానే ప్రధాన రహదారికి ఇరువైపులా మాత్రమే శుభ్రం చేస్తున్నారని మిగతా వార్డులకు సంబంధించిన రోడ్లు శుభ్రం చేయడం లేదని ఎవరి ఇంటి వద్ద వారే శుభ్రం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు జోరుగానే ప్రచారం జరుగుతుంది. గ్రామానికి సంబంధించిన ఓ వ్యక్తి పట్టా భూమిలో చెత్తాచెదారం వేసి ఆరు నెలలు గడిచిన కూడా తీయకపోవడంతో సంబంధిత కార్యదర్శికి పిర్యాదు చేయగా ఇదిగో తీస్తాం అదిగో తీస్తామంటూ సమాదానం చెప్పినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఇదే కార్యదర్శి గ్రామంలో గడ్డి మందు, ట్రాక్టర్ డీజిల్, దోమల నివారణకు మందు కొనుగోలు విషయంలో కూడా డబ్బులు లేవు అంటూ సమాధానాలు చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి.గ్రామంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారికి పూర్తి సమాచారం ఇవ్వకుండా, కార్యదర్శి, గ్రామ సిబ్బంది కలసి ఏకాభిప్రాయం తీసుకుంటున్నారని జోరుగానే ప్రచారం జరుగుతుంది. గ్రామ కార్యదర్శి గ్రామ పనులకు సహకరించకుంటే



గ్రామాభివృద్ధి కుంటు పడుతుందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# పూసాలలో ఘనంగా బొడ్రాయి, భూలక్ష్మి, మహాలక్ష్మి, పోచమ్మ తల్లి బోనాలు

- దేవాలయానికి పోటెత్తిన భక్తులు
- అమ్మవారికి ఓడి బియ్యం, బోనాలు సమర్పించిన మహిళలు





**సుల్తానాబాద్, మార్చి 26( ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి పూసాలలోని బొడ్రాయి ,మహాలక్ష్మి, భూలక్ష్మి, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం గత సంవత్సరం నిర్వహించగా, అందులో భాగంగానే బుధవారం పోచమ్మ తల్లికి తిరుగు బోనాల తో ప్రతి ఇంటి ఇంటికి బోనం చేసి శివసత్తుల పూనకాలతో డప్పు చప్పుల్లతో పురవీధులు తిరుగుతూ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం, ఓడి బియ్యం, సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో బైండ్ల పూజారులచే బొడ్రాయి విగ్రహాలకు అలంకరణ చేసి పట్నం వేసి గావు పట్టి బలి కార్యక్రమ%శీ% వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో, ఊరిలోకి ఎటువంటి దుష్టశక్తులు, క్షుద్ర శక్తులు, అకాల మరణాలు, సంభవించకుండా ఉండాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలు వందలాది మంది ప్రజలు కులహాల మధ్య బొడ్రాయి పోచమ్మ తల్లి బోనాలలో పండుగ వాతావరణం నెలకొందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బొడ్రాయి కమిటీ సభ్యులు పెద్దలు అన్ని కుల సంఘాల ప్రజా ప్రతినిధులు పుర ప్రముఖులు, కుల సంఘాల ప్రెసిడెంట్ వైస్ ప్రెసిడెంట్ లు యువతి యువకులు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మామిడి అనిల్ కుమార్



**తిమ్మాపూర్(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం గొల్లపల్లిలో నూనంగా నిర్మించే సిసి రోడ్డు పనులను కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మామిడి అనిల్ కుమార్ బుధవారం టెంకాయ కొట్టి ప్రారంభించారు. పోచమ్మ ఆలయం నుండి గ్రామంలోకి వెళ్లేందకు సిసి రోడ్ల నిర్మాణానికి 20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామంలో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు మల్లెత్తుల తిరుపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేల్పుల మధు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమ్మెర సుధాకర్ రెడ్డి, వెన్నం సుధాకర్ రెడ్డి,వెన్నం చంద్రశేఖర్ రెడ్డి, కొమ్మెర మల్లారెడ్డి, నీలం ఆది రెడ్డి,సాయిల్ల రజనీకాంత్,కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, పోలం చందు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ.... తప్పిన ప్రమాదం




**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లిలోని కాకతీయ కెనాల్ వద్ద కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.....వరంగల్ నుండి నిజామాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఫ్లైయాష్ లోడ్ తో ఖమ్మం వెళుతున్న లారీ ఎదురెదుగా ఢీకొన్నాయి.బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది.దీంతో రెండు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి ట్రాఫిక్ ను నియంత్రించారు.

## ఎల్లమ్మ తల్లి బోనాల కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర యువ నాయకులు ఏగోలపు సదయ్య గౌడ్





**సుల్తానాబాద్, మార్చి 26( ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి నియోజకవర్గం,పెద్దపల్లి మండలం సబితం ఎలిగెడు మండలం ముప్పిరితోట గ్రామాల్లో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకాఎల్లమ్మ తల్లి బోనాల కార్యక్రమంలో పాల్గొని ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని అమ్మవార్లకు ప్రత్యేక పూజ నిర్వహించి, అమ్మ వారి ఆశీస్సులు తీసుకున్న బీజేపీ రాష్ట్ర యువ నాయకులు ఏగోలపు సదయ్య గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి దీవెనలతో నియోజకవర్గంలోని ప్రజలు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో, పాడి పంటలతో సువిశాలంగా ఉండాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో సబితం, ముప్పిరితోట గ్రామాల గౌడ సంఘం అధ్యక్షులు పురేళ్ల శ్రీనివాస్ గౌడ్, సుద్దాల సతీష్ గౌడ్, చీకటి సంతోష్ గౌడ్, పొడేటి చంద్రయ్య గౌడ్, మెట్టు రాజయ్య గౌడ్,నారగొని కుమార్ గౌడ్, పురేళ్ల సాయి కుమార్ గౌడ్, కోదాటి రమణ రావు, గౌడ కులస్తులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు పాల్గొన్నారు.

## కొబ్బరి నీళ్లు ఏ టైమ్‌లో తాగాలి..?

సమ్మర్ సీజన్‌లో ఇష్టమైన పండ్లు తింటే ఆ మజాయే వేరు. మామిడి పండ్లు, ముంజలను తినడానికి చాలామంది ఇష్టం చూపుతారు. అయితే వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం కూడా. అందుకే బాడీని కూల్ చేసే వాటిని తీసుకోవాలి. అందులో మొదటిది కొబ్బరినీళ్లు. ఒక కొబ్బరి బోండం నీళ్లు తాగితే రోజంతా హుషారుగా ఉండవచ్చు. అదే సమయంలో బాడీని కూల్ చేస్తుంది కూడా. కొబ్బరి నీళ్లలో కాల్షియం, మాంగనీస్ లాంటివి ఉంటాయి. సమ్మర్‌లో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల అనేక రకాల బెనిఫిట్స్ ఉన్నాయి. అయితే చాలామంది సమయ పాలన లేకుండా కొబ్బరి నీళ్లు తాగుతుంటాయి. అయితే సమయంలో తాగడం అనేది కూడా తెలుసుకోవాలి. కొబ్బరినీళ్లు ఏ సమయంలో తాగాలి అనే ప్రశ్న చాలమంది ఉంది. కొంతమంది ఖాళీ కడుపుతో తీసుకుంటే.. మరికొందరు మధ్యాహ్నం తాగడం మంచిదని భావిస్తుంటారు. ఈ విషయమై జైపూర్‌కు చెందిన డైటీషియన్ మాట్లాడుతూ భోజనంతో లేదా తర్వాత అసలు తాగకూడు. గుండెల్లో మంట సమస్య ఉన్నవారు ఖాళీ కడుపుతో కొబ్బరి నీటిని తాగాలి. అయితే, ఖాళీ కడుపుతో ఈ హెల్తీ డ్రింక్ తాగడం వల్ల అనేక ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. ఉదయాన్నే తాగడం వల్ల జీవక్రియ పెరుగుతుంది. అంతేకాదు బరువును తగ్గిస్తుంది కూడా. కడుపు ఆరోగ్యంగా ఉంటే శరీరం అనేక వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యల నుండి రక్షించబడుతుంది. అయితే సమస్యలతో భాధపడేవారు నిపుణుల సలహా మేరకు మధ్యాహ్నం కూడా తాగవచ్చు. సమ్మర్ సీజన్ కాబట్టి కొబ్బరి నీరు తీసుకోవడం ముఖ్యం. కానీ కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇది అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది కాబట్టి మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం పెరుగుతుంది. అలాంటివారు డాక్టర్ల సలహా తీసుకోవాల్సి ఉంటుంది.

# విశ్వజి



# గుండె జబ్బులు ఉన్నవారికి నడక నిజంగా మంచిదేనా?

## వైద్యులు ఏం చెబుతున్నారంటే?

గుండె.. మన శరీరానికి ఇంజిన్‌లాంటిది. అది నిరంతరం పనిచేస్తూ ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. కానీ నేటి జీవనశైలిలో గుండె జబ్బులు సర్వసాధారణ మైపోయాయి. ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి వంటి కారణాల వల్ల గుండె ఆరోగ్యం క్షీణిస్తోంది. అయితే గుండె జబ్బులు ఉన్నవారు వ్యాయామం చేయాలంటే భయపడాల్సిన అవసరం లేదు. సరైన వ్యాయామం గుండెకు మేలు చేస్తుంది. వాటిలో నడక చాలా ఉత్తమమైనది. గుండె రోగులకు నడక నిజంగా మంచిదేనా? గుండె జబ్బులు ఉన్నవారికి నడక ఒక అద్భుతమైన వ్యాయామం. ఇది సులభంగా చేయగలిగేది, ఖర్చు లేనిది, అంతేకాకుండా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతో సహాయపడుతుంది. నడక గుండె కండరాలను బలోపేతం చేస్తుంది, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, రక్తపోటును తగ్గిస్తుంది, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తుంది. ఇంకా చెప్పాలంటే, నడక ఒక మాయాజాలంలా పనిచేస్తుంది. నడకతో గుండెకు కలిగే ప్రయోజనాలు: నడవడం వల్ల గుండె కండరాలు మరింత బలంగా తయారవుతాయి. బలమైన గుండె మరింత సమర్థవంతంగా రక్తాన్ని పంప్ చేయగలదు, దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలకు సరిపడా రక్తం అందుతుంది. నడక రక్తనాళాలను విస్తరింపజేస్తుంది, తద్వారా రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది. మంచి రక్త ప్రసరణ గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అధిక రక్తపోటు గుండె జబ్బులకు ప్రధాన కారణం. నడక రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. రెగ్యులర్‌గా నడిస్తే రక్తపోటు అదుపులో ఉంటుంది. నడక శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుంది. ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ స్థాయిలు గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అధిక బరువు గుండెపై అదనపు భారం వేస్తుంది. నడక కేలరీలను బర్న్ చేయడానికి సహాయపడుతుంది, తద్వారా బరువును నియంత్రించవచ్చు. ఆరోగ్యకరమైన బరువు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఒత్తిడి గుండె జబ్బులకు మరొక కారణం. నడక ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. వ్యాయామం చేయడం వల్ల ఎండార్ఫిన్‌లు విడుదల అవుతాయి, ఇవి సహజ సిద్ధమైన నొప్పి నివారణలు మరియు మూడ్ బూస్టర్‌లుగా పనిచేస్తాయి. మధుమేహం ఉన్నవారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువ. నడక రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గుండె రోగులు నడకను ఎలా ప్రారంభించాలి? గుండె జబ్బులు ఉన్నవారు నడక ప్రారంభించే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నడక ప్రారంభించే ముందు మీ వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. వారు మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి, మీకు ఎంత నడక సురక్షితమో సూచిస్తారు. మొదటి రోజునే ఎక్కువ దూరం నడవకండి. నెమ్మదిగా ప్రారంభించి, క్రమంగా నడక సమయాన్ని, దూరాన్ని పెంచండి. తర్వాత కొంచెం వేగం పెంచండి. మీ శరీరం అలసిపోకుండా చూసుకోండి. వారంలో చాలా రోజులు, కనీసం 30 నిమిషాలు నడవడానికి ప్రయత్నించండి.

# ఎనర్జీ డ్రింక్స్‌తో కిడ్నీలు దెబ్బతింటాయా?



## పరిశోధనలు ఏం చెబుతున్నాయి?

నేటి ఉరుకులపరుగుల జీవితంతో తక్షణ శక్తి కోసం చాలా మంది ఎనర్జీ డ్రింక్స్ తాగుతున్నారు. ఇవి అలసటను తరిమికొట్టి, వెంటనే ఉత్తేజాన్ని ఇస్తాయి. ముఖ్యంగా యువతరం వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. జిమ్‌కి వెళ్లేవారు, ఆటలు ఆడేవారు, ఎక్కువసేపు మేల్కొని పనిచేసేవారు వీటిని విరివిగా సేవిస్తున్నారు. అయితే, ఈ పానీయాలు మీ మూత్రపిండాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో మీకు తెలుసా? ఇటీవల జరిపిన కొన్ని పరిశోధనలో ఈ ఎనర్జీ డ్రింక్స్ మూత్రపిండాలను దెబ్బతీస్తున్నాయన్న విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మూత్రపిండాల ప్రాముఖ్యత మన శరీరంలో మూత్రపిండాలు చాలా ముఖ్యమైన పనులు చేస్తాయి. రక్తాన్ని శుభ్రపరచడం, వ్యర్థ పదార్థాలను తొలగించడం, శరీరంలో నీటి సమతుల్యతను కాపాడటం, రక్తపోటును నియంత్రించడం వంటి కీలకమైన విధులు నిర్వర్తిస్తాయి. ఇవి సరిగ్గా పనిచేయకపోతే, మన ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. ఎనర్జీ డ్రింక్స్‌లో ఏముంటాయి? ఎనర్జీ డ్రింక్స్‌లో ప్రధానంగా కెఫిన్, చక్కెర, కృత్రిమ స్వీటెనర్లు, విటమిన్లు, మూలికా సారం వంటి పదార్థాలు ఉంటాయి. ఇవి తక్షణ శక్తిని ఇవ్వడానికి, అలసటను తగ్గించడానికి సహాయపడతాయి. కానీ, వీటిలో కొన్ని పదార్థాలు మూత్రపిండాలకు హాని కలిగించే అవకాశం ఉంది. ఎనర్జీ డ్రింక్స్ మూత్రపిండాలను ఎలా దెబ్బతీస్తాయి? డీహైడ్రేషన్ (నిర్జలీకరణం): ఎనర్జీ డ్రింక్స్‌లో కెఫిన్ ఎక్కువగా ఉంటుంది. కెఫిన్ ఒక డైయూరేటిక్ . ఇది మూత్రవిసర్జనను పెంచే పదార్థం. ఇది శరీరం నుండి ఎక్కువ నీటిని బయటకు పంపడానికి కారణమవుతుంది. తగినంత నీరు తాగకుండా ఎనర్జీ డ్రింక్స్ ఎక్కువగా తాగితే, డీహైడ్రేషన్ వస్తుంది. డీహైడ్రేషన్ మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచుతుంది, వాటి పనితీరును దెబ్బతీస్తుంది. రక్తపోటు పెరుగుదల: ఎనర్జీ డ్రింక్స్‌లోని కెఫిన్ రక్తపోటును పెంచుతుంది. అధిక రక్తపోటు మూత్రపిండాల రక్తనాళాలను దెబ్బతీస్తుంది. ఇది దీర్ఘకాలంలో మూత్రపిండాల వ్యాధికి దారితీస్తుంది. %ూశీఞవతీవస దీఎ% చక్కెర స్థాయిలు: చాలా ఎనర్జీ డ్రింక్స్‌లో చక్కెర అధికంగా ఉంటుంది. అధిక చక్కెర స్థాయిలు మధుమేహానికి కారణమవుతాయి. మధుమేహం మూత్రపిండాలను దెబ్బతీసే ప్రధాన కారణాలలో ఒకటి. మూత్రపిండాల్లో రాళ్లు: కొన్ని ఎనర్జీ డ్రింక్స్‌లో ఫాస్పారిక్ యాసిడ్ ఉంటుంది. ఇది మూత్రంలో కాల్షియం స్థాయిలను పెంచుతుంది, దీనివల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. అంతే కాకుండా ఈ ఎనర్జీ డ్రింక్స్‌లో ఉండే కొన్ని మూలికా సారం, కృత్రిమ స్వీటెనర్లు కూడా మూత్రపిండాలపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. వీటిపై ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. పరిశోధన ఏం చెబుతోంది? కొన్ని అధ్యయనాలు ఎనర్జీ డ్రింక్స్ ఎక్కువగా తాగేవారిలో మూత్రపిండాల సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువని సూచిస్తున్నాయి. అధికంగా ఎనర్జీ డ్రింక్స్ తాగడం వల్ల అక్యూట్ కిడ్నీ ఇంజురీ వచ్చే కేసులు కూడా నమోదయ్యాయి. ఇది మూత్రపిండాలు ఒక్కసారిగా పనిచేయడం ఆపేసే పరిస్థితి కూడా ఉంది. అయితే, అన్ని అధ్యయనాలు ఎనర్జీ డ్రింక్స్ నేరుగా మూత్రపిండాలను దెబ్బతీస్తాయని చెప్పడం లేదు. ఇంకా ఎక్కువ పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది. ఎవరికి ఎక్కువ ప్రమాదం? ఇప్పటికే మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు ఎనర్జీ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. డీహైడ్రేషన్ సమస్య ఉన్నవారు, రక్తపోటు సమస్యలు ఉన్నవారు కూడా జాగ్రత్తగా ఉండాలి. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పిల్లలు ఎనర్జీ డ్రింక్స్ తాగకపోవడం మంచిది. మరి ఏం చేయాలి? ఎనర్జీ డ్రింక్స్ తాగడం పూర్తిగా మానేయడం ఉత్తమం. ఒకవేళ తాగాలనుకుంటే, చాలా తక్కువ మోతాదులో, అప్పుడప్పుడు మాత్రమే తాగాలి. ఎనర్జీ డ్రింక్స్‌కు బదులుగా ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోండి. నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, గ్రీన్ టీ వంటివి తాగవచ్చు. వ్యాయామం చేసే ముందు, తర్వాత నీరు ఎక్కువగా తాగండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి, తగినంత నిద్రపోండి. %ూశ్రీంశీ =ఝఐ% మెషిన్ కాఫీ తాగితే ఆరోగ్యానికి ముప్పు ఉందా.. పరిశోధకులు ఏం చెబుతున్నాయి? ఎనర్జీ డ్రింక్స్ తక్షణ శక్తిని ఇస్తాయి కానీ, వాటిలో ఉండే పదార్థాలు మూత్రపిండాలకు హాని కలిగించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎక్కువగా తాగితే, లేదా ఇప్పటికే మూత్రపిండాల సమస్యలు ఉంటే ప్రమాదం ఎక్కువ. కాబట్టి, ఎనర్జీ డ్రింక్స్ విషయంలో జాగ్రత్తగా ఉండటం, వాటికి బదులుగా ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవడం మంచిది.

# అందానికి అందం.. ఆరోగ్యానికి ఆరోగ్యం..

## వంటగదిలోనే దివ్యౌషధం!

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో కాలుష్యం, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి వంటి అనేక కారణాల వల్ల మన చర్మం తన సహజమైన మెరుపును కోల్పోవడం సాధారణమైపోయింది. ముఖ్యంగా ఎండా కాలంలో సూర్యకిరణాల తాపం, దుమ్ము, ధూళి చర్మాన్ని నిర్జీవంగా మార్చేస్తాయి. మొటిమలు, మచ్చలు వంటి సమస్యలు మరింత కలవరపెడతాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఖరీదైన బ్యూటీ ఉత్పత్తులను వాడటం కంటే, మన ఇంటి చికెన్‌లో లభించే అల్లం ఒక అద్భుతమైన సహజ పరిష్కారంగా ఉపయోగపడుతుంది. అల్లంలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా దాని సహజమైన కాంతిని తిరిగి తీసుకురావడంలో సహాయపడతాయి. మరి, అల్లంను ఉపయోగించి మీ చర్మాన్ని ఎలా మృదువుగా, సహజంగా మెరిసేలా చేసుకోవచ్చో చూద్దాం. సహజమైన మెరుపు కోసం దివ్య ఔషధం ప్రతిరోజూ మనం ఎదుర్కొనే దుమ్ము, ధూళి, సూర్యుని హానికరమైన అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. ఫలితంగా చర్మం తన సహజమైన కాంతిని కోల్పోతుంది. అల్లంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఈ దెబ్బతిన్న కణాలను పునరుద్ధరించడానికి సహాయపడతాయి. అంతేకాకుండా ఇది చర్మంలో రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. మంచి రక్త ప్రసరణ చర్మానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. తద్వారా చర్మం లోపలి నుండి ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా కనిపిస్తుంది. మొటిమలు, మచ్చలకు చెక్ ! జిడ్డుగల చర్మం ఉన్నవారు తరచుగా మొటిమల సమస్యతో బాధపడుతుంటారు. అల్లం ఈ సమస్యకు ఒక అద్భుతమైన పరిష్కారం. ఇందులోనే యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు స్కిన్‌పై ఉండే హానికరమైన బ్యాక్టీరియాను మాయం చేస్తాయి. ఇది మొటిమల ఏర్పడటాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా అల్లం చర్మంపై ఉండే మచ్చలను క్రమంగా తగ్గిస్తుంది, చర్మపు రంగును సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. వృద్ధాప్య ఛాయలు మాయం! వయసు పెరిగే కొద్దీ చర్మం తన స్థితిస్థాపకతను కోల్పోవడం సహజం. దీనివల్ల ముడతలు, సన్నని గీతలు వంటి వృద్ధాప్య ఛాయలు ముఖంపై కనిపిస్తాయి. అల్లంలో ఉండే సహజ సమ్మేళనాలు కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడానికి సహాయపడతాయి. కొల్లాజెన్ చర్మాన్ని దృఢంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి అల్లంను క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల చర్మం బిగుతుగా ఉంచుతుంది, ముడతలు తక్కువగా కనిపిస్తాయి. సన్ ట్యాన్ నుండి రక్షణ వేసవి కాలంలో సూర్యుని తీవ్రమైన కిరణాలు చర్మానికి హాని కలిగిస్తాయి. దీంతో చర్మం కమిలిపోవడం (సన్ ట్యాన్), మంట వంటి సమస్యలు వస్తాయి. అల్లంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి . సన్‌బర్న్ సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా ఇది చర్మంలో తేమను నిలుపుకోవడానికి సహాయపడుతుంది, తద్వారా చర్మం మృదువుగా ఉంటుంది. %ూశ్రీంశీ =ఝఐ% గుండె జబ్బులు ఉన్నవారికి నడక నిజంగా మంచిదేనా? వైద్యులు ఏం చెబుతున్నారంటే? అల్లంను ఎలా ఉపయోగించాలి? ఒక టీస్పూన్ అల్లం రసంలో అర టీస్పూన్ తేనె కలిపి ముఖానికి పట్టించి 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఇది చర్మానికి తక్షణ కాంతినిస్తుంది. అంతే కాకుండా అల్లం రసం , కలబంద గుజ్జును బాగా కలిపి ముఖానికి రాయాలి. ఇది చర్మాన్ని లోతుగా తేమ చేస్తుంది. మచ్చలను తగ్గించడంలో సహాయపడుతుంది. మరో వైపు ప్రతిరోజూ ఒక కప్పు అల్లం టీ తాగడం వల్ల శరీరం నుండి విష పదార్థాలు తొలగిపోతాయి, ఇది చర్మాన్ని లోపలి నుండి శుభ్రంగా ,



ఆరోగ్యంగా ఉంచుతుంది. కొద్దిగా అల్లం పొడిని తేనె , చక్కెరతో కలిపి చర్మానికి సున్నితంగా రుద్దడం వల్ల చర్మంపై పేరుకుపోయిన మృతకణాలు తొలగిపోతాయి . చర్మం తాజాగా కనిపిస్తుంది.

# మార్కెట్

## వరుస లాభాలకు బ్రేక్..

### భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇటీవల వరుసగా ఏడు సెషన్లలో లాభాల్లో కొనసాగిన మార్కెట్లు గురువారం భారీగా పతనమయ్యాయి. యూఎస్ టారిఫ్ విధానాల్లో స్పష్టత లేకపోవడం.. చమురు ధరల పెరుగుదల.. ఇటీవల మార్కెట్‌లో ర్యాలీ కొనసాగుతుండడంతో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఒక్కసారిగా కుదేలయ్యాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇటీవల వరుసగా ఏడు సెషన్లలో లాభాల్లో కొనసాగిన మార్కెట్లు గురువారం భారీగా పతనమయ్యాయి. యూఎస్ టారిఫ్ విధానాల్లో స్పష్టత లేకపోవడం.. చమురు ధరల పెరుగుదల.. ఇటీవల మార్కెట్‌లో ర్యాలీ కొనసాగుతుండడంతో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఒక్కసారిగా కుదేలయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం ఫ్లాట్‌గా మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి సెన్సెక్స్ 78,167.87 గరిష్ఠానికి చేరుకుంది. ప్రారంభంలోనే 150.68 పాయింట్లు లాభపడింది. ఆ తర్వాత సెన్సెక్స్ అమ్మకాలతో ఒత్తిడికి గురైంది. దాంతో ఒక దశలో 822.97 పాయింట్లు పతనమైంది. ఇంట్రాడేలో 78,167.87 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. 77,194.22 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 728.69 పాయింట్లు తగ్గి.. 77,288.50 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 181.80 పాయింట్లు పతనమై.. 23,486.85కి చేరింది. నిఫ్టీలో ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్, హీరో మోటోకార్ప్, భారతీ ఎయిర్‌టెల్, గ్రాసిమ్, ఎంఅండ్‌ఎం, టైటాన్ కంపెనీ, బ్రిటానియా లాభపడ్డాయి. ఎన్టీపీసీ, టెక్ మహీంద్రా, సిప్లా, బజాజ్ ఫైనాన్స్, బీపీసీఎల్, యాక్సిస్ బ్యాంక్, అపోలో హాస్పిటల్, ఇన్ఫోసిస్, విప్రో నష్టపోయాయి. యూఎస్ వాణిజ్య విధానంపై అనిశ్చిత మధ్య పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల కొన్ని దేశాలకు టారిఫ్ నుంచి మినహాయింపులు ఉంటాయని ప్రకటించారు. అయితే, ఈ విషయంలో స్పష్టత కొరవడింది. ఈ అస్పష్టత కారణంగా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను అస్థిరపరిచింది. గతవారంలో దలాల్ స్ట్రీట్‌లో ర్యాలీ కొనసాగింది.

# పసిడి ధర మళ్లీ పెరిగింది..! హైదరాబాద్‌లో తులం ఎంతంటే..?



బంగారం ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. రికార్డు స్థాయికి ధరలు చేరగా.. ఇటీవల వరుసగా నాలుగు రోజులు తగ్గుతూ వచ్చి ఊరటనిచ్చాయి. తాజాగా బుధవారం మార్కెట్‌లో ధర మళ్లీ పెరిగింది. రూ.235 పెరిగి తులం ధర రూ.రూ.90,685కి చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం ప్యూరిటీ బంగారం 10 గ్రాములకు రూ.235 పెరిగి రూ.90,235కి చేరింది. ఇటీవలి నష్టాల తర్వాత రిటైలర్లు తాజాగా కొనుగోలు చేయడంతో పసిడి ధరలు పెరిగినట్లుగా వ్యాపారులు పేర్కొంటున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో బలమైన ట్రెండ్ కారణంగా సెంటిమెంట్‌ను ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. ఇక వెండి ధర రూ.1,500 పెరిగి కిలోకు రూ.1,01,500కి చేరింది. మరో వైపు ప్రపంచ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ 0.16 శాతం పెరిగి ఔన్సుకు 3,024.96 డాలర్లకు చేరింది. పెట్టుబడిదారుల డిమాండ్, సురక్షితమైన పెట్టుబడి గోల్డ్‌కి డిమాండ్, ఈటీఎఫ్‌ల నుంచి బలమైన ఇన్‌ఫ్లో కారణంగా బుధవారం బంగారం స్వల్పంగా పెరిగింది. ఇక ఏప్రిల్ 2న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై కొత్త వాణిజ్య విధానాన్ని ప్రకటించనున్నారు. యూఎస్ సుంకాల నిర్ణయంపై అనిశ్చితి కారణంగా బంగారానికి మద్దతు లభిస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ (కమోడిటీస్) విశ్లేషకులు సౌమిల్ గాంధీ తెలిపారు. %ాఖూ% సెక్యూరిటీస్, కమోడిటీ అండ్ కరెన్సీ, రీసెర్చ్ అనలిస్ట్–వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది మాట్లాడుతూ ఈ వారం చివరలో విడుదలకానున్న యూఎస్ జీడీపీ, కోర్ పర్సనల్ కన్స్యూమ్ ఎక్స్‌పెన్షన్ (%ూజజు%) ప్రైస్ ఇండెక్స్‌తో సహా కీలకమైన స్థూల ఆర్థిక డేటా కోసం మార్కెట్‌కు చెందిన వారంతా ఎదురు చూస్తున్నారన్నారు. రష్యా–ఉక్రెయిన్ పరిణామాలు సైతం విస్తృత ధోరణిని ప్రభావితం చేస్తాయని.. డిమాండ్‌ను పెంచుతుందని త్రివేది పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల గోల్డ్ రూ.81,950 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి ధర రూ.89,400గా ఉన్నది. ఇక కిలో వెండి ధర రూ.1,11,000గా చేరింది.


## శామ్ సంగ్‌కు షాక్ ఇచ్చిన కేంద్రం.. ఏకంగా రూ.5,154 కోట్ల జరిమానా..!

దక్షిణ కొరియాకు ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ శామ్ సంగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. కంపెనీతో పాటు అధికారులకు 601 మిలియన్ డాలర్ల పన్నులతో పాటు జరిమానా విధించింది. ఇది భారతీయ కరెన్సీలో సుమారు రూ.5,154 కోట్లు. టెలికాం పరికరాలకు సంబంధించిన దిగుమతి సుంకాన్ని తప్పించుకునేందుకు అవకతవకలకు పాల్పడిందన్న కారణంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతేడాది భారత్‌లో కంపెనీ సుమారు రూ.8,183 కోట్ల నికర లాభాన్ని ఆర్జించగా.. భారీ పన్ను, జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నది. అయితే, శామ్ సంగ్ టాక్స్ ట్రిబ్యునల్ లేదంటే కోర్టులో సవాల్ చేసే అవకాశం ఉన్నది. శామ్ సంగ్ కంపెనీ నెట్‌వర్క్ విభాగం 'రిమోట్ రేడియో హెడ్' అనే డివైజ్‌తో పాటు పలు టెలికాం పరికరాలను దిగుమతి చేస్తున్నది. ఈ డివైజ్ 4జీ కమ్యూనికేషన్ వ్యవస్థలో మొబైల్ టవర్‌కు కీలకం. ఈ పరికరాలకు 10 నుంచి 20శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ, దిగుమతి సుంకాలను తప్పించుకునేందుకు శామ్ సంగ్ ఆయా పరికరాలను తప్పుగా వర్గీకరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. 2018 నుంచి 2021 మధ్య దక్షిణ కొరియా, వియత్నాం నుంచి 784 మిలియన్ డాలర్ల (రూ.6,717కోట్లు) విలువైన పరికరాలు దిగుమతి చేసుకున్నా.. ఎలాటి పన్ను చెల్లించలేదని సంబంధిత వర్గాలు చెప్పాయి. కస్టమ్ సుంకాలను తప్పించుకునేందుకు శామ్ సంగ్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు పత్రాలను సమర్పించిందని ప్రభుత్వ విచారణలో తేలింది. సదరు కంపెనీ వ్యాపార నీతి, పరిశ్రమ ప్రమాణాలను ఉల్లంఘించిందని కస్టమ్స్ కమిషనర్ సోనాల్ బజాజ్ పేర్కొన్నారు. లాభాలను పెంచుకునే ఉద్దేశంతో మాత్రమే శామ్ సంగ్ అవకతవకలకు పాల్పడిందని కస్టమ్స్ అధికారులు పేర్కొంటున్నారు. 2021లో కస్టమ్స్ అధికారులు ముంబయి, గురుగ్రామ్‌లోని శామ్ సంగ్ కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో పలు పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత కంపెనీకి చెందిన సీనియర్ అధికారులను కస్టమ్స్ విచారించింది. ఆర్ఆర్‌హెచ్ ట్రాన్సీవర్ కేటగిరిలో ఉందని.. అది కూడా సుంకాలకు లోబడి ఉందని ప్రభుత్వం పేర్కొంది. అయితే, కంపెనీ మాత్రం వ్యతిరేకించింది. ఆర్ఆర్‌హెచ్ ట్రాన్సీవర్‌గా పని చేయదని, దాంతో టారిఫ్ మినహాయింపులకు అర్హత, దిగుమతి సుంకాలు విధించరాదని కంపెనీ వాదిస్తున్నది. ఈ క్రమంలోనే కంపెనీకి కేంద్రం ఏడుగురు శామ్ సంగ్ ఎగ్జిక్యూటివ్‌లకు రూ.694 కోట్ల వ్యక్తిగత జరిమానా, మరో రూ.4460కోట్లు కంపెనీకి పన్ను విధించింది.

# పెరుగుతున్న విద్యుత్ వినియోగం

## మండుటెండలతో అధిక వాడకం

## విద్యుత్ అధికారుల అప్రమత్తం



అమరావతి : మంచినీటురు, విద్యుత్ సరఫరా విషయంలో సిఎం చంద్రబాబు కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడా సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. అయితే ఇప్పటికే సమస్యలు ముంచుకొస్తున్నాయి. నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సదరన్ డిస్కం పరిధిలోని ఎనిమిది జిల్లాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గతేడాది మార్చితో పోల్చుకుంటే ఈ ఏడాది మార్చిలో యూనిట్లు అధికంగా వినియోగించారు. సదరన్ డిస్కం పరిధిలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చి నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. దీంతో ప్రజలు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం పెంచారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టే పనిలో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యుత్ వినియోగం పెరిగినందున గ్రామీణ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచకపోతే సరఫరాలో ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. గతంలో ఎన్నడూ ఇంతగా వినియోగంలేదని విద్యుత్ శాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుదుత్పత్తి, సరఫరా బాగానే ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను తగినంతగా పెంచుకోకుంటే అవి తరచూ పేలిపోయే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎండ తీవ్రతకు రాష్ట్రం నిప్పులకొలిమిలా మారింది. ఉత్తరాది గాలులతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు వాతావరణం బాగా వేడెక్కింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర వేడి కొనసాగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రావడాని కే భయపడుతున్నారు. కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల 40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండుమూడు రోజులు ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. సూర్యుడు సెగలు కక్కుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొద్దిరోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రత నిత్యం 38డిగ్రీలు దాటు తోంది. ఇప్పుడే ఇలా ఉంటే ఇక ఏప్రిల్,మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ రోడ్లపై జనసంచారం కనిపించట్లేదు. భూగర్భజలాలు అడుగంటడం, భూతాపం పెరిగిపోవడంతో మంచినీటిసమస్య కూడా అధికం అవుతున్నది. బోర్లువేసి నీటిసమస్య కొంత తగ్గించాలని భావించినా ఎంత లోతుకు తవ్వినా నీళ్లు రాని పరిస్థితులు దాపురించాయి. వేసవి తాపంనుంచి ఉపశమనం పొందేందుకు ప్రభుత్వాలపరంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేవు. రాష్ట్రంలోని జలాశయాల్లో కూడా నీటివనరులు వేసవి తాపానికి ఆవిరి అవుతున్నాయి. మండుతున్న ఎండలు అటు శారీరక అస్వస్థతలు పెంచడంతో పాటు ప్రజల దాహార్తిని కూడా పెంచుతున్నాయి. ఉష్ణోగ్రత కు పక్షులు, పశువులు అసువులు బాస్తున్నాయి. ఉదయం పదిగంటలు దాటినప్పటినుంచీ రహదారులన్నీ నిర్మానుష్యం గా మారుతున్నాయి. ఉష్ణోగ్రత ప్రభావం, వడగాడ్పులు తీవ్రతరం కావడంతో రాష్ట్రంలో రేడియేషన్ ప్రభావం కూడా పెరుగుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# దీపం-2 పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : నాదెండ్ల మనోహర్

అమరావతి : పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. దీపం-2 పథకంలో భాగంగా తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ మార్చి 31 వరకే అవకాశం ఉందని ఇప్పటి వరకు పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలని ఆహార పౌరసరఫరాల, వినియోగదారుల నాదెండ్ల మనోహర్ సూచించారు. ప్రతి పేద ఆడబిడ్డకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామన్న హామీ మేరకు కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఇప్పటి వరకు 98 లక్షల మంది తొలి ఉచిత గ్యాస్ సిలిండర్స్ వినియోగించుకున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఏపీలో సూపర్ సిక్స్ హామీని కూటమి సర్కార్ నిలబెట్టుకుంటోందన్నారు. ఉచిత సిలిం డర్ కావాల్సిన వారు సాధారణ పద్ధతిలో ముందుగా సొమ్ము చెల్లించవలసి ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో బుక్ చేసిన 24 గంటల లోపు.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే 48 గంటల లోపు గ్యాస్ డెలివరీ చేస్తారని మంత్రి నాదేండ్ల అన్నారు. ఆ తర్వాత సిలెండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్దిదారుల ఖాతాల్లో తిరిగి జమ అవుతుందన్నారు. ఒక సంవత్సరంలో 3 గ్యాస్ సిలిండర్లు ఇలా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అయితే వీటిని ఒకేసారి కాకుండా నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకునే అవకాశం కూడా ఉందని మంత్రి చెప్పారు.

# కూటమి సర్కార్ మరో కీలక నిర్ణయం

## విశాఖలో లూలూ గ్రూపునకు తిరిగి భూ కేటాయింపు

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి : చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం హార్బర్ పార్క్ సమీపంలో లూలూ గ్రూప్‌నకు గతంలో కేటాయించిన 13.83 ఏకరాలను తిరిగి ఆ గ్రూప్‌నకు ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. విశాఖపట్నంలో లూలూ గ్రూప్ నిర్మించనున్న షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టం చేసింది. అలాగే ఏపీఐఐసీ ద్వారా లూలూ గ్రూప్‌నకు విశాఖలో భూకేటాయింపులు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అదే విధంగా విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్కులో ఉన్న 13.43 ఎకరాలను ఏపీఐఐసీకి బదలాయించాలని వీఎంఆర్డీఏకు ప్రభుత్వం ఆదేశించింది. విశాఖపట్నం నగరంలో లూలూ గ్రూప్ సంస్థ అంతర్జాతీయ స్థాయి మాల్ నిర్మాణం, పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదించినట్టు పరిశ్రమల శాఖ ఇప్పటికే వెల్లడించింది. 2017లోనే విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్కులో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు లూలూ గ్రూప్ ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 2023లో లూలూ గ్రూప్‌నకు గత ప్రభుత్వం చేసిన భూకేటాయింపులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం మళ్లీ షాపింగ్ మాల్‌తోపాటు- హైపర్ మార్కెట్‌ల నిర్మాణం చేసేందుకు లూలూ గ్రూప్ ముందుకు వచ్చింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించి భూ కేటాయింపులు చేయాల్సిందిగా ఏపీఐఐసీని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఆదేశించారు. 2014లో ఏపీలో టిడీపీ ప్రభుత్వం కొలువు తీరగానే విశాఖపట్నంలో లూలూ గ్రూప్ పెట్టుబడులు పెట్టేందుకు.. నాటి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక గత టీడీపీ ప్రభుత్వం చేసుకున్న పలు ఒప్పందాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. అందులో లూలూ గ్రూప్ సైతం ఉంది. అయితే లూలూ గ్రూప్ తమిళనాడులో తన పెట్టుబడులు పెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో ఈ ఏడాది జనవరిలో సీఎం చంద్రబాబుతో లూలూ గ్రూప్ సంస్థల అధినేత అమరావతిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు లూలూ కంపెనీ తన ఆసక్తిని కనబరిచింది. దీంతో గతంలో కేటాయించిన భూమిని తిరిగి కేటాయిస్తూ.. కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.విశాఖలో లులూ గ్రూప్ నిర్మించనున్న షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏపీఐఐసీ ద్వారా లులూ గ్రూప్‌నకు విశాఖలో భూకేటాయింపులు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్కులో ఉన్న 13.43 ఎకరాలను ఏపీఐఐసీకి బదలాయించాలని వీఎంఆర్డీఏకు ఆదేశాలు జారీ చేసింది. లులూ గ్రూప్ సంస్థ విశాఖ నగరంలో అంతర్జాతీయ స్థాయి మాల్ నిర్మాణం పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదించినట్టు- పరిశ్రమల శాఖ వెల్లడించింది. 2023లో లులూ గ్రూప్‌నకు చేసిన భూకేటాయింపులను వైకాపా ప్రభుత్వం రద్దు చేసింది.

# తిరుమల విద్యాదాన ట్రస్టుకు విరాళం

తిరుమల : రాజమహేంద్రవరానికి చెందిన తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, నున్న సరోజినిదేవి దంపతులు తిరుమల శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు బుధవారం రూ.1,01,11,111 విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకులు మండపంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను చైర్మన్, అదనపు ఈవో అభినందించారు. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. ఎంబీసీ వరకు భక్తులు క్యూలైన్లో నిలబడి ఉన్నారు. టోకెన్లు లేని భక్తుకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 64,252 మంది భక్తులు దర్శించుకోగా 25,943 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.68 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

# కొత్త జిల్లాలోని అధికారులకు పూర్తిస్థాయి అధికారాలు ఇవ్వాలి : సీఎం చంద్రబాబు

అమరావతి : జిల్లాలోని అధికారులతో సంబంధం లేకుండా కొత్త జిల్లాలో అధికారులకు పూర్తిస్థాయి అధికారులు ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రెండవ రోజు కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాలోని అధికారులు స్వేచ్ఛగా వారి విధులను నిర్వహించుకునే అవకాశం కల్పించాలన్నారు. దీనిపై సంబంధించిన ఆదేశాలను హెచ్ఓడీలు రెండు రోజుల్లో జారీ చేయాలని తెలిపారు. కొత్త జిల్లాలలో ఎటువంటి స్టాఫ్ సమస్య లేకుండా స్టాఫ్ రెగ్యులేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పని ఒత్తిడికి తగ్గట్టుగా అధికారులు, సిబ్బందిని కేటాయించాలని వెల్లడించారు. ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లోనూ ప్రత్యేకించి కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్లలో కనీసం మూడు హెటల్స్ ఉండేలా చూడాలన్నారు. కొత్త జిల్లాల్లో మౌలిక వసతుల కల్పన అంశంపై కూ డా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై రాష్ట్రస్థాయిలో చర్చిస్తున్నామని సీఎం అన్నారు. పేదరిక నిర్మూలనకు సంపదను సృష్టించే టూరిజం తదితర అం శాలకే భవిష్యత్తు అంతా ప్రాధాన్యతనిస్తుందని, భౌతిక వాదమే వస్తుందని అన్నానని.. కాబట్టి తాను చెప్పేదంతా జిల్లా కలెక్టర్లు అందరూ అర్థం చేస్తుకుని క్షేత్ర స్థాయిలో రియల్ టైమ్‌లో అమలుపరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. ఏపీలో ఐదు జోన్‌లు ఉన్నాయన్నారు. జోన్-1 లో విశాఖపట్నం, జోన్-2 లో రాజమండ్రి, జోన్-3 లో రాజదాని అమరావతి, జోన్-4 లో తిరుపతి, జోన్-5 లో అనంతపురం పవర్ హబ్‌లుగా ఉన్నాయని తెలిపారు. ఆ పవర్ హబ్ల ఆధారంగా ఆయా జోన్లలోని అన్ని జిల్లాలను అభివృద్ధి పర్చే విధంగా జిల్లా కలెక్టర్లు జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలుపరిస్తే రాష్ట్ర భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుందని వెల్లడించారు. ప్రతి ఒక్క జోన్‌కు ఒక సీనియర్ అధికారిని ఇన్‌చార్జిగా ఉంచామన్నారు. ప్రతి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి కూడా ఉన్నారని తెలిపారు. వీరందరూ కలిసి ఆయన జిల్లాలను, ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో సమగ్రంగా చర్చించి క్షేత్ర స్థాయిలో తగు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారుర. గ్రామాల్లోని వాస్తవ విషయాలను తెలుసుకుని అందుకు తగ్గట్టుగా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించే విధంగా, గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటిని రియల్ టైమ్‌లో పరిష్కరించేందుకై వచ్చే మాసం నుంచి సీనియర్ అధికారులు అంతా గ్రామాల్లో మూడు నాలుగు రోజులు పృటించాలని ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

# పారదర్శకంగా వృత్తి పన్ను వసూళ్లు

## ఏప్రిల్ 1 నుంచి వృత్తి పన్ను వసూలు

## రాష్ట్ర పన్నుల జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్

విజయవాడ : వృత్తి పన్ను వసూళ్లను సరళీకృతం చేసి మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని విజయవాడ 1, 2 డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా వృత్తి పన్నుదారుల నుంచి పన్నుల వసూలును పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వృత్తి పన్ను వసూలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖకు అప్పగించడం జరిగిందని వెల్లడించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వృత్తి పన్ను వసూళ్లను వాణిజ్య పన్నుల శాఖకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.63 జారీచేసిందని, ఇది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. వివిధ వర్గాలకు చెందిన వేతన జీవులు, వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు వారికి నిర్దేశిరచిన రేట్ల ప్రకారం వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటు-ందన్నారు. దుకాణ యజమానులు, రూ. 10 లక్షల కంటే అధిక వార్షిక టర్నోవర్ ఉన్న జీఎస్టీ పన్ను చెల్లింపుదారులు వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు నెలకు రూ. 15 వేల కంటే ఎక్కువ జీతం చెల్లిస్తున్న యజమానులు ఉద్యోగుల తరపున ప్రభుత్వానికి వృత్తి పన్ను చెల్లించాలని ఆయన వివరించారు. 2025, మార్చి పన్ను కాలానికి నెలవారీ ప్రొఫెషనల్ ట్యాక్స్ రిటర్న్‌ను వెబ్‌సైట్లో లాగిన్ అయి దాఖలు చేయాలని జాయింట్ కమిషనర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

# పశ్చిమ గోదావరి జిల్లా అభివృద్ధకి చర్యలు

## మొల్తూరు, పెరుగొండ సమస్యలపై దృష్టి

## డిప్యూటి సిఎం ఆదేశాలతో 28న గ్రామసభలు

అమరావతి : గ్రామీణిభివృద్ధి శాఖను ప్రత్యేక స్వీకరించి, అభివృద్ధిపై దృష్టి సారించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పశ్చిమ గోదావరి జిల్లాపై ఇప్పుడు ఫోకస్ పెట్టారు. చిన్నతనంలో పవన్ పెరిగిన ప్రాంతాలైన మొగల్తూరు, పెనుగొండ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇప్పటికే తన పేషీ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో, మొగల్తూరు, పెనుగొండ గ్రామాల అభివృద్ధికి కోసం ఈ నెల 28న గ్రామ అభివృద్ధి సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 28వ తేదీ ఉదయం మొగల్తూరు, సాయంత్రం పెనుగొండల్లో గ్రామలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేషి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న అభివృద్ధి సభల్లో గ్రామస్తులు, అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. ఆయా గ్రామాలకు కావల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై చర్చించి వాటిపై దృష్టిపెడతారు. అదే సమయంలో అయా గ్రామాల్లో ఉన్న వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను సైతం అధికారులు స్వీకరించి వాటి పరిష్కారంపై దృష్టిపెడతారు. తమ గ్రామాలకు సంబంధించి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారని.. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు చెప్పుకునే అవకాశం రావడంతో పెనుగొండ, మొగల్తూరు గ్రామానికి చెందిన ప్రజలు వివిధ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ, ఫైర్ ఇంజన్లు, ఇతర మౌలిక వసతుల కల్పన అంశాలపై అధికారులకు విన్నవించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే సమయంలో పెనుగొండ గ్రామానికి సంబంధించి ఉన్న సమస్యలు అన్నింటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు సభకి హాజరుకావాలని ఇప్పటికే జనసేన నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.. మరోవైపు మొగల్తూరు గ్రామంలో ఎప్పటి నుంచో ఇబ్బందికరంగా ఉన్న డ్రైనేజీ, రహదారుల విస్తరణ వంటి అంశాలతో పాటు- పర్యాటకంగా ప్రాంతంలో అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలపై అధికారులకు విన్నవించేందుకు సిద్ధమవుతున్నారు. వర్షాకాలంలో మురుగునీరు నేరుగా పంట కాలవల్లోకి చేరుతున్న పరిస్థితిపై అక్కడే రైతులకు జరుగుతున్న నష్టాన్ని వివరించేందుకు రైతుల సైతం సిద్ధమవుతున్నారు. ఇంతకాలం సమస్యలు అపరిష్కృతంగా ఉండడానికి కారణాలు ఏంటి, భవిష్యత్తులో ఆయా గ్రామాల్లో చేయబోయే అభివృద్ధి పనులు ఏంటనే అంశాలను మరింత లోతుగా ఆరా తీస్తున్నారు.

# సిఎం రేవంత్‌ను కలిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే

## కూకట్‌పల్లి సమస్యలపై ప్రస్తావన ..నిధుల విడుదలకు వినతి

హైదరాబాద్ : కూకట్ పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్టారావు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీల ఛాంబర్లో సీఎం రేవంత్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నూతన రోడ్ల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి నూతన పైప్ లైన్ ల నిర్మాణం, పార్కులు, శ్మశాన వాటికల నిర్మాణం పనులకు) సుమారుగా రూ. 25-30 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా కూకట్‌పల్లి మండలం పరిధిలోని హైదర్‌నగర్ గ్రామం సర్వే నెంబర్ 145,163 లలో నిర్మాణ అనుమతులను నిలిపివేసి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దశాబ్దాల కాలంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా గానీ ప్రభుత్వపరమైన అన్ని అనుమతులను జారీ చేశార చెప్పారు. ఇటీ-వల కాలంలో అకస్మాత్తుగా నిర్మాణ అనుమతులను నిలిపివేశారని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. అదే విధంగా జేఎన్టీయూ వెనుక ఉన్న సాయినగర్ కాలనీ వాసుల ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. 2014 కు ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు డబ్బులు చెల్లించేందుకు కాలనీ వాసులు సిద్ధంగా ఉన్నారని వారికి న్యాయం చేయాలని కోరారు. అన్ని విషయాలను వివరంగా తెలుసుకున్న సీఎం రేవంత్ వినతి పత్రాలను సంబంధిత అధికారులకు పంపిస్తానని త్వరలోనే పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

# జడ్పీటిసి ఖాళీల భర్తీ తరవాతే ఎన్నిక

## కడప జడ్పీటిసి పై హైకోర్టులో పిటిషన్

అమరావతి : ఉమ్మడి కడప జిల్లా.. జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక వివాదం ఇప్పుడు హైకోర్టు వరకు చేరింది.. జడ్పీ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయాలంటూ గోపవరం జడ్పీటీసీ జయరాం రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కడప జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ నెల 27న జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఖాళీగా ఉన్న 2 స్థానాలకు ఎన్నికలు జరపకుండా చైర్మన్ ఎన్నిక జరపడం వల్ల తాను నష్టపోతున్నట్లు- అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తాను జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికలలో పోటీ- చేయనున్నానని.. ఖాళీగా ఉన్న స్థానాలకు ఎన్నికలు జరగకపోవడం వల్ల తనకు నష్టం జరుగుతున్నట్లు- ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఖాళీగా ఉన్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకుండా, జడ్పీ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వడంపై ఆయన సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.. జడ్పీ చైర్మన్ ఎన్నికపై ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్ ను వాయిదా వేయాలని అందులో పేర్కొన్నారు. టీ-డీపీ జడ్పీ చైర్మన్ రేస్ లో లేదని అంటూనే మరో ప్రక్క టీ-డీపీ జడ్పీటీసీ జయరాం రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయడంపై మరోమారు ఉత్కంఠ నెలకొంది. అయితే, టీడీపీ జడ్పీటీసీ జయరాం రెడ్డి వేసిన పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరగనుంది..

## ఇసుక అక్రమ రవాణాకు చెక్

కరీంనగర్ : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై దొంగతనం కేసులు నమోదు చేస్తామని మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. పట్టుబడిన వాహనాల డ్రైవర్లు, యజమానులపై కూడా కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుకను అక్రమంగా నిల్వ చేయొద్దనీ, అలా చేస్తే సంబంధిత భూ యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి, ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో ఇసుక నిల్వలపై గడ్డి కప్పి ఉంచేవారని, ప్రస్తుతం ఎవరికీ అనుమానం రాకుండా ఇసుకపై ఎర్రమట్టి నింపుతున్నారని చెప్పారు. స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, క్యూఆర్‌టీ విభాగాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు

# మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఏలూరు : జిల్లాల్లో ఈ వేసవిలో ఎక్కడా కూడా తాగునీటి ఇబ్బంది అనే మాట లేకుండా చర్యలకు ఉపక్రమించారు. అవసరమైతే ప్రత్యేక మోటర్లు ద్వారా నీటిని చెరువుల్లోకి మళ్లించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో తహశీల్దార్లు ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రత్యేక చలివేంద్రాలు నెలకొల్పాలని కలెక్టర్ ఆదేశించారు. వేసవిలో సాధ్యమైనంత వరకు ప్రజలు సుదూర ప్రయాణాలను ఉదయం వేళల్లో, లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే చేయాలి తప్ప మండు వేసవిలో ప్రయాణాలు చేయవద్దని సూచించారు. జిల్లాలో రబీ పంట చేతికొచ్చిన దృష్ట్యా రైతులకు పూర్తిస్థాయిలో గిట్టుబాటు ధర కల్పించడానికి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అగ్నిమాపక యంత్రాలు పూర్తి కండిషన్‌తో ఉంచాలన్నారు.

# కాళేశ్వరం ఎలా వినియోగించాలో చూపిస్తాం

**చేతగాకపోతే తప్పకోవడం మేలు**

**దోచుకోవడం..దాచుకోవడం కాంగ్రెస్ నైజం**

**ఎండిన పంటపొలాలను పరిశీలించిన జగదీశ్ రెడ్డి**

సూర్యాపేట : కాంగ్రెస్ ప్రభుత్వంలో దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి ఏమి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శించారు. బుధవారం చివ్వెంల మండలం మొగ్గాయగూడెంలో ఎండిపోయిన పంట పొలాలను బీఆర్ఎస్ నేతలతో కలిసి జగదీష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సోయిలేకుండా ప్రవర్తిస్తోందని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ తీసుకున్నడు.. కానీ దానిపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. పాలన చేతగాక పోతే మాకు అప్పగించండి.. కాలేశ్వరం నీటిని ఏ విధంగా విడుదల చేయాలో చేసి చూపిస్తామని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కేసీఆర్ అద్భుతమైన ప్రణాళికతో తెలంగాణను భారతదేశంలోనే నెంబర్ వన్‌గా చేశాడని.. కాంగ్రెస్ వచ్చాక ఆర్థిక రంగం మొత్తం కుదేలై వెనకబడే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. ఈ ఏడాది ప్రజల ఖజానాకు రావాలసిన రూ.15 వేల కోట్ల డబ్బులు మీ జేబుల్లోకి పోయిందని స్పష్టంగా అర్థమవు తుందని ఆరోపించారు. తెలంగాణ కోసం కేసీఆర్ పడ్డ పదేళ్ల కష్టం నామరూపల్లె లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏండ్లలో అభివృద్ధి చేసి చూపిస్తే సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ తెలంగాణను నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. ఇకనైనా ప్రభుత్వం సాగునీరు ఇస్తే కొన్ని పొలాలైనా చేతికొచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఆలోచించి తక్షణమే రైతులకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కు విజ్ఞప్తి చేస్తున్నాం.. చివరి పంటకు సాగుకైన నీటిని విడుదల చేయాలన్నారు.




# ఆ అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాలిందే..!

యంగ్ బ్యూటీ శ్రీలీల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ నటి తన అందంతో ఎంతో మంది మదిని దోచింది. పెళ్లిసందడి సినిమాతో తెలుగు వెండితెరపైకి అడుగు పెట్టి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. అంతే కాకుండా మొదటి సినిమాతోనే మంచి ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది ఈ నటి. ఈ మూవీ తర్వాత శ్రీలీలకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. ముఖ్యంగా రవితేజ ధమాక సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ సినిమాలో ఈ అమ్మడు డ్యాన్స్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. ఇక ఈ సినిమా తర్వాత శ్రీలీల గుంటూరు కారం, స్కంద, భగవంత్ కేసరి, ఎక్స్ టాఆర్డినరీ బ్యాన్ ఇలా వరస సినిమాలు చేసింది. కానీ ఈ ముద్దుగుమ్మకు అదృష్టం మాత్రం కలిసి రాలేదనే చెప్పాలి. వరసగా ఆఫర్స్ వచ్చినా అవి బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అవ్వడంతో ఒక్కసారిగా శ్రీలీల క్రేజ్ తగ్గిపోయింది. దీంతో అవకాశాలు కూడా అంతగా లేకపోవడంతో ఈ అమ్మడు కాస్త సైలెంట్ అయ్యింది. పుష్ప 2 సినిమాలో కిసక్కీ అంటూ తన డ్యాన్స్ గ్లామర్‌తో తెలుగు అభిమానులను పలకరించిన శ్రీలీల మరోసారి రాబిన్ హుడ్ మూవీ ద్వారా థియేటర్లో సందడి చేయడానికి రెడీ అయిపోయింది. అయితే తాజాగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న శ్రీలీల స్కైబ్లూ కలర్ చీరలో కనిపించి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ శారీలో ఈ ముద్దుగుమ్మ అందాలను చూస్తే ఎవ్వరైనా సరే ఫిదా అవ్వాల్సిందే. అంతలా తన గ్లామర్‌తో ఆకట్టుకుంది కిసక్కీ బ్యూటీ. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ఫొటోస్ చూసిన నెటిజన్స్ నీలిరంగు చీరలో చందమామలా చాలా అందంగా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు.




## ఆనందోబ్రహ్మకు సీక్వెల్

తెలుగు సినీ పరిశ్రమలో ఇప్పుడు సీక్వెల్స్‌కు, ఫ్రాంచైజీలకు మంచి సీజన్ నడుస్తోంది. ప్రస్తుతం తెలుగులో పలు సీక్వెల్స్ సెట్స్ మీద వున్నాయి. ఇందులో ఈ భాగంగానే తాప్సీ కథానాయికగా నటించిన విజయవంతమైన హారర్ కామెడీ థ్రిల్లర్ ఆనందో బ్రహ్మకు సీక్వెల్ రాబోతుంది. ఇంతకు ముందు ఆనందో బ్రహ్మ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శక నిర్మాత మహి.వి.రాఘవ ఈ సీక్వెల్‌ను రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నాడు.ప్రస్తుతం ఆనందో బ్రహ్మకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ మొదలయ్యాయి. అయితే ఈ చిత్రం మొదటిభాగంలో నటించిన కథానాయిక తాప్సీని ఒప్పించే పనిలో వున్నాడు మహి. ఈ సీక్వెల్ కోసం ఆమెను సంప్రదించి ఒప్పించినట్లు తెలిసింది. అంతేకాదు ఈ సినిమలో ఓ యంగ్‌హీరో కూడా ముఖ్యపాత్రలో కనిపించబోతున్నాడు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని చేయాలనే ఆలోచనలో వున్నారు దర్శక నిర్మాతలు. ఆనందో బ్రహ్మను తమిళంలో పెట్రోమాక్స్‌గా రిమేక్ చేయగా.. ఇందులో తమన్నా కథానాయికగా నటించింది.



# అఖిల్ అక్కినేనికి కలసిరాని కాలం

### ఓ మంచి సినిమా కోసం తండ్రి నాగ్ యత్నాలు

హీరోగా అఖిల్ అక్కినేనికి కలిసి రావడం లేదు. చిన్నప్పుడు చేసిన 'సిసింద్రీ', గెస్ట్ అప్పీరియెన్స్ ఇచ్చి 'మనం' మినహా.. అఖిల్‌కు చెప్పుకోవడానికి సరైన హిట్ ఇంత వరకు పడలేదనే చెప్పుకోవాలి. ఎలాగైనా అఖిల్‌కి ఓ బ్లాక్‌బస్టర్ ఇవ్వాలని తండ్రి నాగార్జున చేయని ప్రయత్నాలు లేవు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కి ఎన్నో అంచనాల నడుమ విడుదలైన 'ఏజెంట్' మూవీ కూడా అఖిల్‌కు సక్సెస్‌ని ఇవ్వలేకపోయింది. ఆ సినిమా వచ్చి సంవత్సరం పూర్తయినా.. ఇంత వరకు అఖిల్ తర్వాత సినిమాకు సంబంధించి ఎటువంటి ప్రకటనా రాలేదంటే.. అఖిల్ విషయంలో అక్కినేని ఫ్యామిలీ ఎంత డైలామాలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అసలు అఖిల్ కు ఎలాంటి సినిమా పడాలి? అఖిల్‌ని ఎలా ప్రేక్షకులలో నిలబెట్టాలి? అనే ఆలోచనలో ఉన్న అక్కినేని ఫ్యామిలీ.. చివరకు ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. అఖిల్ చేయబోయే తదుపరి సినిమా కోసం.. కింగ్ నాగార్జునతో పాటు యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య కూడా రంగంలోకి దిగబోతున్నట్లుగా టాలీవుడ్‌లో టాక్ వినబడుతోంది. నాగార్జున, నాగచైతన్యలు.. అఖిల్ తదుపరి సినిమాను నిర్మించాలనే ఆలోచనలో ఉన్నారట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి అనౌన్స్‌మెంట్ రానుందనేలా టాలీవుడ్ సర్కిల్స్‌లో వార్తలు వినబడుతున్నాయి. వాస్తవానికి 'ఏజెంట్' తర్వాత అఖిల్ చేయబోయే సినిమా యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో ఉంటుందనేలా ఏడాది కాలంగా ప్రచారం జరుగుతూనే ఉంది కానీ.. ఈ ప్రాజెక్ట్ ముందుకు వెళుతున్నట్లుగా అయితే ఎటువంటి అప్డేట్ ఇంత వరకు రాలేదు. ఆ ప్రాజెక్ట్ సంగతి ఏమోగానీ.. ఇప్పుడు ఓ యువ దర్శకుడు చెప్పిన స్టోరీ నచ్చటంతో అఖిల్‌తో సినిమా చేసేందుకు నాగార్జునతో పాటు, నాగ చైతన్య కూడా రంగంలోకి దిగుతున్నట్లు సమాచారం. కిరణ్ అబ్బవరంతో 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి హిట్టు సినిమా తీసిన మురళీ కిషోర్ చెప్పిన కథ నచ్చడంతో.. అఖిల్ నెక్స్ట్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా ఉండబోతుందని, ఈ సినిమాకు 'లెనిన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లుగా తెలుస్తోంది. అంతా సెట్టయితే.. అన్నపూర్ణ స్టూడియోస్‌కు అనుబంధంగా మనం ఎంటర్‌ప్రైజెస్ అనే బ్యానర్‌లో ఈ సినిమాను నాగార్జున, చైతన్య నిర్మించాలని చూస్తున్నారని టాక్. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఒక్క ఏడాదిలో భాగ్యశ్రీ బోర్సే మూడు సినిమాలు

మాస్ మాహారాజా రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. కానీ ఈ బ్యూటీ మాత్రం స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. తెలుగులో చేసిన ఒక్క సినిమా నిరాశపరిచింది కానీ... ఈ అమ్మడు స్పీడ్ మాత్రం మాములుగా లేదు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ చూస్తుండగానే స్టార్ బ్యూటీలను వెనక్కు నెట్టేస్తోంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టాలీవుడ్ అవుతోంది ఈ బ్యూటీ. ఫస్ట్ సినిమాతోనే యాక్టింగ్, గ్లామర్ పరంగా మంచి మార్కులే కొట్టేసిన ఈ వయ్యారి.. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ సరసన కాంత సినిమాలో నటిస్తుంది. అలాగే విజయ్ దేవరకొండ జోడిగా కింగ్ డమ్ మూవీ చేస్తుంది. ఇవే కాకుండా తెలుగులో మరిన్ని ఆఫర్స్ కొట్టేసింది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేనితో కలిసి కొత్త ప్రాజెక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ ఏడాదిలోనే ఏకంగా మూడు సినిమాలో అడియన్స్ ముందుకు రానుంది ఈ వ్యయారి. కింగ్ డమ్ సినిమాలో మేలో రిలీజ్ కానుంది. రామ్ పోతినేనితో చేస్తోన్న సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే నటిస్తోన్న కాంత మూవీ ఈ ఏడాది చివర్లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే మూడు సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనుంది.



# రాజ్‌తో రిలేషన్‌షిప్...త్వరలోనే పెళ్లి

### దూత వెబ్‌సీరిస్ నటి ప్రియా భవానీ శంకర్ వెల్లడి

'ధూత'వెబ్ సిరీస్‌తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి ప్రియా భవానీ శంకర్ తాజాగా తన పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజ్ అనే వ్యక్తితో తాను దాదాపు పదేళ్ల నుంచి రిలేషన్‌లో ఉన్నానని తెలిపారు. వివాహ బంధంలోకి అడుగుపెట్టాలని ఎప్పటినుంచో అనుకుంటున్నామని.. వచ్చే ఏడాది తప్పకుండా పెళ్లి చేసుకుంటామన్నారు. సినీ పరిశ్రమలోకి రాక ముందునుంచే రాజ్‌తో నేను ప్రేమలో ఉన్నా. మేమిద్దరం విడిపోయామంటూ ఇప్పటికే ఎన్నోసార్లు వార్తలు వచ్చాయి. వాటిని పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటివరకూ నేను చాలామంది నటులతో కలిసి వర్క్ చేశా. వారితో ఉన్న స్నేహం కారణంగా.. పుట్టినరోజు, లేదా ఏదైనా స్పెషల్ డే వచ్చినప్పుడు వారికి విషెస్ చెబుతూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టేదాన్ని. అలా, పెట్టడమే ఆలస్యం.. వారితో నేను రిలేషన్‌లో ఉన్నానంటూ వార్తలు వచ్చేవి. అదృష్టంకొద్దీ ఇప్పుడు ఆ తారలకు పెళ్లి కూడా అయింది అని ఆమె నవ్వుతూ చెప్పారు. చెన్నైకు చెందిన ప్రియా భవానీశంకర్.. 'మేయాద మాన్'తో నటిగా తెరంగేట్రం చేశారు. 2023లో విడుదలైన 'కళ్యాణం కమనీయం'తో ఆమె తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. సంతోష్ శోభన్ హీరోగా నటించిన ఆ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. అనంతరం ఆమె 'ధూత'లో నాగచైతన్య సతీమణిగా కనిపించి ప్రేక్షకులను అలరించారు.





# ఓటీటీలో దుమ్మురేపుతున్న గేమ్‌ఛేంజర్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా నటించిన చిత్రం గేమ్ ఛేంజర్. దిగ్గజ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌ను అందుకుంది. ఆర్‌ఆర్‌ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా కావడంతో మెగా అభిమానులు భారీ నమ్మకం పెట్టుకున్నారు. అయితే శంకర్ అదే పాత స్టోరీతో ప్రేక్షకుల ముందు రావడంతో భారీ నష్టాన్ని చవి చూసింది. రూ.450 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా రాగా దాదాపు రూ.150 కోట్ల నష్టం వచ్చినట్లు సమాచారం. అయితే ఈ సినిమా ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషల్లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. అయితే తాజాగా ఈ మూవీ హిందీ వెర్షన్‌ని జీ5 ఓటీటీ వేదిక మార్చి 07న విడుదల చేసింది. హిందీ వెర్షన్ ఓటీటీలోకి వచ్చిన తొలిరోజు నుంచే ఈ సినిమా టాప్ టెన్‌లో దూసుకుపోతుంది. ఈ చిత్రం హిందీలో ఇప్పటివరకూ 250 మిలియన్ మినిట్స్‌కు పైగా వ్యూస్ సాధించినట్లు జీ5 ఎక్స్ వేదికగా పంచుకుంది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రామ్‌నందన్ (రామ్‌చరణ్) విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకుంటాడు. ఇదే సమయంలో అభ్యుదయ పార్టీ నాయకుడు, ముఖ్యమంత్రి సత్యమూర్తి (శ్రీకాంత్) పదవీకాలం మరో ఏడాదిలో ముగుస్తుంది. సత్యమూర్తి కొడుకు బొబ్బిలి మోపిదేవి (ఎస్.జె.సూర్య) ముఖ్యమంత్రి కుర్చీపై కన్నేస్తాడు. తండ్రిని అడ్డుతొలగించి పదవి కోసం ఓ పన్నాగం పన్నుతాడు. సరిగ్గా ఇదే సమయంలో రామ్‌నందన్‌కు సంబంధించిన ఓ రహస్యం బయటపడుతుంది. ఏమిటా రహస్యం..? రామ్‌నందన్‌కు సత్యమూర్తికి వున్న అనుబంధం ఏమిటి..? ఈ కథలో అప్పన్న (రామ్‌చరణ్) ఎవరు? ముఖ్యమంత్రి కుర్చీ కోసం మోపిదేవి చేసిన కుట్రలని రామ్‌నందన్ ఎలా తిప్పికొట్టాడు? ఇవన్నీ తెరపై చూడాలి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com